www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★




యుద్ధం రెచ్చగొట్టేదీ.. శాంతిజపం చేసేదీ అమెరికానే! 02
గాజాపై ట్రంప్ 20 అంశాల శాంతిమంత్రం
మూఢత్వం, ఛాందసం ముసుగులో ఆధునిక మానవుడు 06

సంపుటి 28, సంచిక: 109 | గురువారం | 09-10-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

# బిసి కోటాపై కొనసాగుతున్న ఉత్కంఠ




## పిటిషన్లపై హైకోర్టులో నేడూ జరగనున్న వాదనలు

నిబంధనలకు విరుద్ధంగా స్థానిక సంస్థల్లో ప్రభుత్వం రిజర్వేషన్లు అమలుచేస్తోందని వాదించిన పిటిషనర్లు

రాజకీయాలకు అతీతంగా బిసి రిజర్వేషన్లకు మద్దతు లభించిందన్న ప్రభుత్వ తరఫు న్యాయవాది

ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున కోర్టులు జోక్యం చేసుకోవద్దన్న అభిషేక్ మను సింఘ్వీ

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేస్తూ మధ్యంతర ఆదేశాలు ఇచ్చేందుకు హైకోర్టు సుముఖత చూపలేదు. విచారణను గురువారానికి వాయిదా వేస్తే అప్పటిలోగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని, ఎన్నికల అంశంపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ల లాయర్లు పలుసార్లు కోరినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఏవిధమైన మధ్యంతర ఉత్తర్వులూ జారీ చేయలేదు. విచారణను గురువారం మధ్యాహ్నం 2.15 గంటలకు వాయిదా వేసింది. అప్పుడు అందరి వాదనలూ వింటామని ప్రకటించింది. అవసరమైతే ఎలాంటి ఆదేశాలైనా జారీ చేయవచ్చునని చెప్పింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లు పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ 9ని కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డితో పాటు మరికొందరు పిటిషన్లు దాఖలు చేశారు. బిసి రిజర్వేషన్లకు అనుకూలంగా తమ వాదనలు కూడా వినాలంటూ సిపిఐ, కాంగ్రెస్ సహా కొందరు బిసి నాయకులు 30 మంది ఇంప్లీడ్ పిటిషన్లు వేశారు. వీటిని చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జిఎం మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ బుధవారం సుదీర్ఘంగా విచారించింది. తొలుత పలువురు లాయర్లు ఒకేసారి వాదనలకు రెడీ కావడంతో హైకోర్టు తరువాయి 2లో

# నామినేషన్లకు సిద్ధం కండి


కాంగ్రెస్ ఆశావహులకు పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపు

షెడ్యూల్ ప్రకారమే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని వ్యాఖ్య



ప్రజాపక్షం/హైదరాద్

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లకు సంసిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు పిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. బిసి రిజర్వేషన్ల అంశానికి సంబంధించి విచారణను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎకె సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారానికి వాయిదా వేస్తూ మధ్యాహ్నం 2.15 గంటలకు వాదనలు వింటామని వెల్లడించింది. ఈ నేపథ్యంలో బుధవారం అడ్వకేట్ జనరల్‌తో సమావేశమైన పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకారమే గురువారం నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశంఉందని,కాంగ్రెస్ జిల్లాల అధ్యక్షులంతా ఆశావహులందరితో నామినేషన్ల వేయించేందుకు అంతా సిద్ధం చేసుకోవాలని సూచించారు. బిసి రిజర్వేషన్లకు కేసుకు సంబంధించి హైకోర్టులో ప్రభుత్వం తరుపున బలమైన వాదనలు వినిపించామన్నారు. బిసి రిజర్వేషన్ల అంశానికి సంబంధించి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ఉందని ప్రతిపక్షాల ఆరోపణలు పట్టించుకునే అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.



# ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీరు

రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

**స్టాక్‌హోమ్:** ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీటిని సేకరించడం, వాతావరణంలోని హానికర కర్బన ఉద్గారాలను బంధించడం వంటి అసాధారణ పనులకు వీలు కల్పించే వినూత్న ఆవిష్కరణకు ఈ ఏడాది రసాయన శాస్త్రంలో అత్యున్నత పురస్కారం లభించింది. 2025 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతిని ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. జపాన్‌కు చెందిన సుసుము కిటగావా, ఆస్ట్రేలియాకు చెందిన రిచర్డ్ రాబ్సన్, తరువాయి 2లో



## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్

02

# నేడే తొలివిడత నోటిఫికేషన్



**ఉదయం 10.30 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ**

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ కొనసాగుతోంది. బిసి రిజర్వేషన్‌ల అంశంపై తెలంగాణ హైకోర్టులో విచారణలు జరుగుతుండగా గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సిద్ధమైంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని గురువారం ఉదయం 10.30గంటలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఆ వెంటనే అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. బిసి రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వాలని పిటిషనర్ కోరారు. అయితే పిటిషనర్ విజ్ఞప్తిని హైకోర్టు ధర్మాసనం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో గురువారం నుంచి ఎన్నికల ప్రక్రియ యథావిధిగా కొనసాగనుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తొలుత ఎంపిటిసి, జెడ్‌పిటిసి స్థానాలకు, ఆ తర్వాత సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఐదు దశల్లో జరిగే ఎన్నికల ప్రక్రియ ఈనెల 9న ప్రారంభమై తరువాయి 2లో

‘రిలీఫ్, రెస్పిఫ్రెష్’

# దగ్గు మందుపై నిషేధం

దగ్గు మందులో అత్యంత విషపూరితమైన పదార్థం గుర్తింపు : డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్

ప్రజాపక్షం/హైదరాబాద్




రాష్ట్రంలో రెండు దగ్గు మందులను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ల్యాబ్ పరీక్షల ప్రకారం గుజరాత్ రాష్ట్రానికి చెందిన ‘రిలీఫ్, రెస్పిఫ్రెష్’ రెండు దగ్గు మందులలో అత్యంత విషపూరిత పదార్థం కలుషితమైందని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) బుధవారం వెల్లడించింది. ఈ రెండు దగ్గు మందులను విక్రయించరాదని, రిటైల్, హోల్ సెల్లర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ఆస్పత్రులు ఈ మందులను విక్రయింకుండా పక్కన పెట్టాలని ఆదేశించింది. గుజరాత్‌కు చెందిన ‘రిలీఫ్ కాఫ్ సిరప్, రెస్ పిఫ్రెష్’ రెండు మందులను తక్షణమే నిలుపుదల చేయాలని సూచించింది. ఈ రెండు మందులను మధ్యప్రదేశ్, భూపాల్‌లోని డ్రగ్ టెస్టింగ్ లేబరేటరీలో పరీక్షలు తరువాయి 2లో

బేషరతుగా వాంగ్‌చుక్‌ను

# విడుదల చేయాలి

**కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్**



**న్యూఢిల్లీ:** హక్కుల కార్యకర్త, ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్‌ను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక బుధశారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న సమస్యల పరిష్కారానికిగాను లేహ్‌లదాఖ్ ప్రజాప్రతినిధులతో చర్చలను నిజాయతీగా, పారదర్శకంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. తప్పుడు కేసులు బనాయించి వాంగ్‌చుక్, ఆయన తోటివారిని నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రజాస్వామిక హక్కులను హరించడాన్ని, న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా అణచివేత ధోరణిని కేంద్రం అనుసరిస్తుండటాన్ని ఆక్షేపించింది. లదాఖ్ యువతలో పెరుగుతున్న నిరుద్యోగం, క్షీణిస్తున్న పర్యావరణం, పరిపాలన అంశాలపై ఢిల్లీకి పాదయాత్రలు, తరువాయి 2లో

బాణసంచా తయారీ కేంద్రంలో

# భారీ పేలుడు

**మండపేట/రాయవరం :** ఎపిలోని అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం బిక్కవోలు మండలాల సరిహద్దు ప్రాంతమైన కొమరిపాలెంలో బుధవారం బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఆరుగురు కూలీలు సజీవ దహనమయ్యారు. 12 మంది మంది తీవ్రంగా గాయపడగా తొలుత వీరిని రామచంద్రాపురం ఏరియా ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించగా అక్కడ వైద్యం పొందుతున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గల కారణం తరువాయి 2లో

## ఏడుగురు సజీవదహనం

ఎపిలోని కోనసీమ జిల్లాలో విషాదం



# వాణిజ్య ఒప్పందంతో భారత అభివృద్ధి వేగవంతం


బ్రిటన్ ప్రధాని స్టార్మర్



**ముంబయి:** యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలిగిన తర్వాత భారత్ – బ్రిటన్ మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందం కీలకమైనదని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ అన్నారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా భారత్ పర్యటనకు వచ్చిన స్టార్మర్... బుధవారం ముంబైలో పారిశ్రామిక వేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం భారత్ అభివృద్ధికి లాంచ్ ప్యాడ్ లాంటిదని అభిప్రాయపడ్డారు. 2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడానికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీని వల్ల ఇరు దేశాల మధ్య వాణిజ్యం సులభంగా, చౌకగా మారడమే కాకుండా అనేక తరువాయి 12లో

బందీలు–ఖైదీల జాబితాలు

# ఇచ్చిపుచ్చుకున్న హమాస్, ఇజ్రాయెల్




**షర్మ్–ఎల్–షేక్:** ఈజిప్టులో చర్చల సందర్భంగా ఇజ్రాయెల్–హమాస్ ప్రతినిధులు మధ్యవర్తుల ద్వారా బందీలు, ఖైదీల జాబితాలను ఇచ్చిపుచ్చుకున్నారు. చర్చల్లో పాల్గొన్న హమాస్ ప్రతినిధి తాహెర్ నును మాట్లాడుతూ, ఇజ్రాయెల్ ఎంతమంది ఖైదీలను విడుదల చేస్తోందో జాబితా ఇవ్వాలని తొలుత కోరారు. అలాగే ఇజ్రాయెల్ బందీల జాబితాను కూడా హమాస్ ఇస్తుందన్నారు. యుద్ధ విరమణకు ఉన్న ప్రతి ఆటంకాన్నీ తొలగించేందుకు మధ్యవర్తులు ఎంతో కృషి చేస్తున్నారని తాహెర్ నును చెప్పారు. బుధవారంనాటికి ఈ చర్చలు మూడోరోజుకు చేరాయి. ట్రంప్ శాంతి ప్రణాళికకు అనుగుణంగా ఈజిప్టులో జరుగుతున్న చర్చల్లో ఇజ్రాయెల్ జైళ్ళనుండి విడుదల చేసే పాలస్తీనా ఖైదీల జాబితాను ముందుగా విడుదల చేయాలని హమాస్ డిమాండ్ చేసింది. అందరిక్షేమం నిమిత్తం తమకు కొన్ని గ్యారంటీలు ఇవ్వాల్సిన అవసరం ఉందని హమాస్ అగ్రనాయకుడు ఖలీల్ హయ్యా తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## ఈక్వెడార్ అధ్యక్షుడిపై హత్యాయత్నం



**క్విటో:** ఈక్వెడార్ దేశాధ్యక్షుడు డేనియల్ నోబోయాపై మోటారు సైకిలుపై వచ్చిన ఒక దుండ హత్యాయత్నానికి పాల్పడింది. ఐతే ఆయన ఈ హత్యాయత్నం నుండి తప్పించుకుని సురక్షితంగా బయటపడ్డారు. మోటారుసైకిల్పై వచ్చిన ఒక దండు ఆయన కాన్వాయ్‌పై తుపాకీగుళ్ళవర్షం కురిపించింది. తర్వాత సిబ్బంది అప్రమత్తమై ప్రమాదాన్ని నివారించారు. ఈ ఘటనకు సంబంధించి ఐదురుగురు ముఖ్యులను అరెస్టు చేసినట్లు పర్యావరణ, ఇంధన శాఖామంత్రి మన్‌జానో చెప్పారు. ఉగ్రవాదం, హత్యాయత్నం నిబంధనల కింద నిందితులపై కేసులు నమోదు చేశారు. దక్షిణ అమెరికా వాయువ్యప్రాంత దేశం ఈక్వెడార్‌కు కొలంబియా, పెరూ,పసిఫిక్ సముద్రాలు సరిహద్దులుగా ఉన్నాయి. డ్రగ్ మాఫియా నాయకుడు, ఉగ్రవాది జోస్ అడాల్ఫ్ మాకియాస్ విల్లామర్ గత ఏడాది జైలు నుండి తప్పించుకున్నాడు. దీంతో దేశాధ్యక్షుడు నోబోయా దేశంలో వ్యవస్థీకృత నేరాలపై అంతర్గత యుద్ధం ప్రకటించారు. బహుశా ఈ ముఠాలే ఆయనపై దాడిచేసి ఉంటాయని భావిస్తున్నారు.




## ఉగ్రవాదుల కాల్పుల్లో 11 మంది పాక్ సైనికులు మృతి

### వారంతా భారత్ పోషిస్తున్న ఉగ్రవాదులే: షరీఫ్

**రావల్పిండి:** ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలో ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు చేస్తుండగా ఎదురుకాల్పుల్లో ఒక లెఫ్టినెంట్ కల్నల్, మేజర్ సహా 11 మంది పాకిస్థాన్ సైనికులు మరణించారు. ఈ వార్త విన్నవెంటనే ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ మరణించిన సైనికులకు నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం తెలియజేశారు. భారతదేశ మద్దతుతో నీచమైన హింసాత్మక చర్యలకు పాల్పడుతున్న ఉగ్రవాదులను వదిలిపెట్టేదిలేదని ఆయన హెచ్చరిక చేశారు. ఈ సైనికుల త్యాగం పాకిస్థాన్ జాతి ఐక్యతకు చిహ్నమని ఆయన పేర్కొన్నారు. దేశాధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ ఒక ప్రకటనలో మృతులకు నివాళులు అర్పిస్తూ సైనికాధికారులు జునైద్ తారిఖ్ షాహిద్, తయ్యబ్ రహత్‌లను జాతి హీరోలుగా ప్రకటించారు. భారత్ అండతో దాడులు చేస్తున్న ఉగ్రవాదులకు వ్యతిరేకంగా యావత్ దేశం సైనిక బలగాలకు అండగా నిలబడుతుందని ఆయన పేర్కొన్నారు. ఒకార్జ్గిల్ జిల్లాలో నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు సైన్యం రంగంలోకి దిగి గాలింపు చర్యలు కొనసాగిస్తుండగా పరస్పరం ఎదురైనప్పుడు మంగళవారం రాత్రి భారీగా కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో నిషేధిత తెహ్రీక్ ఎ తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి)కి చెందిన 19 మంది ఉగ్రవాదులు కూడా హతులయ్యారు. పాకిస్థాన్ పత్రికలు వీరని భారత ప్రభుత్వం పెంచిపోషిస్తున్న 'ఫిత్నా అల్ ఖ్వారిజ్' ఉగ్రవాదులుగా అభివర్ణించాయి. ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన పాకిస్థాన్ సైనికులు అందరూ యువ సుశిక్షితులే. వీరిలో 'సైనికబృందానికి నాయకత్వం వహిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ జునైద్ తారిఖ్ షాహిద్ (39), కమాండ్ మేజర్ తయ్యబ్ రహత్ (33), నాయబ్ సుబేదార్ అజంగుల్ (38), నాయక్ అదిల్ హుస్సేన్ (35), నాయక్ గుల్ అమీర్ (34), లాన్స్ నాయక్ షేర్‌ఖాన్ (31) తదితరులున్నారు. ఈ ప్రాంతంలో ఇంకా భారత్ పెంచిపోషిస్తున్న ఉగ్రవాదులు ఉన్నారేమో తెలుసుకుని నిర్మూలించేందుకు గాలింపు చర్యలు కొనసాగిస్తునట్లు పాకిస్థాన్ ఇంటర్–సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) విభాగం బుధవారం ఒక ప్రకటనలో తెలియజేసింది.

## యుద్ధం రెచ్చగొట్టేదీ.. శాంతిజపం చేసేదీ అమెరికానే!

### ఇజ్రాయెల్‌కు 21.7 బి.డాలర్లు సైనిక సహాయం



**కైరో:** గాజాలో యుద్ధం ఆపి శాంతిసాధనకు డోనాల్డ్ ట్రంప్ కృషి చేస్తున్నప్పటికీ అసలు ఈ యుద్ధం రెండేళ్ళుగా ఎడతెగకుండా కొనసాగడానికి ప్రధాన కారణం కూడా ఆ దేశమే. గాజాపై ఇజ్రాయెల్ 2023 అక్టోబరులో దాడి చేసినప్పటి నుండీ ఇప్పటివరకూ 21.7 బిలియన్ డాలర్లు సైనిక సహాయాన్ని అమెరికా అందజేసిందని ఒక తాజా ఎకడమిక్ స్టడీ నివేదిక వెల్లడించింది. ఏడు యుద్ధాలు ఆపానని చెబుతున్న ట్రంప్ గాజాలో యుద్ధం ఆపితే ఎనిమిదో యుద్ధం కూడా ఆపినవారవుతారు. ఇక మిగిలిన ప్రధానమైన యుద్ధం ఉక్రేన్‌దే. ఉక్రేన్‌లో యుద్ధం కూడా ఆపేస్తే ట్రంప్‌కు నోబెల్ బహుమతి వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. కానీ గాజాలో, ఉక్రేన్‌లో యుద్ధాలను రెచ్చగొట్టి సైనిక సహాయం చేసింది కూడా అమెరికా దేశమే. జోబైడెన్ అధ్యక్షుడుగా ఉన్నప్పటి నుండీ ఇప్పటివరకూ ఈ యుద్ధాలను రెచ్చగొట్టేందుకు అమెరికా అనుసరించిన విధానంలో ఎలాంటి మార్పూ లేదు.

అదేవిధంగా బ్రౌన్ యూనివర్సిటీకి చెందిన వాట్సన్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ ఎఫైర్స్ చేసిన మరో అధ్యయనం ప్రకారం, మధ్యప్రాచ్య సరిహద్దుల్లో యుద్ధ కార్యకలాపాలు, భద్రతా చర్యల నిమిత్తం మరో 10 బిలియన్ డాలర్లు కూడా అమెరికా రెండు సంవత్సరాలుగా ఖర్చుచేసింది. ఇందులో అమెరికా సైన్యం ప్రత్యక్ష జోక్యం కూడా ఉంది. ఐతే ఈ అధ్యయన నివేదికలపై అమెరికా విదేశాంగమంత్రిత్వ శాఖ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఐతే అమెరికా సహాయం లేకుండా, ఆయుధ సహకారం, ఇతరత్రాసమయానుకూలంగా సాంకేతికపరమైన సహకారం అందజేయకుండా ఇంతభారీ స్థాయిలో విజయవంతంగా ఇజ్రాయెల్ సైన్యం మధ్యప్రాచ్యంలో ఏకకాలంలో అనేక దేశాలపై యుద్ధ దాడులు చేయడం అసాధ్యమైన విషయమని కూడా ఈ నివేదికలు వెల్లడించాయి. ఒకవైపు గాజాలో సుదీర్ఘయుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్ హౌతీలపై దాడులు చేసింది. ఖతార్‌లోని దోహాపై దాడులు చేసింది. ఇరాన్‌లో కూడా దాడులు చేసింది. అనేక సరిహద్దులను ఉల్లంఘించి ఏకకాలంలో శత్రువులతో పోరాటం చేయడం అమెరికా మద్దతు వల్లనే అని నివేదికలు పేర్కొన్నాయి.

## లెకార్ను అంతిమ యత్నాలు ఫలిస్తాయా?

### బడ్జెట్ ప్రకటించాలని ఫ్రాన్స్ ప్రతిపక్షం డిమాండ్



**పారిస్:** ప్రధానమంత్రి పదవి నుండి వైదొలగిన లెకార్ను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఇచ్చిన అవకాశంతో చివరి ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఆశాభావంతో తుదిపోరు చేస్తున్నారు. బుధవారం రాత్రి పొద్దుపోయాక ఆయన దేశంలో సమస్య పరిష్కారంపై మేక్రాన్‌కు ఒక తుది నివేదిక సమర్పిస్తారు. ఈలోపు ఆయన కూటమి పార్టీల నాయకులతో, ప్రతిపక్షాల నాయకులతో సంప్రదింపులు చేస్తున్నారు. డిసెంబరు 31 లోపు కొత్త బడ్జెట్‌ను ఇవ్వాలని ప్రతిపక్షాలు గట్టిగా కోరుతుండగా, దేశ అత్యున్నత చట్టసభను మేక్రాన్ రద్దుచేస్తారన్న ఊహాగానాలు మెల్లిగా వెనక్కు వెళ్ళాయి. జాతీయ చట్టసభను రద్దుచేసే అవకాశాలు సన్నగిల్లాయని లెకార్ను కూడా చెప్పారు. యూరప్‌లో బలమైన ఆర్థిక వ్యవస్థగా ఉన్న ఫ్రాన్స్ క్రమంగా కొన్నేళ్ళుగా బలహీనపడుతూ వచ్చింది. ముఖ్యంగా మేక్రాన్ దేశాధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టినప్పటినుండీ ఫ్రాన్స్ ఆర్థిక వ్యవస్థ పతనావస్థలో కొనసాగుతున్నది. వామపక్షాలు సహా దేశంలో ప్రతిపక్షాలు, కూటమి నేతలు చెప్పినా వినకుండా గత ఏడాది జులైలో దేశ చట్టసభకు మేక్రాన్ ఎన్నికలు నిర్వహించడమే పెద్ద సమస్యగా మారింది. 2027 వరకూ మేక్రాన్ అధికారంలో కొనసాగేందుకు అవకాశం ఉన్నప్పటికీ తన అధికారానికి తిరుగులేకుండా ఉండాలని ఆయన అనేక వ్యూహాలు చేస్తున్నారు. వామపక్షాలను దూరంగా పెట్టారు. అప్పటి నుండీ ఆయనకు కష్టాలు మొదలయ్యాయి. నలుగురు ప్రధానమంత్రులు రాజీనామాలు సమర్పించారు. 577 మంది సభ్యులున్న దిగువసభలో వామపక్ష సంఘటన 182 అత్యధిక స్థానాలతో మేక్రాన్ పార్టీకి సవాలు విసురుతున్నది. మరోవైపు దేశంలో ప్రజలు ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని ఇటీవలే వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేశారు. ఆర్థిక సంక్షోభ పరిష్కారమే మేక్రాన్ ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది.



## మయన్మార్‌లో బాంబు దాడి

### 24 మంది మృతి

**యాంగాన్:** మయన్మార్ చెంగ్ యూ టౌన్‌షిప్‌లో బౌద్ధులు చేసుకునే పూర్ణ చంద్రోదయ ఉత్సవం సందర్భంగా సైనిక ప్రభుత్వ బృందం దాడి చేసింది. ఈ దాడిలో 24 మంది మరణించారు. మరో 47 మంది గాయపడ్డారు.సెంట్రల్ మయన్మార్‌లో సోమవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఉత్సవంతోపాటు ప్రజలు సైనికుల దుశ్చర్యలను కూడా వ్యతిరేకిస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమయంలో మోటారు సహాయంతో పనిచేసే పారాగ్లైడర్‌ను ఉపయోగించి సైన్యం ఆ జనంపై రెండు బాంబులు వేయడంతో 24 మంది మరణించారు. ఉత్సవం ఉన్నప్పటికీ ప్రధానంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం జరుగుతోంది. పండుగ, జాతీయ సెలవుదినం సందర్భంగా దాదాపు 100 మందిపైగా ప్రజలు చెంగ్ యూ టౌన్‌షిప్‌లో గుమిగూడారు. 2021 ఫిబ్రవరిలో మయన్మార్‌లో సైన్యం తిరగబడి ఆంగ్‌సాన్ సూకీ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూల్చివేసింది. ఆమెతో సహా వందలమంది నాయకులను జైళ్ళల్లో పెట్టింది. వేలాదిమంది యువకులు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేస్తే నిర్దాక్షిణ్యంగా వారిని అణచివేసింది. దీంతో వేలమంది మరణించారు. ఇక అప్పటినుండీ లక్షల మంది ప్రజలు ఇళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోయారు. అనేకమంది నిరాశ్రయులయ్యారు. దేశంలో పౌర బృందాలు, తెగల బృందాలు సైన్యంపై అంతర్యుద్ధం ప్రారంభించాయి. ఇప్పటికీ ఈ అంతర్యుద్ధం కొనసాగుతోంది. ఈ పరిస్థితుల మధ్య సైన్యం తన అధికారం స్థిరీకరించుకునేందుకు ఈ ఏడాది చివరిలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది.

## భారీ పేలుడు (మొదటి పేజీ తరువాయి)

స్పష్టంగా తెలియకపోయినా, భద్రతా నియ మాలు పాటించకపోవడమే ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. అధికారుల నిర్లక్ష్యమే ఈ విషాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా, సమాచారం అందుకున్న వెంటనే మండపేట, రామచంద్రపురం, అనపర్తి ప్రాంతాల నుంచి అగ్నిమాపక శకటాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. మండపేట రూరల్ సీఐ దొర రాజు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. మృతుల్లో బాణసంచా తయారీ కేంద్రం యజమాని కూడా ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఈ విషాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదు కుంటుందని, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కొమరిపాలెం గ్రామం శోకసంద్రంగా మారింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు... ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయ పడ్డ వారికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అలాగే మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాం డ్ చేశారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.



**సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి :** బాణసంచా పేలుడు ఘటనపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధి కారులతో ఆయన మాట్లాడారు. ప్రమా దంలో పలువురు చనిపోవడం పై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలు, వైద్య సాయంపై వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఘటనాస్థలికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆదేశించారు. మరోవైపు ఈ ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ, అగ్ని మాపక శాఖ అధికారులతో ఆమె మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని మంత్రి తెలిపారు.

## విడుదల చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నిరాహార దీక్షలతో శాంతియుతంగా గత నాలుగేళ్లుగా వాంగ్‌చుక్ పోరాడుతున్నారని కార్మిక సంఘాల ఐక్యవేదిక గుర్తుచేసింది. రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చి సంపూర్ణ రాష్ట్ర హోదా కల్పించడం, హిమాలయాల పర్యావరణాన్ని పరిరక్షించడం, స్థానికుల హక్కులను కాపాడటం కోసం అహింసా మార్గంలో సాగుతున్న వాంగ్‌చుక్ సహా లేహ్‌లదాఖ్ ప్రజల పోరాటాన్ని అణచివేస్తున్నారని పేర్కొంది. బిజెపి తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు కోసమే వారు పోరాడుతున్నారని, వాంగ్‌చుక్ సహా ఇతరులను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని ఐక్యవేదిక డిమాండ్ చేసింది.

## స్వచ్ఛమైన నీరు (మొదటి పేజీ తరువాయి)

అమెరికాకు చెందిన ఒమర్ ఎం. యాఘీలను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బుధవారం ప్రకటించింది. 'మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్' (ఎంఓఎఫ్)గా పిలిచే ప్రత్యేకమైన అణు నిర్మాణాలను అభివద్ధి చేసినందుకు గాను వారికి ఈ గౌరవం దక్కింది. ఈ శాస్త్రవేత్తలు లోహ అయాన్లను (మూలస్తంభాలుగా), పొడవైన కర్బన అణువులతో (సంధానకర్తలుగా) కలిపి సూక్ష్మస్థాయిలో ఖాళీలతో కూడిన స్ఫటికాలను రూపొందించారు. ఈ ఖాళీలు వాయువులు, ఇతర రసాయనాలను నిల్వ చేయడానికి లేదా రసాయనిక చర్యలు జరపడానికి గదుల్లా పనిచేస్తాయి. వీటిని ఉపయోగించి పర్యావరణంలోని విషవాయువులను నిల్వ చేయడం, నీటిలోని హానికర రసాయనాలను వేరుచేయడం, ఫార్మా వ్యర్థాలను విచ్ఛిన్నం చేయడం వంటి ఎన్నో క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలు కనుగొనవచ్చు. ఈ రంగంలో 1989లో రిచర్డ్ రాబ్సన్ తొలి అడుగులు వేయగా, ఆ తర్వాత సుసుము కిటగావా, ఒమర్ యాఘీ తమ పరిశోధనలతో దీనిని మరింత ముందుకు తీసుకెళ్లారు. కిటగావా ఈ నిర్మాణాల్లోకి వాయువులు స్వేచ్ఛగా ప్రవహిస్తాయని నిరూపించగా, యాఘీ అత్యంత స్థిరమైన ఎంఓఎఫ్ లను సష్టించి, వాటిని మనకు కావాల్సిన విధంగా మార్చుకునే పద్ధతిని ఆవిష్కరించారు. వీరి కషి ఫలితంగా ఇప్పటివరకు పదివేల రకాలకు పైగా ఎంఓఎఫ్‌లు రూపుదిద్దుకున్నాయి.

## స్థానిక నోటిఫికేషన్ నేడే!

(మొదటి పేజీ తరువాయి)

నవంబరు 11న ముగుస్తుంది. రెండు విడతల్లో జరిగే ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలకు 9న మూడు విడతల్లో జరిగే సర్పంచి, వార్డు స్థానాల ఎన్నికలకు 17న నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రకటించిన విషయం తెలిసిందే.

**కోర్టు స్టేతో అక్కడ ఎన్నికలకు బ్రేక్**

వివిధ కారణాలతో న్యాయస్థానాలు స్టే విధించిన కారణంగా 14 ఎంపిటిసి, 27 సర్పంచి, 246 వార్డు స్థానాలకు ఎన్నికలను నిలిపివేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఇందులో ములుగు జిల్లా మంగపేట మండలంలోని 14 ఎంపిటిసి, 25 సర్పంచి, 230 వార్డులుండగా, కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని రెండు సర్పంచి, 16 వార్డు స్థానాలకూ ఎన్నికలు నిర్వహించడం లేదని పేర్కొంది.

**ముగ్గురు పిల్లలుంటే అనర్హులే..**

గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలుంటే అనర్హత వేటు నిబంధన ఈ ఎన్నికల్లోనూ అమలు కానుంది. దీన్ని సడలించేందుకు పంచాయతీరాజ్ శాఖ ప్రతిపాదనలు సమర్పించింది. జనాభా రేటుపై శాస్త్రీయ సమాచారం లేదనే కారణంతో ప్రభుత్వం తొలుత తిరస్కరించింది. ఆ తర్వాత ఇటీవల పునరాలోచన చేసినా, శాసనసభలో చట్టాన్ని సవరించాల్సి ఉన్నందున సమయాభావం కారణంగా జరపలేదు. దీంతో ముగ్గురు పిల్లలున్నవారు ఈ ఎన్నికల్లో పోటీకి అనర్హులని అధికారులు ప్రకటించారు.

**ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల షెడ్యూల్**

మొదటి విడత ఎంపిటిసి (2,963), జెడ్‌పిటిసి (292) ఎన్నికలు
నామినేషన్ల స్వీకరణ ప్రారంభం : అక్టోబరు 9
చివరి తేదీ : అక్టోబరు 11
పరిశీలన : అక్టోబరు 12
ఉపసంహరణ : అక్టోబరు 15
రెండో విడత ఎంపిటిసి (2,786) జెడ్‌పిటిసి (273) ఎన్నికలు
నామినేషన్‌ల స్వీకరణ ప్రారంభం : అక్టోబరు 13
చివరి తేదీ : అక్టోబరు 15
పరిశీలన : అక్టోబరు 16
ఉపసంహరణ : అక్టోబరు 19
ఓటర్ల వివరాలిలా..
రాష్ట్రంలో మొత్తం ఓటర్లు: 1,67,03,168
పురుషులు : 81,65,894
మహిళలు : 85,36,770 ఇతరులు : 504.

## రష్యా తరపున యుద్ధంచేస్తూ ఉక్రేన్‌కు లొంగిన యువకుడు

**కీవ్:** రష్యా తరపున యుద్ధంలో పాల్గొన్న భారత యువకుడు ఒకరు ఉక్రేన్‌కు లొంగిపోయారు. ఇతడిని గుజరాతీయుడుగా గుర్తించినట్లు, తమదేశంపై రష్యా తరపున యుద్ధం చేస్తుండగా లొంగిపోయినట్లు ఉక్రేన్ మీడియా బుధవారం ప్రకటించింది. గుజరాత్ మోర్బీ ప్రాంతానికి చెందిన యువకుణ్ణి మాజోతి సాహిల్ మహ్మద్ హుస్సేన్‌గా గుర్తించినట్లు తెలిపింది. ఈ యువకుడు రష్యా విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసంకోసం వెళ్ళి జైలుపాలై ఉక్రేన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంలో సైనికుడిగా చేరినట్లు 'కీవ్ ఇండిపెండెంట్' పేర్కొంది. ఉక్రేన్ సైన్యంలో 63వ బ్రిగేడ్ అతడిని మూడురోజుల యుద్ధం తర్వాత పట్టుకుంది. దీనికి సంబంధించి ఉక్రేన్ మెకనైజ్డ్ బ్రిగేడ్ వీడియోలో ఆ గుజరాతీ యువకుడు కనిపించాడు.ఎక్స్ వేదికగా ఈ వీడియో విడుదలైంది. మాదకద్రవ్యాల కేసుకు సంబంధించిన ఆరోపణలపై రష్యా తనకు ఏడు సంవత్సరాలు జైలుశిక్ష విధించిందని ఆ వీడియోలో యువకుడు చెప్పాడు. జైలుశిక్ష అనుభవిస్తున్న సమయంలో తదుపరి శిక్ష లేకుండా చేయడానికి వీలుగా సైన్యంలో చేరే కాంట్రాక్టుపై సంతకం చేసేందుకు తనకు అవకాశం ఇచ్చారని చెప్పాడు. ''జైలులో ఉండటం నాకు ఇష్టంలేదు, అందుకే స్పెషల్ మిలిటరీ ఆపరేషన్ (ఉక్రేన్‌పై పూర్తిస్థాయి యుద్ధం)లో చేరాను, అక్కడి నుండి బయట పడాలనుకున్నాను'' అని చెప్పాడు. తనకు రష్యా సైన్యం 16 రోజులు శిక్షణ ఇచ్చిందని, అక్టోబరు ఒకటో తేదీన యుద్ధంలో చేరానని, మూడురోజులపాటు ఉక్రేన్‌పై యుద్ధం చేశాననీ, ఈలోపు తన కమాండర్‌తో విభేదాలు రావడంతో ఉక్రేన్ దళాలకు లొంగిపోయాననీ చెప్పాడు. ''ఉక్రేన్ తవ్విన కందకాలకు రెండు మూడు కి.మీ సమీపానికి నేను చేరుకున్నాను, ఉక్రేన్ దళాలు కనిపించగానే నేను నా తుపాకిని నేలమీదపెట్టి లొంగిపోయాను, నాకు యుద్ధం చేయడం ఇష్టం లేదు, నాకు సహాయం కావాలి అని ఉక్రేన్ దళాలకు చెప్పాను'' అని యువకుడు వీడియోలో చెప్పాడు. దీనిపై భారత విదేశీమంత్రిత్వశాఖ స్పందించి ఆ యువకుడికి సంబంధించిన వివరాలను, నిజానిజాలను పరిశీలన చేయడం ప్రారంభించినప్పటికీ ఈ విషయా న్ని భారత్ ఇంకా ధృవీకరించలేదు. ''ఉక్రేన్ ప్రభుత్వం నుండి అధికారికంగా మాకు ఎలాంటి సమాచారం అందలేదు, ఐనాగానీ ఈ విషయాన్ని మేం పరిశీలిస్తున్నాం'' అని భారత విదేశీమంత్రిత్వశాఖ ప్రకటనలో తెలియజేసింది. దాదాపు 12 మంది భారతీయులు తప్పుతోవపట్టి యుద్ధంలో మరణించినట్లు గడచిన జనవరిలో విదేశాంగశాఖ ప్రకటించింది.

## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పార్టీ అభ్యర్థిని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. వి.నవీన్ యాదవ్ పేరును ఎఐసిసి బుధవారం రాత్రి అధికారికంగా ప్రకటించింది. నవీన్ అభ్యర్థిత్వానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారని పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 11న జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక జరగనుంది. గత ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి తరపున పోటీ చేసి గెలిచిన మాగంటి గోపీనాథ్ (62) మృతితో ఈ ఎన్నిక అనివార్యమైంది. నవీన్ యాదవ్ ఆ ఎన్నికల్లో ఎంఐఎం తరపున పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి, తాజాగా టికెట్ దక్కించుకున్నారు.

## దగ్గు మందుపై నిషేధం (మొదటి పేజీ తరువాయి)

నిర్వహించగా, ఇందులో డయిథైలీన్ గ్లైకాల్ కలుషితం ఉన్నదని అధికారులు గుర్తించారు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కోల్డ్రిఫ్ అనే దగ్గు సిరప్ వాడడం వల్ల పలువురు చిన్నారులు మృత్యువాత పడినట్టు ఆరోపణలు రావడంతో దీనిపై ప్రభుత్వం దర్యాప్తు జరుగుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అప్రమత్తమై, ఇప్పటికే కోల్డ్ రిఫ్‌ను పూర్తిగా నిషేధించింది. కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తీసుకున్న కారణంగా మధ్యప్రదేశ్‌లో పదుల సంఖ్యలో చిన్నారులు మృతి చెందడంతో ఔషధ నియంత్రణ శాఖ అప్రమత్తమైంది. కాగా విచ్చలవిడిగా దగ్గు మందులను వాడితే కిడ్నీలు, కాలేయంపై ప్రభావం చూపుతాయని, శ్వాస సంబంధిత సమస్యలు, నిద్రలేమికి దారి తీసే అవకాశాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. రిలీఫ్,రెస్‌పిఫ్రెష్ రెండు దగ్గు ఉత్పత్తులను ఉన్నట్టు తెలిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 18005996969(ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటలు) ద్వారా సమాచారం ఇవ్వాలని డ్రగ్స్ కంట్రోల్ జనరల్ డైరక్టర్ షానవాజ్ ఖాసీ తెలిపారు.

## 12న 6 జిల్లాల్లో 'పల్స్ పోలియో వ్యాక్సినేషన్' స్పెషల్ డ్రైవ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో 'పల్స్ పోలియో వ్యాక్సినేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను' ఈ నెల 12 నుంచి నిర్వహించనున్నారు. గత 3 సంవత్సరాలుగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ తదితర దేశాల్లో పోలియో కేసులు నమోదవుతున్నాయి. దీంతో ఆయా దేశాల నుంచి భారతదేశానికి రాకపోకలు జరుగుతున్న జిల్లాల్లో పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కేంద్ర ఆరోగ్య శాఖ నిర్ణయించింది.

ఇందులో భాగంగానే దేశవ్యాప్తంగా 290 జిల్లాలను ఎంపిక చేయ గా, ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాలతో పాటు వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలోనూ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. రాష్ట్రంలోని ఆరు జిల్లాల పరిధిలో 05 సంవత్సరాల వయసు పిల్లలు 17,56, 789 మంది ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. వీరందరికీ ఈ నెల 12న స్పెషల్ డ్రైవ్ పోలియో వ్యాక్సిన్ వేయనున్నారు. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదు సంవత్సరాల వయసు ఉన్న పిల్లలందరికీ వ్యాక్సిన్లు వేయించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

## కొనసాగుతున్న ఉత్కంఠ మొదటి పేజీ తరువాయి)

అసంతృప్తిని వ్యక్తం చేసింది. బిసి రిజర్వేషన్లు సీరియస్ అంశమని, తమ సహనాన్ని పరీక్షించొద్దని హితవు చెప్పింది. తర్వాత పిటిషనర్ల తరపున సీనియర్ లాయర్లు కె. వివేక్‌రెడ్డి, బి.మయూర్‌రెడ్డి, జె ప్రభాకర్ ఇతరులు వాదనలు ప్రారంభించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్నారు. బిసిలకు 25 నుంచి 42 శాతానికి పెంపు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. డెడికేటెడ్ కమిషన్ చేసిన సిఫార్సులకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్ట వ్యతిరేకమన్నారు. అశాస్త్రీయ గణాంకాలతో 50 శాతం దాటిని రిజర్వేషన్ల నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీం కోర్టు మూడు వేర్వేరు కీలక కేసుల్లో వెలువరించిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీం కోర్టు చెప్పిందన్నారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చట్టం కూడా చేసిందన్నారు. దీనిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేయడంతో ఈ వివాదం వచ్చిందన్నారు. షెడ్యూల్ ప్రాంతాల్లోని ఎస్టీలకు మేలు జరిగేలా రిజర్వేషన్లు 50 శాతానికి పెంచొచ్చునని సుప్రీం కోర్టు చెప్పిందన్నారు. ఈ మేరకు కృష్ణమూర్తి అండ్ అథర్స్ వర్సెస్ ఇండియా కేసులో తీర్పు చెప్పిందన్నారు. మరాఠా రిజర్వేషన్ల అంశంలోనూ 50 శాతం దాటిని రిజర్వేషన్లను సుప్రీం కోర్టు కొట్టేసిందన్నారు. రాష్ట్రంలో ఎస్టీలు మాత్రమే ఉన్న ప్రాంతాలు లేవని, సుప్రీం కోర్టు తీర్పుల ప్రకారం రాష్ట్రంలో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్నారు. 42 శాతానికి రిజర్వేషన్ల పెంపు వల్ల మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి పెరుగుతాయని, ఇది రాజ్యాంగ వ్యతిరేకమని చెప్పారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు గవర్నర్ ఆమోదం చెప్పలేదని, చట్టం కాకుండా ప్రభుత్వం జీవో 9 జారీ చేసిందని చెప్పారు. రిజర్వేషన్ల పెంపు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ రూపొంచిన చట్ట నిబంధనలనే ఉల్లంఘిస్తూ జిఒ ఇచ్చిందన్నారు. పంచాయతీరాజ్ శాఖ జారీ చేసిన జిఒ 41ని కొట్టివేయాలని కోరారు. ఇప్పుడు ఏకంగా 67 శాతానికి పెంచడం చెల్లదన్నారు. ఇప్పుడున్న చట్ట నిబంధల ప్రకారం సుప్రీంకోర్టు తీర్పుల మేరకు పంచాతీయ ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఇందిరా సాహ్నీ, కృష్ణ మూర్తి, వికాశ్‌కిషన్ గవాయ్ కేసుల్లో సుప్రీం కోర్టు తీర్పులు శిరోధార్యమన్నారు. బిసి రిజర్వేషన్లను ఎబిసిడిలుగా వర్గికరించాలంటూ దాఖలైన పిటిషనర్ లాయర్ వాదిస్తూ, అనంతరామన్ కమిషన్ నివేదికను ప్రభుత్వం విస్మరించిందన్నారు. మునురు కాపు, ముదిరాజ్, యాదవ, గౌడ్లకే స్థానిక సంస్థల్లో రాజకీయ అధికారం లభిస్తోందన్నారు. పేదలుగా ఉన్న బిసిలు అలాగే ఉంటున్నారని చెప్పారు. ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. తొలుగ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, రాష్ట్ర శానసనసభ బిల్లును ఆమోదించి గవర్నర్‌కు గత మార్చిలో పంపితే ఇప్పటి వరకు ఆమోదం చెప్పలేదన్నారు. ప్రజలు ఎన్నుకున్న సిఎం ప్రజల కోసం ముఖ్యంగా వెనుకబడిన ప్రజల కోసం పని చేస్తున్నారని, ఈ క్రమంలోనే స్థానిక ఎన్నికలల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పనకు జీవో వెలువడిందని చెప్పారు. గవర్నర్ తన అధికారాలను వినియోగించి బిల్లుకు ఆమోదం చెప్పడమో లేదో బిల్లును ప్రభుత్వానికి తిరిగి పంపడమో చేయాలని, ఏమీ చేయకుండా పెట్టుకుని ఉంటే ప్రభుత్వం తన పని తాను చేసుకుని వెళుతుందన్నారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ అని, గవర్నర్ నియామకం ద్వారా అధికారంలో ఉంటారని చెప్పారు. బిసి జనాభా పెరిగిన నేపథ్యంలో వారికి న్యాయం చేయాలనే కోణంలోనే ప్రభుత్వం ఐఎఎస్ అధికారి నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను నియయించిందని చెప్పారు. ఇంటింటికీ కమిషన్ సర్వే చేసి జనంలో ఉన్న పరిస్థితులను బేరీజు వేసి శాస్త్రీయంగా నివేదిక ఇచ్చిందన్నారు. బిసి జనాభా 56 శాతానికిపైగా ఉందని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్ సిఫార్సు చేసిందన్నారు. ఈ వ్యవహారాలన్నింటిపైన అసెంబ్లీలో సమగ్రంగా చర్చించాక అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో బిల్లును ఏకగ్రీవంగా ఆమోదం లభించిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జీవో 9ని, స్థానిక సంస్థల్లో బీసీలకు 25 శాతం నుంచి 42 శాతానికి రిజర్వేషన్లను పెంపు చేయడాన్ని అడ్డుకునేందుకు దాఖలైన పిటిషన్లలో స్టే ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కౌంటర్లు దాఖలు చేశాక సమగ్ర విచారణ పూర్తి చేశాక కోర్టు తగిన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. బిసిలకు స్థానిక సంస్థల పదవుల్లో రిజర్వేషన్లు పెరిగితే పాలనాపరంగానే కాకుండా విద్య, ఉద్యోగ, ఆర్థిక ప్రయోజనాలు కూడా అందిపుచ్చుకుంటారని చెప్పారు. సాయంత్రం 4.50 గంటలప్పుడు ఎజి సుదర్శన్‌రెడ్డి కల్పించుకుని విచారణను రేపటికి వాయిదా వేయాలని కోరారు. దీంతో పిటిషనర్ తరపు న్యాయవాదులు కల్పించుకుని గురువారం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. దీనిపై తిరిగి ఏజీ కల్పించుకుని, ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినట్లుందని, ఎన్నికల షెడ్యూల్ ఇది వరకే వెలువడిందని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక కోర్టుల జోక్యానికి ఆస్కారం లేదని, ఈ మేరకు సుప్రీం కోర్టు తీర్పులు కూడా ఉన్నాయని చెప్పారు. మళ్లీ పిటిషనర్ల న్యాయవాదులు జోక్యం చేసుకుని, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే నేపథ్యంలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయకుండానే హైకోర్టు విచారణను వాయిదా వేసింది. బిసి రిజర్వేషన్లపై ఏర్పాటు చేసిన వన్‌మ్యాన్ కమిటీ ఇచ్చిన నివేదికపై గెజిట్ ప్రచురించారా. బిల్లును గవర్నర్ ఆమోదించనప్పుడు దానిని ఆమోదించినట్లుగా పరిగణించారా, పరిగణిస్తే నోటిఫికేషన్ ఇచ్చారా, రాష్ట్రంలో బిసిల జనాభా ఒక్కో చోట ఒక్కోలా ఉంటుంది కదా.. అంతటా ఒకేలా 42 శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారు.. వంటి ప్రశ్నలు ప్రభుత్వానికి వేసింది. ఇరుపక్షాల వాదనల అనంతరం ధర్మాసనం విచారణను గురువారం మధ్యాహ్నానికి వాయిదా వేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్రంలో రెండురోజులు భారీ వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు తెలంగాణ, రాయలసీమ, ఇంటీరియర్ తమిళనాడు మీదుగా సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు ద్రోణి కొనసాగుతుందని చెప్పారు. ఒడిశా ఉత్తర తీర ప్రాంతం నుంచి తెలంగాణ వరకు ఇంటీరియర్ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందన్నారు. నైరుతి బంగాళాఖాతం తమిళనాడు తీరంలోని ఉపరితల ఆవర్తనం నుంచి కోస్తా కర్నాటక వరకు తమిళనాడు, రాయలసీమ, దక్షిణ ఇంటీరియర్ కర్నాటక మీదుగా సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందన్నారు. గురువారం కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు.

# వ్యవసాయ రంగాన్ని గాడిలో పెట్టాలి

### రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో గత పదేండ్లుగా వ్యవసాయ రంగం గాడి తప్పిందని.. గాడి తప్పిన వ్యవసాయ రంగాన్ని సియం రేవంత్ రెడ్డి గాడిలో పెడ్తున్నారని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. వ్యవసాయ రంగం బలోపేతం చేయడానికి రైతు కమిషన్ అన్ని అంశాలపై ఫోకస్ పెట్టిందని ఆయన అన్నారు. అందులో భాగంగానే కమిషన్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, ఉద్యానవన, ఫారెస్ట్, నాబార్డు, వ్యవసాయ శాస్త్రవేతలతో సమావేశం నిర్వహించినట్లుగా తెలిపారు. ప్రధానంగా ఈ సమావేశంలో రైతులు కోతుల బెడద వల్ల ఎదుర్కొంటున్న సమస్యలు, నివారణ చర్యలు, సోలార్ ఫెన్సింగ్‌తోపాటు సాయిల్ టెస్ట్.. ఆవశ్యకతపై సుధీర్ఘంగా చర్చించినట్లు వివరించారు. కోతుల బెడద, నివారణ కోసం చర్యలు చేపట్టాలని, అడవుల్లో కోతులకు సరైన ఆహారం దొరకడం లేదని, ఫలితంగా కోతులు గ్రామాల్లోకి, పంట పొలాల పైకి వస్తున్నట్లు పేర్కొన్నారు. కోతుల బెడద నివారణ కోసం ఇతర రాష్ట్రాల్లో అవలంబిస్తున్న విధానాలపై అధికారులతో చర్చించారు. పంట పొలాల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ చేయాలంటే రైతులపై ఆర్థిక భారం పడ్తుందని.. అలా కాకుండా ఇతర నివారణ చర్యలపై ఫోకస్ పెట్టాలన్నారు. రాష్ట్రంలో యూరియా వినియోగం విఫరీతంగా పెరిగిందని, భూ పరిక్షలు చేసిన తర్వాతనే పంటలు సాగుచేసేలా అధికారులు చర్చలు చేపట్టాలని సూచించారు. అధిక మోతాదుల్లో యూరియా వాడకం వల్ల గాలి, నీరు, వాతావరణం కలుషితం అవుతున్నాయని తెలిపారు. ఇక భారతీయ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు రూపొందించిన సాయిల్ టెస్టింగ్ కిట్ డెమోను ఈ సమావేశంలో ఐఐఆర్‌ఆర్ శాస్త్రవేత్తలు ప్రదర్శించారు. ఐఐఆర్‌ఆర్ రూపొందించిన సాయిల్ టెస్ట్ కిట్‌ను రైతు కమిషన్ కొనుగోలు చేసి.. వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి గోపికి అందజేసింది. భూ సార పరీక్షా పరికరాలు రైతులకు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టాలని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. వ్యవసాయ రంగానికి కేంద్రం నుండి వచ్చే నిధులు, నాబార్డు నిధుల వినియోగం సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. అదేవిధంగా జర్మనీ ప్రతినిధులు ఏసీఆర్‌ఏటీ సంస్థ వరి,పత్తి సాగులో ఏఐ టెక్నాలజీ వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం వేములవాడ నియోజకవర్గంలో మూడు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఏఐ టెక్నాలజీ ఇంప్లిమెంటేషన్ చేస్తున్నట్లు జర్మనీ సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవానీరెడ్డి, గడుగు గంగాధర్, చెవిటి వెంకన్నయాదవ్, రాములు నాయక్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, శ్రీ కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ విసి రాజిరెడ్డి, అటవీ శాఖ పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరు, నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, ఐఐఆర్‌ఆర్ శాస్త్రవేత్తలు బ్రజేంద్ర, మానస, వ్యవసాయ శాఖ జేడీఏ సుచరిత, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, వ్యవసాయ శాస్త్రవేత్త రామాంజనేయులు, జర్మనీ ఏసీఆర్‌ఏటీ సంస్థ ప్రతినిధులు రఘు చలిగంటి, సెబాస్టియన్ బోస్ తోపాటు వ్యవసాయ శాఖ అధికారులు హారి వెంకట ప్రసాద్, మహేష్, రజిత, శ్రావణి, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో వక్తలు

# అంతరాలులేని సమాజం కోరుకున్న వ్యక్తి సురవరం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, అమరజీవి అగ్రనాయకులు మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ కొల్లాపూర్‌లోని మహబూబ్ ఫంక్షన్‌హాలులో బుధవారం సుధాకర్‌రెడ్డి బంధుమిత్రులు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసభకు మద్దిరెడ్డి అధ్యక్షత వహించగా సిపిఐజాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో చాలామంది నాయకులు ఆదర్శాలు చెబుతారని కాని వాటిని ఆచరించరని, సురవరం సుధాకర్‌రెడ్డి చెప్పిన ప్రతి ఆదర్శాన్ని అమలు చేసి చూపిన నిజమైన ప్రజానాయకుడు అని వారు కొనియాడారు. సుధాకర్‌రెడ్డి జీవితకాలమంతా అంతరాలులేని సమసమాజస్థాపనయే లక్ష్యంగా పనిచేశారని కులం, మతం, ప్రాంతం, డబ్బు హోదా పలుకుబడి ఈ అంతరాలతో ప్రజలు నేడు ఎవరికివారు అంతరాలు గీసుకొని వర్గాలుగా విడిపోయి జీవిస్తున్నారని అన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి అంతరాలులేని సమాజంకోసమే తన జీవితం మొత్తాన్ని కమ్యూనిస్టు పార్టీ కోసం దారబోశారని అన్నారు. నేటితరపు నాయకులందరికి సుధాకర్‌రెడ్డి ఎంతో ఆదర్శమని, ఆకలితో అలమటించే పాలమూరు జిల్లాలో అంబలికేంద్రాలను పెట్టి ఆకలియాత్ర నిర్వహించిన మహామనిషి అన్నారు. 18 సంవత్సరాల యువతీ యువకులకు ఓటుహక్కు కావాలని మొట్టమొదటిసారి దేశవ్యాప్తంగా నినదించి 23 సంవత్సరాలనుండి 18 సంవత్సరాలకే ఓటుహక్కు వచ్చేలా ఉద్యమం చేసి సాధించిన ఘనత ఆయనది అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా,కాంగ్రెస్‌పార్టీ నాయకులు పగిడాల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్, బిజెపి నియోజకవర్గ ఇంచార్జ్ సుధాకర్‌రావు, కందాల రామకృష్ణ, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెనర్సింహ్మా, జిల్లా కార్యవర్గసభ్యులు యేసయ్య, ఆర్.ఇంద్ర, వరదారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి శివుడు, తప్పెట కిరణ్, కిరణ్‌కుమార్, వెంకటస్వామి, యూసుఫ్, నిరంజన్‌నాయుడు, జంగం శివుడు, సుధాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

# సమసిన మంత్రుల వివాదం



### అడ్లూరిపై పొన్నం వ్యాఖ్యల వివాదం
### ఇరువురినీ ఇంటికి పిలిపించుకున్న మహేశ్ గౌడ్ .. పొన్నం క్షమాపణ చెప్పడంతో సమసిన వివాదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్‌ల మధ్య నెలకొన్న వివాదం సమసిపోయింది. అడ్లూరి లక్ష్మణ్‌కు పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పి వివాదానికి ముగింపు పలికారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై పార్టీ నిర్వహించిన సమావేశంలో పొన్నం ప్రభాకర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై అడ్లూరి లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేయడం, దీనికి పొన్నం ప్రభాకర్ సోషల్ మీడియా వేదికగా వివరణ ఇవ్వడం విదితమే. ఈ వివాదం కాస్తా ముదురుతుండడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. మంత్రులు ఇద్దరిని తన నివాసానికి ఆహ్వానించి ఇరువురి మధ్య సయోధ్య కుదిర్చారు. బుధవారం ఉదయం మహేశ్ గౌడ్ నివాసంలో భేటీ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కవ్వంపల్లి సత్యనారాయణ, స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, నాయకులు సంపత్ కుమార్, అనిల్, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

**మంత్రుల మధ్య జరిగిన సంఘటన కుటుంబ సమస్య : మహేశ్ కుమార్ గౌడ్**

టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ చేశారన్న వ్యాఖ్యల పట్ల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నొచ్చుకోవడంతో యావత్ సమాజం కొంత బాధపడిందన్నారు. మంత్రుల మధ్య జరిగిన సంఘటన కుటుంబ సమస్యగా వెల్లడించారు. జరిగిన సంఘటన పట్ల చింతిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పారన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కష్టపడి పైకొచ్చిన నేతలని తెలిపారు. ఈ సమస్య ఇంతటితో సమసిపోవాలని యావత్ మాదిగ సామాజికవర్గానికి మహేశ్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఎక్కడ మాట్లాడినా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల పార్టీ అని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఆశయాన్ని ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్తుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సహాయంతో కుల సర్వే పారదర్శకంగా నిర్వహించామని చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మూడు చట్టాలు తీసుకొచ్చామని అన్నారు.

**అడ్లూరి మనస్తాపం చెందారు.. అందుకే క్షమాపణలు చెబుతున్నా : పొన్నం ప్రభాకర్**

ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'నేను ఆ వ్యాఖ్యలు చేయకపోయినా, ప్రస్తుతం జరుగుతున్న ప్రచారంతో మంత్రి అడ్లూరి మనస్తాపం చెందారు. అందుకే ఆయనకు క్షమాపణలు చెబుతున్నాను. అడ్లూరికి, నాకు పార్టీ సంక్షేమం తప్ప మరో ఉద్దేశం లేదు' అని అన్నారు. నేను ఆ ఒరవడిలో పెరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాకు ఆ సంస్కృతి నేర్పలేదని, సామాజిక న్యాయానికి పోరాడే సందర్భంలో వ్యక్తిగత అంశాలు పక్కన ఉంచి, కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయంలో బలహీనవర్గాల బిడ్డగా ఈరోజు రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నాయకత్వంలో రాహుల్ గాంధీ సూచన మేరకు 42 శాతం రిజర్వేషన్లకు పోరాటం జరుగుతుందన్నారు. లక్ష్మణ్‌కి వ్యక్తిగతంగా క్షమాపణలు చెప్తున్నా, కరీంనగర్‌లో మాదిగ సామాజిక వర్గం మేమంతా కలిసి పెరిగామని తెలిపారు. ఆ అపోహ ఉండవద్దని విజ్ఞప్తి చేస్తున్నా అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

**పార్టీ లైన్ దాటను : లక్ష్మణ్**

పొన్నం క్షమాపణ కోరడంతో ఈ సమస్య ఇంతటితో సమసిపోయిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. పొన్నం ప్రభాకర్‌ను గౌరవిస్తా, కానీ ఆయన వాఖ్యల పట్ల మాదిగ జాతి బాధపడిందన్నారు. అట్టడుగు సామాజిక వర్గాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. జెండా మోసిన తనకు మంత్రిగా అవకాశం ఇచ్చారని, పార్టీ లైన్ దాటే వ్యక్తిని కానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

## మద్యం షాప్‌ల కోసం 1581 దరఖాస్తులు

### ఇంకా పది రోజుల గడువు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ తెలంగాణలో కొత్త మద్యం షాపులకు పిలిచిన దరఖాస్తుల ఆహ్వానంలో భాగంగా ఈ నెల 7వ తేదీ నాటికి 1581 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ తెలిపారు. మద్యం షాపులకు దరఖాస్తులు రోజు రోజు పెరుగుతూ వస్తున్నాయన్నారు. గత రెండేళ్ల క్రితం పిలిచిన మద్యం షాపులకు దరఖాస్తులకు కంటే ఈసారి మద్యం షాపుల కోసం దరఖాస్తులు ఎక్కువ వచ్చే అవకాశాలు ఉన్నాయని అంచనాలు వేస్తున్నామని అన్నారు. తెలంగాణలోని 2620 మద్యం దుకాణాలకు 1581 దరఖాస్తులు ఈ నెల 7 వరకు వచ్చాయన్నారు. ఓపెన్ క్యాటగిరిలో 1834 మద్యం దుకాణాలకు 992 దరఖాస్తులు, గౌడ్‌లకు కేటాయించిన 393 దుకాణాలకు 223 దరఖాస్తులు ఎస్‌సిలకు కేటాయించిన 262 మద్యం దుకాణాలకు 55, ఎస్‌టి లకు కేటాయించిన 131 షాపులకు 13 మొత్తంగా 2620 మద్యం షాపులకు 1581 దరఖాస్తులు వచ్చాయన్నారు. చివరి మూడు రోజులు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉండడంతో తగిన ఏర్పాట్లను చేస్తున్నారు. అబ్కారీ భవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ దరఖాస్తులు వేయడానికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అనుమానాలను నివృత్తి చేయడానికి హెల్ప్ డెస్క్‌లు కూడా ఏర్పాటు చేశారు.

# గ్రామీణ డిజిటల్ కనెక్టివిటీలో 'తెలంగాణ' రోల్ మోడల్



### 'టి- ఫైబర్' గ్రామాల పైలెట్ ప్రాజెక్టు దేశానికే ఆదర్శం
### మంత్రి శ్రీధర్ బాబును అభినందించిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామీణ ప్రాంతాలకు డిజిటల్ కనెక్టివిటీని అందించడంలో 'తెలంగాణ' ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మారిందని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా కితాబునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'టిఫైబర్' గ్రామాల పైలెట్ ప్రాజెక్టు దేశానికి ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. ఆయన అధ్యక్షతన బుధవారం ఢిల్లీ లో నిర్వహించిన 'స్టేట్ గవర్నమెంట్ ఐటీ మినిస్టర్స్ అండ్ ఐటీ సెక్రటరీస్ రౌండ్ టేబ్ సదస్సు'లో వినూత్న విధానాలతో డిజిటల్ సమ్మిళత్వానికి 'తెలంగాణ' బాటలు వేస్తుందంటూ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్ బాబును ప్రత్యేకంగా అభినందించారు. 'లాస్ట్‌మైల్ ఫైబర్ కనెక్టివిటీ' గ్రామీణ సమూహాలను ఎలా మార్చగలదో తెలంగాణ చేసి చూపించిందని కొనియాడారు. 'టీ ఫైబర్' నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు ఇతర రాష్ట్రాలకు కూడా సహకారం అందించాలని కోరారు. ఈ పైలెట్ ప్రాజెక్టును ఇతర ప్రాంతాలకు విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 'డిజిటల్ సమానత్వం సమ్మిళిత వృద్ధికి పునాది. గ్రామీణ–పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న డిజిటల్ అంతరాన్ని తగ్గించాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం. అందుకు అనుగుణంగానే పకడ్బందీ ప్రణాళికలను రూపొందించి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నాం. వినూత్న విధానాలతో ముందుకెళ్తున్నాం. భావితరాల కోసం పటిష్ఠమైన డిజిటల్ మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నాం' అని రాష్ట్ర ప్రభుత్వం తరఫున రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. 'డిజిటల్ ఫలాలు మారుమూల ప్రాంతాల్లో ఉన్న చివరి వ్యక్తి వరకూ చేరాలన్నదే మా లక్ష్యం. టీఫైబర్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికి, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలకు తక్కువ ఖర్చుతో హై స్పీడ్ కనెక్టివిటీని అందించేందుకు కృషి చేస్తున్నాం. డిజిటల్ ఇండియా, భారత్ నెట్ లక్ష్యాలకు అనుగుణంగా ఫైబర్ టు ది హోమ్ నెట్‌వర్క్ ద్వారా ఈ గవర్నెన్స్, విద్య, ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ వ్యవస్థాపకత తదితర సేవలను ప్రజల ముంగిటకే సమర్థవంతంగా చేర్చుతు న్నాం' అని చెప్పారు. 'భారత్ నెట్' అమలులో వేగం పెంచాలని, రైట్ ఆఫ్ వే సవాళ్లను పరిష్కరించాలని, దేశ, రాష్ట్రాల డిజిటల్ ఆస్తులను పరిరక్షించేందుకు సైబర్ భద్రత ఫ్రేమ్‌వర్క్‌లను బలోపేతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కేంద్రాన్ని కోరారు. ఈ అంశాల్లో రాజకీయాలకు అతీతంగా కేంద్రంతో కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో టిఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయండి

### సిఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలిపారు. మొక్కజొన్నకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2400లతో పాటు రూ.330ల బోనస్ లభించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బుధవారం బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని, పంటకోతకు వచ్చి మక్కలను మార్కెట్‌లోకి తరలిస్తున్నారని, దాదాపు అన్ని మార్కెట్ యార్డులు మొక్కజొన్న నిల్వలతో నిండిపోయాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతుల శ్రమను దళారులు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాకు రూ.2400 మద్దతు ధరతో పాటు రూ.330 బోనస్‌ను రైతులకు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అడ్డికి పావు సేరు చొప్పున రైతులు అమ్ముకునే దుస్థితి ఏర్పడిందని, క్వింటా మక్కలను రూ.1600కే రైతుల వద్ద నుంచి ప్రైవేట్ వ్యాపారులు కొంటున్నారని ఆ లేఖలో హరీశ్‌రావు పేర్కొన్నారు.

## మత్తు మందుచల్లి ఇంట్లో దొంగతనం

### వృద్ధుడు మృతి, వృద్ధురాలి పరిస్థితి విషమం



**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో దారుణ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంతానం లేక ఒంటరిగా జీవిస్తున్న వృద్ధ దంపతులపై గుర్తు తెలియని వ్యక్తులు మత్తుమందు చల్లి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో వృద్ధుడు మృతి చెందగా వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన గజ్జల శంకరయ్య (75), భార్య లక్ష్మి దంపతులపై మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వారిపై మత్తు మందు చల్లగా దంపతులు అపస్మారకస్థితిలో పడిపోవడంతో దుండగులు ఇంట్లో చోరీకి పాల్పడ్డారని, లక్ష్మి మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు మాయం అయినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇద్దరూ ఒంటరిగా నివసించడమే కాకుండా వారి ఇల్లు గ్రామానికి కొంచెం దూరంగా ఉండడం దుండగులకు అనుకూలంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. దంపతులు ఉదయం 11 గంటల నుంచే అపస్మారక స్థితిలో ఉండగా సాయంత్రం 6 గంటల సమయంలో స్థానికులు గమనించి పోలీసులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై గంగాధర ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ ఘటనాస్థలాన్ని సందర్శించి గ్రామస్తులు, వైద్యుల ద్వారా వివరాలు సేకరించామన్నారు. సంఘటనలో వృద్ధుడు గజ్జల శంకరయ్య బుధవారం మృతి చెందగా భార్య లక్ష్మి పరిస్థితి విషమంగా ఉందన్నారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
కుత్బుల్లాపూర్ సర్కిల్–25

NIT No. 20/DB/EE/Quthbullapur Circle/GHMC/2025-26, తేది: 08.10.2025

**పని పేరు:** సిసి రోడ్ విస్తరణ, **అంచనా విలువ :** రూ.4.75లక్షలు, **ప్రారంభ తేది & సమయం :** 09.10.2025న మ.1.00గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం :** 16.10.2025న మ.1.00గం.ల వరకు. **టెండర్ ఆహ్వానించు అధికారి వివరాలు మరియు మొబైల్ నెం.:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9701365503, హెడ్ డ్రాఫ్ట్స్‌మన్ సెల్ నెం. 7337557259. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కుత్బుల్లాపూర్ సర్కిల్-25,
జిహెచ్ఎంసి

DIPR R.O. No. : 8909-PP/CL/ADVT/1/2025-26, Date: 08-10-2025



SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
| --- | --- | --- | --- | --- |
| 1 | AP36TA 9652 | Vikram Challa | TATA ACE | 2012 |
| 2 | TS22D 0916 | Vihaya Gaja | DIZER TOUR DIESEL 5 SEATER | 2014 |
| 3 | TS36T 5437 | Itikala Bhagyamma | DIZER TOUR DIESEL 5 SEATER | 2019 |
| 4 | TS08EE 0888 | Raju Togaru | INNOVA CRYSTA 2.4 V DIESEL 7 SEATER | 2017 |

AUCTION DATE : 11-10-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
H.No :4-316,4-317,4-318, Ground Floor, Opp : Fire Station, Parkal, Warangal District Cell : 9666726222, 9989766426


# నేడు 'తెలంగాణ సమాచార హక్కు చట్టం' 20వ వారోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ సమాచార హక్కు చట్టం' 20వ వారోత్సవ వేడుకలు గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరగనున్నాయి. ఈ సందర్భంగా 'ఆర్‌టిఐ 2025' విజేతలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ బహుమతులను అందజేయనున్నారు. గడిచిన 30 నెలలుగా నిర్వీర్యమైన 'సమాచార కమిషన్'కు ఇటీవల నూతనంగా నియమితులైన సమాచార హక్కు కమిషనర్లు నూతన ఉత్తేజాన్ని నింపారు. గడిచిన 11 సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు కమిషనర్లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. నూతన కమిషన్ బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలల కాలంలోనే వీలైనన్ని కేసులను విచారించి. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే ముందుగా తక్కువ కేసులు ఉన్న శాఖలపైన దృష్టి పెట్టి, ఇప్పటి వరకు 12 శాఖలను ప్రక్షాళన చేపట్టారు. ఇందులో పశుసంపద, బిసి సంక్షేమ, పౌర సరఫరాలశాఖ, గృహ నిర్మాణ, పరిశ్రమలు, ఐటి, కార్మిక ఉపాధి కల్పన, ప్లానింగ్, సాంఘీక సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ, యువజన, దేవాదాయ శాఖలు ఉన్నాయి. కాగా నూతనంగా నియమితులైన కమిషనర్లకు వారం రోజుల పాటు హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో శిక్షణ ఇచ్చారు. ఢిల్లీలో జరిగిన నేషనల్ ఫెడరేషన్ అఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్స్ ద్వారా నిర్వహించిన వర్కుషాపులో కూడా వారు పాల్గొన్నారు. ఆ తర్వాత సమాచార హక్కు చట్టాన్ని మరింత పగడ్బందీగా అమలు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ జిల్లా, ప్రభుత్వ శాఖల వారీగా నోడల్ ఆఫీసర్లను నియమించింది. 'పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్ (పిఐఒ), ఆర్‌టిఐ కేసులను పరిష్కరించడంలో,అప్పిలేట్ అథారిటీ, అసిస్టెంట్ పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన,అలాగే ఉత్తమ ఉద్యోగికి' 'తెలంగాణ సమాచార హక్కు చట్టం' 20వ వారోత్సవ వేడకల సందర్భంగా అవార్డులను అందజేయనున్నారు.

**సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు**

సమాచార హక్కు చట్టంపైన ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు కమిషన్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం ప్రాధాన్యతను ప్రజలకు వివరించింది.అవగాహన లేకపోవడం, లేదా ఆ జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడం లేదని గుర్తించి, జిల్లాలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు (పిఐఒ)లతో కలిసి అవగహన సదస్సులు నిర్వహించింది. అలాగే ఆయా జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు విచారించింది. ఇప్పటి వరకు జనగామ, కామారెడ్డి, మెదక్, నిర్మల్, వనపర్తి, వరంగల్, జోగులాంబ గద్వాల్, వికారాబాద్, సిద్దిపేట, మహబూబాబాద్ తదితర జిల్లాలలో అవగాహనా సదస్సులను నిర్వహించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## జూబ్లీహిల్స్‌లో పోలీసుల తనిఖీలు
### రూ.4లక్షల నగదు, భారీగా విదేశీ మద్యం బాటిళ్లు సీజ్


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా నియోజకవర్గంలో ఎన్నికల ఫ్లయింగ్, స్టాటిక్ టీమ్స్ తనిఖీలు చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు చేపట్టారు. బుధవారం పంజాగుట్ట పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా శ్రీనగర్ కాలనీలో ఓ కారులో 4 లక్షల రూపాయల నగదు, 9 చివాస్ రీగల్ మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అతిక్రమించి మద్యం బాటిళ్లు, నగదు సరఫరా చేస్తున్న వారి దగ్గర నుంచి స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జిహెచ్ఎంసి సిబ్బంది రాజకీయ పార్టీల పోస్టర్లు, బ్యానర్లను తొలగించారు. ఇప్పటివరకు అనుమతులు లేని 1,620 రాజకీయ పార్టీల పోస్టర్లు, బ్యానర్లు తొలగించారు.

## జిహెచ్‌ఎంసి ఇయు కార్యాలయ తాళాలు ధ్వంసం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాతబస్తీలోని పూల్ బాగ్ జిహెచ్‌ఎంసికి చెందిన ఓ యూనియన్ ఆఫీసులో భాగ్యనగర్ మున్సిపల్ జిహెచ్‌ఎంసి ఎంప్లాయిస్ యూనియన్‌కు చెందిన కార్యాలయం తాళాలను భారతీయ మజ్దూర్ సంఘ్ గుర్తింపు పొందిన మరో యూనియన్‌కు చెందిన నేతలు పగులకొట్టి అక్రమంగా ప్రవేశించటం వివాదాస్పదమైంది. బిఎంఎస్ గుర్తింపు పొందిన యూనియన్ ఇటీవలే అధ్యక్షులుగా నియమితులైన జిహెచ్‌ఎంసి హెడ్ ఫీసులో సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న నంద కిశోర్‌తో పాటు యూనియన్ నేతలు మల్లి కార్జున్, సత్యనారాయణ, బి. దిలీప్ కుమార్, ఖైరతాబాద్ జోన్ ఎఫ్ ఎ సెక్షన్ అటెండర్ సుదర్శన్, చందానగర్ ట్యాక్స్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ శేరిలింగంపల్లి ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ జి. రాజేశ్వర్ రావులు మంగళవారం తన యూనియన్ తాళాలు పగులకొట్టి అక్రమంగా ప్రవేశించారని భాగ్యనగర్ మున్సిపల్ జిహెచ్ ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కె. ప్రకాశ్, జనరల్ సెక్రటరీ అత్త ఫ్లు పోలీసులకు లిఖితపూర్వకంగా సమర్పించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే యూనియన్ నేతలు అక్రమంగా ప్రవేశించిన యూనియన్ లో రూ. 60 వేల నగదుతో పాటు యూనియన్‌కు చెందిన విలువైన డాక్యుమెంట్లు కూడా మాయమైనట్లు యూనియన్ నేతలు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పాటు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్. వి. కర్ణన్, విజిలెన్స్ ఎసిపికి కూడా ఫిర్యాదులు చేసినట్లు యూనియన్ నేతలు పేర్కొన్నారు. తాళాలు పగులకొట్టిన నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా ఫిర్యాదులో పోలీసులను కోరినట్లు నేతలు వెల్లడించారు.

**ఆఫీసుల్లోనూ యూనియన్ నేతల రాజకీయాలు :** జిహెచ్‌ఎంసి సర్కిల్, జోనల్, ప్రధాన కార్యాలయాల్లో కూడా యూనియన్ నేతల రాజకీయాలతో ఉద్యోగులు, కార్మికులు బెంబేలెత్తుతున్నట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా కొందరు యూనియన్ నేతలు పలువురు ఆఫీసర్లను సైతం బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు, వారిని ఎదురిస్తే ఎలాంటి పరిణామాలెదురవుతాయోనని ఉద్యోగులు, కార్మికులు భయాందోళనకు గురవుతున్నట్లు సమాచారం. మరికొందరు యూనియన్ నేతలు అధికారులతో తమకున్న పరిచయాలతో ప్రత్యర్థి యూనియన్ కు చెందిన నేతలను, ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి.

### పత్తి కొనుగోలుకు కొత్త నిబంధనలు రూపొందించే ముందు..
## రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకుంటే బాగుండేది
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పత్తి కొనుగోళ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు రూపొందించే ముందు రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకుని ఉంటే బాగుండేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సిసిఐ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం వల్లే పత్తి రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. తెలిపారు. పత్తి కొనుగోళ్లకు గాను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇప్పటికే మూడు సార్లు సిసిఐ ప్రతినిధులతో చర్చలు జరిపిందతోపాటు ఈ అంశాన్ని స్వయంగా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో ఈ అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించడం పట్ల వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ రైతాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవతో జిన్నింగ్ మిల్లులు టెండర్లలో పాల్గొనడానికి ముందుకు వచ్చినట్లు వివరించారు. తెలంగాణలో పత్తి సాగు ఎక్కువగా తేలికపాటి నేలల్లో జరుగుతుందని, అధిక సాంద్రత పత్తి సాగు పలు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పత్తి కొనుగోళ్లకు సహకారం అందించడం లేదన్న వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ప్రస్తుతం కేంద్రం ప్రకటించిన పత్తి మద్దతు ధర (ఎంఎస్‌పి) రైతుల సాగువ్యయాలకు తగ్గట్టు లేదన్నారు. ఈ ధర 2021, 2022 సంవత్సరాల్లో కూడా రైతులు ప్రైవేట్‌గా అమ్ముకున్న ధర కంటే తక్కువగానే ఉందన్నారు. 2010 సంవత్సరములోనే క్వింటాలుకు రూ.6000 ధర దక్కిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. గత పదేళ్లలో పెరిగిన ఉత్పత్తి వ్యయాలను పరిగణనలోకి తీసుకుంటే, ప్రస్తుత మద్దతు ధర తగినదిగా లేదన్నారు. దీనికి సంబంధించి గత నెలలో CSిఐ సిపి చైర్మన్‌కు మంత్రి కూడా లేఖ సమర్పించడం జరిగిందని తెలియజేశారు.

**మద్దతు ధరలను ప్రకటించిన పంటల్లో కేంద్రం కొనుగోలు చేసే పంటలు ఎన్ని ?**

కేంద్రం ప్రభుత్వం పంటలకు దమద్దతు ధర ప్రకటించడంతో సరిపెడుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరల ప్రకారం ఎన్ని పంటలను కొనుగోలు చేస్తోందో వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తరఫున కొనుగోళ్లు చేసే కంది, పెసర, సోయాబీన్ పంటలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోళ్లు చేసేటప్పుడు విధించే 25 శాతం సీలింగ్ పరిమితిని ఎత్తివేసి, మొత్తం పంట సేకరణకు అనుమతి ఇవ్వగలరా? అని మంత్రి ప్రశ్నించారు. మొక్కజొన్న, జొన్న పంటలకు కూడా కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా కేంద్రం ముందుకు రావాలని, ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ చూపాల్సిందిగా కోరారు. పత్తి కొనుగోళ్లలో రాష్ట్ర సహకారం అందించడం లేదన్న ఆరోపణ పూర్తిగా అవాస్తవం. ఇప్పటికే జిన్నర్లు, సిసిఐ ప్రతినిధులను సమావేశం ఏర్పాటు చేసి కొనుగోళ్లలో నెలకొన్న ప్రతిష్టంభన తొలగించే విధంగా చర్యలు తీసుకున్నామని ఆయన వెల్లడించారు. ఇకపైనా సిసిఐ ప్రతినిధులు టెండర్లు, జిన్నింగ్ మిల్లులతో ఒప్పందాలు, నోటిఫికేషన్ వంటి ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి త్వరిత గతిన కొనుగోళ్లకు సిద్ధం కావాలన్నారు. తెలంగాణ పత్తి రైతులకు తేమ శాతం మీద పూర్తి అవగాహన ఉన్నదని, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు ఆ దిశగా రైతులకు పూర్తిగా అవగాహన కల్పిస్తున్నామని మంత్రి తెలిపా3రు.



## హైదరాబాద్‌లో భారీగా గంజాయి స్వాధీనం
ఒడిశా నుంచి బస్సులో రూ.14 లక్షల గంజాయి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎక్సైజ్ అధికారులు హైదరాబాద్‌లో రూ.14 లక్షల విలువైన 20కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి ఒడిశా నుంచి హైదరాబాద్ కు వచ్చిన వోల్వో బస్సులో లగేజ్ బాక్స్‌లో లభ్యమైంది. ఒడిశాకు చెందిన నాభి నాయక్ అలియాస్ హరిని రంగారెడ్డి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం అరెస్టు చేసింది.ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గతంలో భారీగా గంజాయి స్మగ్లింగ్ చేస్తూ హైదరాబాద్ రాయదుర్గం ప్రాంతంలో ఎస్‌ఓటి పోలీసులకు పట్టుబడిన నాభిన్ నాయక్ అలియాస్ హరి ఒరిస్సా నుంచి నాలుగు బస్తాల్లో 20 కేజీలకు పైగా గంజాయిని తీసుకువస్తూ ఉన్నాడనే సమాచారం ఎక్సైజ్ అధికారులకు అందింది. ఈ క్రమంలోనే ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎఇఎస్ జీవన్ కిరణ్ సిఐలు సుభాష్ చందర్ ఇతర సిబ్బందిని కలిసి రామోజీ ఫిలిం సిటీ వద్ద బుధవారం బస్సును నిలిపి తనిఖీలు నిర్వహించి అందులో ఉన్నటువంటి గంజాయిని స్వాధీనం సుకున్నారు. 20.600 కేజీలుగా ఉన్నట్లు గుర్తించారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.11 లక్షల మేర ఉంటుందని అంచనా వేశారు. గంజాయిని పట్టుకున్న టీంలో ఎఇఎస్ జీవన్ కిరణ్, సిఐలు సుభాష్ చందర్, బాలరాజు, ఎస్‌ఐలు వెంకట్, రవి, అఖిల్ తో పాటు సిబ్బంది ఉన్నారు. పట్టుకున్న నిందితుడిని హయత్ నగర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు. గంజాయిని పట్టుకున్నటువంటి ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవ్వాస్ ఖాసీం, డిప్యూటీ కమిషనర్ పి దశరథ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్లు అభినందించారు.



## జూబ్లీహిల్స్ కోసం ఐదుగురి పేర్లతో బిజెపి జాబితా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై బిజెపి కసరత్తు చేస్తోంది. అభ్యర్థుల ఎంపిక కోసం మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, మాజీ ఎంపి పోతుగంటి రాములు, సీనియర్ నేత, అడ్వకేట్ కోమల ఆంజనేయులుతో కమిటీ వేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ నిన్న బర్కత్ పురాలోని నగర పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు ముఖ్యనేతల అభిప్రాయాలు తీసుకుంది. దీంతో పాటు క్షేత్ర స్థాయిలో బలాబలాలను అంచనా వేసింది. అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత ఐదుగురి పేర్లను సూచిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావుకు నివేదిక అందించింది. కమిటీ సూచించిన వారిలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుష నేతలు ఉన్నారు. వారిలో గతంలో పోటీ చేసి ఓటమి పాలైన లంకల దీపక్ రెడ్డితో పాటు జూటూరి కీర్తి రెడ్డి, డాక్టర్ వీరపనేని పద్మ, అట్లూరి రామకృష్ణ, ఆకుల విజయ ఉన్నారు. వీరిలో ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ముఖ్యనేతలతో చర్చించనున్నారు. అనంతరం జాతీయ నాయకత్వానికి పేర్లు పంపుతారు. ఆ తర్వాత అభ్యర్థిని ఖరారు చేసే అవకాశం ఉంది.

## మోదీజీ... షాను నమ్మొద్దు
### మమతా బెనర్జీ హెచ్చరిక

**కోల్‌కతా :** ప్రధాని నరేంద్ర మోదీకి అత్యంత విశ్వసనీయ లెఫ్టినెంట్, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హెచ్చరించారు. 'మోదీ జీ అమిత్ షాను నమొద్దు' అని అన్నారు. బెంగాల్ ఉత్తర ప్రాంతంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మూడు రోజుల పర్యటన తర్వాత రాష్ట్ర రాజధానికి తిరిగి వచ్చిన ఆమె కోల్‌కతా విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కోసం ఒత్తిడి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇదంతా అమిత్ షా ఆట. అతను దేశానికి తాత్కాలిక ప్రధాన మంత్రిలా ప్రవర్తిస్తాడు. ప్రధాన మంత్రికి అన్నీ తెలుసు. అలా చెప్పడానికి నాకు బాధగా ఉంది. మనం అతన్ని (మోదీని) మాత్రమే అభ్యర్థించగలం. అమిత్ షాను అంతగా నమ్మవద్దు. ఏక్ దిన్ వో ఆప్ కా మీర్ జాఫర్ బన్ జాయేగా (ఒకరోజు అతను మీ మీర్ జాఫర్ అవుతాడు)' అని అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు 2026 వేసవిలో జరగనున్నాయి. సీఎం మమతా బెనర్జీ మాట్లాడుతూ 'భయానక్ సర్కార్ కా భయానక్ ఆచరణ్ (భయానక్ ప్రభుత్వం భయంకరమైన ప్రవర్తన). నేను చాలా ప్రభుత్వాలను చూశాను. ఒక్కటి కూడా అంత అహంకారం, నియంత కాదు. వారి నాయకుడు ఇక్కడికి వచ్చి బెంగాల్ నుంచి లక్షల మంది ఓటర్లను తొలగిస్తామని చెబుతున్నాడు' అని మండిపడ్డారు. ప్రకృతి వైపరీత్యం, వర్షాకాలం మధ్య ఎస్‌ఐఆర్ ప్రక్రియ 15 రోజుల్లో ఎలా పూర్తవుతుంది నాకు చెప్పండి?. కమిషన్ (ఎన్నికల కమిషన్) బీజేపీ కోసమా లేదా ప్రజాస్వామ్య, పౌర హక్కుల పరిరక్షణ కోసమా?' అని మమత ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీజేపీని హెచ్చరించారు. 'వారు నేడు అధికారంలో ఉన్నారు కానీ రేపు వేరే కథ కావచ్చు' అని తెలిపారు. ఈ సమయంలో షాను నేరుగా ప్రస్తావించకుండా, ఒడిశాలోని కటక్‌లో జరిగిన మత హింసను ప్రస్తావిస్తూ, 'కటక్ మండుతోంది. బీజేపీ, బజరంగ్ దళ్ మత అల్లర్లను రెచ్చగొట్టాయి' అని అన్నారు. హోం మంత్రిగా దేశ అంతర్గత భద్రతకు బాధ్యత వహించే అమిత్ షా వరుస వైఫల్యాలను బెంగా సీఎం మమత సూచించారని టీఎంసీ వర్గాలు తెలిపాయి.

## దగ్గు సిరప్... తాగిన మరో ఐదుగురి పరిస్థితి విషమం

**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లో విషపూరితమైన కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తాగి కనీసం 20 మంది పిల్లలు మరణించిన విషయం తెలిసిందే. అయితే నాగ్‌పూర్‌లో చికిత్స పొందుతున్న మరో ఐదుగురు పిల్లల పరిస్థితి విషమంగా ఉందని అధికారులు నిర్ధారించారు. బాధితుల్లో ఎక్కువ మంది చింద్వారా జిల్లాకు చెందినవారు ఉండగా, ఇద్దరు బేతుల్, ఒకరు పంధుర్నాకు చెందినవారు ఉన్నారు. తమిళనాడులోని కాంచీపురంలో ఉన్న శ్రేసన్ ఫార్మాస్యూటికల్స్ సంస్థ తయారు చేసిన సిరప్ తీసుకున్న తర్వాత పిల్లలకు మూత్రపిండాలు విఫలమైనట్లు సమాచారం. నాగ్‌పూర్‌లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఐదుగురు పిల్లలలో ఇద్దరు ఎయిమ్స్‌లో, ఇద్దరు ప్రభుత్వ ఆసుపత్రిలో, ఒకరు ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారని ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య మంత్రి రాజేంద్ర శుక్లా తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాణాలను కాపాడుకోవడానికి తమ వంతు ప్రయత్నం చేస్తునారని అన్నారు. నాగ్‌పూర్ పర్యటన సందర్భంగా బాధిత పిల్లల కుటుంబాలను శుక్లా కలిశారు. కలుషితమైన సిరప్‌ను ఉత్పత్తి చేసిన కంపెనీ యజమానిని అరెస్టు చేయడానికి చింద్వారా నుండి ఒక పోలీసు బృందం కాంచీపురం చేరుకుంది. మధ్యప్రదేశ్ పోలీసులు కూడా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసి తయారీదారుపై కేసు నమోదు చేశారు. సిరప్‌ను సూచించిన డాక్టర్ ప్రవీణ్ సోనిని అరెస్టు చేశారు. అయితే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ భానుశాలి సోనిని సమర్థించారు. ఫార్మాస్యూటికల్ కంపెనీ, నియంత్రణ అధికారుల వ్యవస్థాగత లోపాలు కూడా ఈ విషాదానికి దోహదపడ్డాయని వాదించారు.

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక..
## పారదర్శకంగా, ప్రశాంతంగా జరగాలి
జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికను స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు తప్పనిసరిగా కేంద్ర ఎన్నికల సంఘం (సిఈసి) మార్గదర్శకాలు, నిబంధనలను పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడుతూ, ఈ నెల 6న ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. ఎంసిసి అమలులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై రాజకీయ బ్యానర్లు, పోస్టర్లు తొలగింపు ప్రారంభించామన్నారు. ఇకపై ప్రచార ప్రకటనల కోసం అనుమతి తప్పనిసరి అన్నారు. ఎంసిసి ఉల్లంఘనలపై కేసులు నమోదు చేస్తామని, ఖర్చులను సంబంధిత పార్టీ ఖాతాలో వేస్తామని తెలిపారు. ఈవిఎంలపై అభ్యర్థుల కలర్ ఫొటోలు ఉండనున్నాయన్నారు. అభ్యర్థులపై ఉన్న కేసులు, నేర చరిత్రను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని పార్టీలను ఆదేశించారు. ప్రచారంలో వినియోగించే మాధ్యమాలన్నింటికీ ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. షేక్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్‌ల స్వీకరణ ఈ నెల 13 నుంచి ప్రారంభమవుతుందని, నామినేషన్ ప్రక్రియకు భద్రత చర్యలు ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు. ఓటర్లకు మొబైల్ ఫోన్‌లతో బూత్‌లో ప్రవేశం నిషేధమన్నారు. మొబైళ్ల కోసం ప్రత్యేక డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. జాయింట్ పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ, ఎంసిసి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నామినేషన్ సమయాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా రాజకీయ పార్టీలు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డిసిపి అపూర్వ రావు, రిటర్నింగ్ అధికారి పి సాయిరాం, రాజకీయ పార్టీల ప్రతినిధులు కె. నందేశ్ కుమార్ (బిఎస్‌పి), కొల్లూరు పవన్ కుమార్, ఎల్. దీపక్ (బిజెపి), విజయ్ మల్లంగి (ఆప్), ఎం. శ్రీనివాసరావు (సిపిఐ(ఎం), పి. రాజేశ్ కుమార్, మహ్మద్ వాజీద్ హుస్సేన్, జి. రాఘవేందర్ (కాంగ్రెస్), కిషోర్ గౌడ్, ఎ. శ్రీనివాస్ గుప్తా, కె. మాధవ్ (బిఆర్‌ఎస్), ప్రశాంత్ రాజ్ యాదవ్ (టిడిపి), సయ్యద్ ఖలీలుద్దీన్ (ఎఐఎంఐఎం) హాజరయ్యారు.

### ఉపఎన్నిక ప్రచార ప్రకటనలకు
## ఎంసిఎంసి అనుమతి తప్పనిసరి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రకటనలపై నియంత్రణను కొనసాగిస్తూ, ఎంసిఎంసి (మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ) అనుమతి తప్పనిసరి అని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసిఎంసి, మీడియా కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన దగ్గర నుంచి ఎలక్ట్రానిక్, లోకల్ కేబుల్, సోషల్ మీడియా, ఈపేపర్, రేడియో, ఇతర ఆన్‌లైన్, డిజిటల్ మాధ్యమాల్లో ప్రచార ప్రకటనల కోసం ఎంసిఎంసి కమిటీ అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రింట్ మీడియాలో ప్రచార ప్రకటనల విషయంలో, పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున ప్రచురించదలచిన ప్రకటనలకు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ఏజెంట్లు ప్రకటనల కోసం ఎంసిఎంసికి దరఖాస్తు చేయాలని సూచించారు. ముద్రించిన కరపత్రాలపై ప్రచురణాధికారి పేరు, చిరునామా తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాల్సిందిగా ఆయన స్పష్టం చేశారు.

**ఎంసిఎంసి కమిటీ సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి..**

**చైర్మన్ :** ఆర్.వి. కర్ణన్ జిహెచ్‌ఎంసి కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి

**మెంబర్ సెక్రటరీ :** మామిండ్ల దశరథం జిహెచ్‌ఎంసి ప్రజాసంబంధాల అధికారి

**సభ్యులు :** పి. సాయి రామ్ జూబ్లీ హిల్స్ రిటర్నింగ్ అధికారి నర్సింగ్ రావు జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఇంజనీర్ (ఐటీ సోషల్ మీడియా)
మనసా కృష్ణకాంత్ హైదరాబాదు పిఐబి డిప్యూటీ డైరెక్టర్
బచ్చన్ జీత్ సింగ్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ డైలీ ప్రిన్సిపల్ కరస్పాండెంట్

కమిటీ ఎన్నికల సమయంలో ప్రచార మాధ్యమాల్లో ప్రచురితమయ్యే వార్తలు, ప్రకటనలు, చెల్లింపు వార్తలపై పర్యవేక్షణ నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో అదనపు ఎన్నికల కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, విజిలెన్స్ ఎస్పీ నరసింహ రెడ్డి, ఇతర అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మీడియా కేంద్రం ద్వారా ప్రజలకు, మీడియా ప్రతినిధులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని పిఆర్‌ఓ విభాగాన్ని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు.

# బిహార్ ఎన్‌డిఎలో సీట్ల లొల్లి!

నాలుగు షరతులు పెట్టిన ఎల్‌జెపి అధ్యక్షుడు
కొలిక్కిరాని పంపకాలు

**పాట్నా :** బిహార్ రాష్ట్ర శాసన సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ పక్షాల మధ్య సీట్ల లొల్లి కొనసాగుతోంది. ముందు లోక్‌జనశక్తి (ఎల్‌జెపి) అధ్యక్షుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నాలుగు షరతులు పెట్టడంతో సీట్ల పంపకాల ఏర్పాటుపై ప్రతిష్టంభన నెలకొంది. అక్టోబరు 10 నాటికి సీట్ల పంపకాలు ఖరారు అవుతాయని కూటమి పేర్కొన్నప్పటికీ, ఎల్‌జెపి డిమాండ్లు, షరతులు సమస్యను పరిష్కరించడానికి బదులుగా క్లిష్టతరం చేశాయి. మంగళవారం బిజెపి బీహార్ ఎన్నికల ఇన్‌చార్జ్ ధర్మేంద్ర ప్రధాన్, ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ వినోద్ తావ్డే, మంత్రి మంగళ్ పాండే ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను కలిసి సీట్ల పంపకాలు, తదుపరి ఎన్నికల వ్యూహంపై చర్చించారు. ఈ సమావేశం 45 నిమిషాల పాటు కొనసాగింది. కానీ ఏకాభిప్రాయం కుదరలేదు. బిజెపి వర్గాల సమాచారం ప్రకారం, చిరాగ్ పాశ్వాన్ బిజెపి ముందు తన డిమాండ్లను వ్యక్తం చేసి సీట్ల పంపకాల కోసం నాలుగు ప్రతిపాదనలను ముందుకు తెచ్చారు. అయితే బిజెపి నాయకులు స్పష్టమైన హామీలు ఇవ్వలేదు. వారు తన డిమాండ్లను కేంద్ర నాయకత్వం ముందు ఉంచుతామని, తర్వాత రెండవ దఫా చర్చలు జరుపుతామని వివరించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎల్‌జెపి ఐదు సీట్లు గెలుచుకుందని, అందువల్ల దాని ఆధారంగా పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో గౌరవప్రదమైన సంఖ్యలో సీట్లు ఇవ్వాలని చిరాగ్ పాశ్వాన్ కోరుతున్నారని ఆ వర్గాలు తెలిపారు. రెండవ షరతు ప్రకారం, 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌జెపి 135 సీట్లలో పోటీ చేసి మొత్తం 5.64 శాతం ఓట్లను సాధించింది. అందువల్ల ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని సీట్ల పంపక సూత్రాన్ని రూపొందించాలని పాశ్వాన్ కోరుకుంటున్నారు. అంతేకాకుండా 2024 ఎన్నికల్లో తాము గెలిచిన ఐదు లోక్‌సభ నియోజకవర్గాల నుంచి కనీసం రెండు అసెంబ్లీ స్థానాల్లో ఎల్‌జెపి పోటీ చేసే విధంగా సీట్ల కేటాయింపును కూడా కేంద్ర మంత్రి ప్రతిపాదించారు. అదేవిధంగా తన పార్టీ అగ్ర నాయకులకు సాంప్రదాయ సీటు అయిన పశ్చిమ చంప్రాన్‌లోని గోవింద్ గంజ్‌ను ఎట్టి పరిస్థితుల్లో దక్కించుకోవాలని పాశ్వాన్ ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. అయితే ఈ స్థానాన్ని వదులుకోవడం కాషాయ పార్టీకి అంత సులభం కాదని భావిస్తున్నారు. చిరాగ్ పాశ్వాన్ 3035 సీట్లు సాధించాలని పట్టుదలతో ఉన్నారని, హిందూస్థానీ అవామ్ మోర్చా (హెచ్‌ఎఎం) వ్యవస్థాపకుడు జితన్ రామ్ మాంఝీ కనీసం 15 సీట్లు దక్కించుకోవాలని చూస్తున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. చర్చల ప్రతిష్టంభన మధ్య... హెచ్‌ఎఎం జాతీయ అధ్యక్షుడు సంతోశ్ కుమార్ సుమన్ మాట్లాడుతూ ఎటువంటి సమస్య లేదని, రాబోయే రెండు మూడు రోజుల్లో సీట్లు ప్రకటిస్తామని అన్నారు.

**15 సీట్లు డిమాండ్ చేస్తున్నా: హెచ్‌ఎఎం అధినేత జితన్‌రామ్**

ఓ పక్క సీట్ల పంపిణీపై చర్చలు సాగుతున్న క్రమంలో హెచ్‌ఎఎం అధినేత జీతన్ రామ్ మాంఝీ కీలక వ్యాఖ్యలు చేశారు. "మాకంటూ ఒక గుర్తింపు ఉండాలంటే.. గౌరవప్రదమైన సీట్లు కావాలి. మేం 15 సీట్లు డిమాండ్ చేస్తున్నాం. ఆ సీట్లు ఇవ్వకపోతే ఎన్నికల్లో పోటీ చేయబోం. కానీ ఎన్డీయేలోనే కొనసాగుతాం. నేనేమీ ముఖ్యమంత్రిని కావాలని కోరుకోవడం లేదు. మా పార్టీకి గుర్తింపు కావాలని మాత్రమే ఆరాటపడుతున్నాం" అని తెలిపారు. దీనిపై బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా ఆయనను బుజ్జగించే ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. ఎన్డీయే కూటమిలో జెడియు, బిజెపి, హెచ్‌ఎఎం, ఎల్‌జెపి, ఉపేంద్ర కుశ్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ (ఆర్‌ఎల్‌ఎం) భాగం. అయితే హెచ్‌ఏఎంకు ఏడు, ఆర్‌ఎల్‌ఎంకు ఆరు సీట్లు ఇచ్చేందుకు బిజెపి సిద్ధమైనట్లు తెలుస్తోంది. కూటమిలో కీలక పార్టీలైన జెడియు, బిజెపి చెరో 100 స్థానాల్లో పోటీ చేయొచ్చని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. నవంబరు 6, 11 తేదీల్లో రెండు విడతలుగా బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.




## పిస్టల్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పిస్టల్ విక్రయిస్తున్న ఇద్దరు యువకులను సిసిఎస్ స్పెషల్ జోనల్ క్రైమ్ టీం ఎసిపి జి. వెంకటేశ్వర్ రెడ్డి అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 0.7ఎంఎం పిస్టల్‌ను స్వాధీనం చేసుకుని నిందితులిద్దర్ని ఫలక్‌నుమా పోలీసులకు అప్పగించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్‌కు చెందిన విజయ్ యాదవ్ (25) చందానగర్‌లో నివాసముంటున్నాడు. జార్ఖండ్‌కు చెందిన ఇతని స్నేహితుడు బంటీ కుమార్ యాదవ్ (22) సంతోష్‌నగర్‌లో నివాసముంటున్నారు. వీరిద్దరు చంద్రాయగుట్టలో పండ్లను విక్రయిస్తుంటారు. వీరిద్దరు హైదరాబాద్‌కు వలస వచ్చి ఫలక్‌నుమా, చంద్రాయణగుట్ట ప్రాంతంలోని స్థానిక వైన్ షాపులు , బార్‌లలో పండ్ల విక్రేతగా పనిచేస్తున్నారు. మూడు నెలల క్రితం విజయ్ యాదవ్ తనకు తెలిసిన వ్యక్తులలో ఒకరైన బీహార్ నివాసి సోను కుమార్ నుండి రూ.58,000 మొత్తానికి దేశీయంగా తయారు చేసిన ఆయుధాన్ని (0.7 మిమీ పిస్టల్) కొనుగోలు చేశాడు. దానిని హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయించే ఉద్దేశ్యంతో ఆ ఆయుధాన్ని తన వద్ద ఉంచుకున్నాడు. విజయ్ యాదవ్, బంటీ కుమార్ యాదవ్‌తో కలిసి లాభాలు ఆర్జించడానికి పిస్టల్ ఫోటోలను చూపించి విక్రయించడానికి ప్రయత్నించారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు చాకచక్యంగా వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా ఆయుధాలు, ఆయుధాలు కలిగి ఉన్న వ్యక్తులు తమ ఆయుధాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో జమ చేయాలని పోలీసులు సూచించారు.

# విభేదాలు పరిష్కరించుకోకుంటే చర్యలు

కేంద్రం హెచ్చరిక

**న్యూఢిల్లీ :** దేశంలోని అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యమైన టాటా గ్రూప్‌లో నెలకొన్న అంతర్గత విభేదాలపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. టాటా ట్రస్ట్స్‌లో నలుగురు ట్రస్టీలు "సూపర్ బోర్డు"గా వ్యవహరిస్తూ గ్రూప్ స్థిరత్వానికి భంగం కలిగిస్తున్నారన్న వార్తల నేపథ్యంలో, కేంద్రం నేరుగా రంగంలోకి దిగింది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా గ్రూప్‌లో స్థిరత్వాన్ని పునరుద్ధరించాలని, అవసరమైతే అందుకు బాధ్యులైన ట్రస్టీలను తొలగించడానికి కూడా వెనుకాడొద్దని టాటా యాజమాన్యానికి సూచించింది.
ఈ మేరకు కేంద్రహోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్... టాటా ట్రస్టుల చైర్మన్ నోయెల్ టాటా, వైస్ చైర్మన్ వేణు శ్రీనివాసన్, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌తో పాటు ట్రస్టీ డారియస్ ఖంబటాతో దాదాపు గంటసేపు సమావేశమయ్యారు. ట్రస్ట్‌లోని అంతర్గత కుమ్ములాటలు హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ కార్యకలాపాలపై ప్రభావం చూపకూడదని స్పష్టం చేశారు. టాటా గ్రూప్ పరిమాణం, ఆర్థిక వ్యవస్థలో దానికున్న ప్రాధాన్యత దష్ట్యా, ట్రస్ట్‌కు ప్రజా బాధ్యత ఉందని ఈ సందర్భంగా మంత్రులు గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 9న రతన్ టాటా మరణించిన నాటి నుంచి ట్రస్ట్‌లో విభేదాలు తలెత్తినట్లు సమాచారం. ముఖ్యంగా నలుగురు ట్రస్టీలు డారియస్ ఖంబటా, జహంగీర్ హెచ్‌సీ జహంగీర్, ప్రమిత్ ఝవేరి, మెహ్లీ మిస్త్రీ ఒక వర్గంగా ఏర్పడి చైర్మన్ నోయెల్ టాటా అధికారాన్ని ప్రశ్నిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి.
టాటా సన్స్ బోర్డు సమావేశ మినిట్స్‌ను సమీక్షించడం, స్వతంత్ర డైరెక్టర్ల నియామకాలను ఆమోదించడం వంటి చర్యలతో వీరు కార్పొరేట్ పాలనా ప్రమాణాలను ఉల్లంఘిస్తున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## సిజెఐపై దాడి హేయం: ఎఐటియుసి

**న్యూఢిల్లీ :** భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)పై సుప్రీం కోర్టు న్యాయవాది దాడి చేయడం దారుణమని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఇటువంటి హేయమైన చర్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కేవలం సస్పెండ్ చేస్తే సరిపోదని, శాశ్వతంగా డీబార్ చేయాలని డిమాండ్ చేశారు. విషపూరిత, దుర్మార్గమైన చర్య దేశ పరువును మంటగలిపిందని ఆందోళన వ్యక్తంచేశారు. రాజ్యాంగ విలువపై దాడి చేసే అనేక ప్రమాకరమైన ధోరణులకు... హిందూత్వ సిద్ధాంతాలాధారిత మోదీ పాలనలో సామాజికలౌకిక నిర్మాణానికి తూట్లు పొడుస్తుండటానికి ఈ ఘటన అద్దం పట్టిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన మూలాలపైనే నేరుగా దాడి చేయడంతో ఇది సమానమని అమర్‌జీత్ కౌర్ వెల్లడించారు. రాజ్యాంగాన్ని, ప్రతి పౌరుని హక్కులను పరిరక్షించే న్యాయాలయమే సుప్రీం కోర్టు అని వర్ణించారు. సీజేఐ దాడి చేయడమంటే న్యాయ వ్యవస్థపై, న్యాయ పవిత్రతపై దాడి చేయడంతో సమానమన్నారు. దాడి చేసిన న్యాయవాదిని ఉపేక్షించబోరని, సంస్థాగత వైఫల్యంపై తగినవిధంగా చర్యలు తీసుకుంటారని ఎఐటియుసి భావిస్తోందని ప్రకటనలో కౌర్ పేర్కొన్నారు.

## బిహార్‌లో 14వేలకు పైగా శతాధిక ఓటర్లు

**పాట్నా :** బిహార్‌లో 100 ఏళ్లు పైబడిన వారు దాదాపు 14,000 మంది ఓటర్లు ఉన్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం గణాంకాల ద్వారా వెల్లడియింది. అయితే, అత్యంత సీనియర్ సిటిజన్స్ కేటగిరీలో 85 ఏళ్లు, అంత కంటే ఎక్కువ వయస్సు ఉన్న ఓటర్ల సంఖ్య ఓటర్ల జాబితా సవరణ తర్వాత గణనీయంగా తగ్గింది. జనవరి 1 నాటికి 85 ఏళ్లు పైబడిన ఓటర్లు 16,07,527 మంది ఉన్నారు. ఈ సంఖ్య ఎస్ఐఆర్ తర్వాత 4,03,985కి పడిపోయింది. దీంతో తుది సంఖ్య 7.43 కోట్లకు చేరుకుంది.


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

**ఇ-టెండర్ నోటీసు నెం.36-2025 తేదీ : 07/10/2025** PUB/1255

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఇంజనీర్ / కో-ఆర్డినేషన్/ గుంతకల్ ఈ క్రింది పనులకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.
**ముగింపు తేదీ & సమయం : 04.11.2025 మధ్యాహ్నం 3.00 గంటలకు.**

**1. టెండర్ నెం. :** Engg-GTL-Co-ORD-1953 **పని వివరణ :** గుంతకల్ డివిజన్ : గుంతకల్ డివిజన్‌లోని ADEN/Spl పనుల కింద స్టేషన్లలో దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు. **ప్రకటన విలువ :** (రూ.) 2,32,95, 474.11 **బిడ్ సెక్యూరిటీ :** (రూ.)2,66,500.00

**2. టెండర్ నెం. :** Engg-GTL-West-1954 **పని వివరణ :** గుంతకల్ డివిజన్ : DEN/West/GTL అధికార పరిధి కింద స్టేషన్లలో దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు. **ప్రకటన విలువ :** (రూ.)5,96,41.083.59 **బిడ్ సెక్యూరిటీ :** (రూ.)4,48,200.00

**3. టెండర్ నెం.** Engg-GTK-South-1955 **పని వివరణ :** గుంతకల్ డివిజన్ : Sr.DEN/South/GTL అధికార పరిధి కింద స్టేషన్లలో దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు. **ప్రకటన విలువ :** (రూ.)5,99.15,129.86 **బిడ్ సెక్యూరిటీ :** (రూ.)4,49,600.00

**4. టెండర్ నెం.** Engg-GTL-Central-1956 **పని వివరణ :** గుంతకల్ డివిజన్: DEN/Central/GTL అధికార పరిధి కింద స్టేషన్లలో దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు. **ప్రకటన విలువ :** (రూ.)5,00,75,265.39 **బిడ్ సెక్యూరిటీ :** (రూ) 4,00,400.00

**5. టెండర్ నెం.** Engg-GTL-North-1957 **పని వివరణ :** గుంతకల్ డివిజన్ : DEN/North/GTL అధికార పరిధి కింద స్టేషన్లలో దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు. **ప్రకటన విలువ :** (రూ.)5,35,62,138.94 **బిడ్ సెక్యూరిటీ :** (రూ.)4,17,800.00

ఏదైనా కొరిజెండా ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది. దయచేసి మా వెబ్‌సైట్ www.ireps.gov.inని సందర్శించండి.
**డివిజనల్ రైల్వే మేనేజర్ / వర్క్స్, గుంతకల్.**

**టెండర్ నెం. GTL-EM-48-2025-26 తేదీ : 08.10.2025** PUB/1256

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ / మెయింటెనెన్స్/ గుంతకల్ ఈ క్రింది పనులకు ఇ-టెండర్‌లను ఆహ్వానించడమైనది.

**1. టెండర్ నెం:** GTL-EM-48-2025-26 **పని పేరు:** గుంతకల్ డివిజన్ : ADEE/M/GTL సబ్ డివిజన్‌లోని స్టాఫ్ కాలనీలకు ప్రతిపాదిత విద్యుత్ రిపేర్లు. **సుమారు విలువ (రూ.) :** 98,24,068.99/-

**ముగింపు తేదీ మరియు సమయం : 29-10-2025 మధ్యాహ్నం 3గంటలకు**
టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.inకు లాగిన్ అవ్వండి. టెండర్ యొక్క దిద్దుబాటు ఏదైనా ఉంటే ఆన్‌లైన్‌లో మాత్రమే జారీచేయబడుతుంది. టెండర్‌దారులు టెండర్ డాక్యుమెంట్‌ను http//www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, మెయింటెనెన్స్, గుంతకల్.**

**GY/DSL/05/AUX MOTORS/2025 తేదీ: 06/10/2025** PUB/1257

సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ / డీజిల్ / Gooty ఈ క్రింది పనులకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

**పని వివరణ :** 2 సంవత్సరాల కాలానికి ఎలక్ట్రికల్ లోకోల సహాయక మోటార్లను మరమ్మతు చేయడం మరియు తిరిగి వైండింగ్ చేయడం. **సుమారు విలువ :** (రూ.) 46,91,862.82 (రూపాయలు నలభై ఆరు లక్షల తొంభై ఒక్క వేల ఎనిమిది వందల అరవై రెండు మరియు ఎనభై రెండు పైసలు మాత్రమే) జీఎస్‌టి సహా. **బయానా డబ్బు డిపాజిట్ (EMD) :** (రూ.) 2,34,600.00 (రూపాయలు రెండు లక్షల ముప్పై నాలుగువేల ఆరు వందలు మాత్రమే)

**ముగింపు తేదీ మరియు సమయం : 29-10-2025 మధ్యాహ్నం 12గంటలకు.**
బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.in, కు లాగిన్ అవ్వండి . ఏదైనా దిద్దుబాటు ఉంటే ఆన్‌లైన్ మాత్రమే జారీ చేయబడుతుంది.
**సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ డీజిల్ లోకో షెడ్, Gooty**

**No.CEE/P/SC-2x25KV-OHE-GTL-DHONE-NDL-18-2025-26-01 తేదీ : 08.10.2025** PUB/1258

భారత రాష్ట్రపతి తరపున, చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), సికింద్రాబాద్ ఈ క్రింది పనులకు (ఆన్‌లైన్) ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

**1. టెండర్ నెం.** 2x25-OHE-GTL-DHNE-NDL-18, తేదీ. 07.10.2025 **పని వివరణ :** దక్షిణ మధ్య రైల్వే పరిధి గుంతకల్ డివిజన్‌లోని గుంతకల్ (సహా)-డోన్ (సహా) నంద్యాల (సహా) సెక్షన్‌లో ఫీడర్ మరియు ఎర్తింగ్ పనులలతో ఉన్న 1x25 kv సిస్టమ్‌ను 2x25 KV AT ఫీడింగ్ సిస్టమ్‌కు OHE అప్‌గ్రేడ్ కోసం "డిజైన్, సప్లయ్, నిర్మాణం, పరీక్ష మరియు కమీషనింగ్. మొత్తం 145 RKM /250 TKM" **సుమారు విలువ :** (రూ.)136,00,96,202.15 **బయానా డబ్బు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలి :** (రూ.) 69,50,500/-. **టెండర్ ఫారమ్ ఖర్చు(రూ.)** NIL. **పూర్తి కాలం :** 18నెలలు. **టెండర్ ఓపెనింగ్ స్థలం :** సికింద్రాబాద్.

**ఇ-టెండర్ ద్వారా టెండర్ క్లోజింగ్ (ఆన్‌లైన్)** : సమయం: 3గంటలకు, తేదీ 25.11.2025
**ఇ-టెండర్ ద్వారా టెండర్ ఓపెనింగ్ (ఆన్‌లైన్)** : సమయం : 3.30గంటలకు, తేదీ 25.11.2025

టెండర్ తెరిచే తేదీ తర్వాత సెలవు దినంగా ప్రకటించబడితే, తదుపరి పనిదినం నిర్ణీత సమయంలో టెండర్లు తెరవబడతాయి.
మరిన్ని టెండర్ నిబంధనలు/ వివరాల కోసం మరియు టెండర్ల సమర్పణ కోసం దయచేసి మా వెబ్‌సైట్ **www.ireps.gov.in** ని సందర్శించండి.
టెండర్ డాక్యుమెంట్లు/ దిద్దుబాటు/ అనుబంధంలో ఏవైనా మార్పులు అవసరమైతే పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయబడతాయి.
**చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), సికింద్రాబాద్.**

**ఇ–టెండరు బహిరంగ ప్రకటన నెం. సిఏఓ/నిర్మాణం/ఆర్‌ఎస్‌పి/ఎస్‌సి/007/2025-కేపిటల్ (పనులు) తేదీ 06/10/2025** PUB/1259

భారత రాష్ట్రపతి తరపున/ నిమిత్తం, ఈ క్రింద సంతకం చేసిన అధికారి ఈ దిగువన పేర్కొన్న పనులకు 27.10.2025వ తేదీ మధ్యాహ్నం 2.00 గంటల లోపు ఇ–టెండర్లు దాఖలు చేయడానికి ఆహ్వానించడమైనది.

**1. ఇ–టెండరు నెం:** నిర్మాణం–సిఏఓ–ఆర్‌ఎస్‌పి–25–007 **పని పేరు:** కొండపల్లి–విజయవాడ సెక్షన్: ఎల్‌సి నెం.147 స్థానంలో రెండు వరుసల ఆర్.ఓ.బి నిర్మాణం. రైల్వే కి.మీ 573/17–19 రీతిగా 6x30 ఎం పిఎస్‌సి బారుదూలం+1x18.0ఎం ఉమ్మడి బారుదూలం 6x30ఎం పిఎస్‌సి (గ్రామం వైపు నిర్మించాలి. మరియు విల్లులాగా వంపు తిరిగిన 1x72.0 ఎం దూలాలను 1x18.0 ఎం ఉమ్మడి దూలం+ 6x30 ఎం పిఎస్‌సి దూలాన్ని గుంటుపల్లి రోడ్డువైపు రైల్వే కి.మీ. 573/16/18 అనుసంధాన రహదారిని ఎలప్రోలు & గుంటుపల్లి మధ్య కొండపల్లి& రాయనపాడు స్టేషన్ల మధ్య నిర్మించాలి. **టెండరు సుమారు విలువ:** (రూ) 58,01,04,931.82 **ఇఎండి :** (రూ) 30,50,500.00. **పని పూర్తి చేయాల్సిన సమయం (నెలల్లో) :** 18. **డిఫెక్ట్ లయబిలిటీ గడువు : (నెలల్లో):** 36. పనులను ప్రామాణికమైన అర్హతలు విశ్వసనీయంగా పరిగణిస్తారు. 2(డి). "రైల్వే/మెట్రో/రోడ్ (బ్రిడ్జి వర్కు ఏదైనాగానీ స్టీల్/కాంపోజిట్ బాణంలా వంపు తిరిగిన దూలం మరియు/లేదా పిఎస్‌సి దూలం సూపర్ పవర్ నిర్మాణం ఉండాలి.
* ఇ–టెండరింగ్ విధానం ద్వారా మాత్రమే టెండరులలో పాల్గొనాలి. వ్యక్తిగతంగా, భౌతికంగా వచ్చి టెండర్లు సమర్పిస్తే వాటిని పరిగణనలోకి తీసుకోరు.
* టెండరు పత్రాలు/ ఇతర వివరాలన్నీ ఐ ఆర్ ఇ పి ఎస్ వెబ్‌సైటు **www.ireps.gov.in** లో ఉన్న టెండరు పత్రాలలో లభ్యం అవుతాయి. వాటిని డౌన్‌లోడ్ చేసుకుని, మార్పులు, చేర్పులను చూడటానికి ఇంకా ఏదైనా వివరాలు తెలుసుకోవడానికి పైన పేర్కొన్న వెబ్‌సైటును అనుసరించాలి.
**డిప్యూటీ చీఫ్ ఇంజనీరు నిర్మాణం/ఆర్‌ఎస్‌పి సికింద్రాబాదు**

**నెం. ఎన్‌డబ్ల్యు 148/WIII/ టెండరు నోటీసు/2025–26** PUB/1261

ఈ క్రింద పేర్కొన్న టెండరు పనులను భారతీయ రైల్వే ఇ–సేకరణ వ్యవస్థలో అప్‌లోడ్ చేయడమైనది. టెండరు వివరాలను ఇప్పటికే www.ireps.gov.inలో అప్‌లోడ్ చేయడమైనది.

**1.టెండరు నెం. టి–2025–26–3–072 అథారిటీ:** సమన్వయ **పని అభివర్ణన:** పార్కింగ్ నిమిత్తం పాలిస్టర్ లేదా ఫైబర్‌గ్లాస్ ఉన్న అనిప్రిదాలను మలుచుకోవడానికి వీలైన టెన్సైల్ ఫ్యాబ్రిక్‌తో పైకప్పు నిర్మాణం చేయాలి, ముందుగానే పోతపోసిన ఆర్‌సిసి ఫ్లాట్‌ఫామ్, ఒకదానిలో మరొకటి గట్టిగా ఇమిడిపోయే విధంగా పోతపోసిన ఫ్లాట్‌ఫామ్‌లు మరియు సోలార్ ప్యానెల్స్ ఎంపిక, సెటు, పిటియు, ఆర్‌టిజి మరియు ఎస్ఎస్‌ఎల్ పార్కింగ్ రూఫ్‌షెడ్ పెట్టాలి. **టెండరు విలువ : (రూ) :** 93336673.62 **ఎర్నెస్ట్ మనీ (రూపాయలలో):** 616700.00 **పని పూర్తి చేయాల్సిన గడువు :** తొమ్మిది నెలలు. **టెండరు పత్రం ఖరీదు (రూ):** 0/–

**2.టెండరు నెం: టి–2025–26–2–073 అథారిటీ:** సమన్వయ **పని అభివర్ణన:** SW–I: నాందేడ్ డివిజన్: ఎయుఇ–సిఎంకెటి: మురుగునీటి కాలువ ఏర్పాట్లు,ఎత్తైన ఇనుప దూలాల నిర్మాణాలు, రోడ్డు పనులు అనుబంధ పనులు తదితరాలను ప్రస్తుతం ఉన్న ఆర్‌యుబి నెం.75ఏ, 75 బి, 76ఏ మరియు 80ఏ. SW–II: నాందేడ్ డివిజన్: ఎయుఇ–సిఎంకెటి: మురుగునీటి డ్రైనేజీ, ఎత్తైన ఇనుప దూలాల నిర్మాణాలు, రోడ్డు పనులు తదితరాలను ప్రస్తుతం ఉన్న ఆర్‌యుబి నెం: 82ఏ & 85ఏ,88ఏ &92. **టెండరు విలువ (రూపాయల్లో):** 9,44,78,360.25లు. **ఎర్నెస్ట్ మనీ (రూపాయల్లో) :** 6,22,400.00 **పని పూర్తి చేయాల్సిన గడువు సమయం :** 12 నెలలు. **టెండరు పత్రం ఖరీదు (రూపాయలలో):** 0/–

**3. టెండరు నెం: టి–2025–26–2–074 అథారిటీ:** సమన్వయ **పని అభివర్ణన:** ఎన్ఇడి–ఎయుఇ–సిఎంకెటి: ఆర్‌హెచ్ గిర్డర్‌తో ఎయిర్ పుషింగ్ మెథడ్ స్థానంలో ఎల్‌సి నెం.12 117/2–3 కి.మీ. మధ్య అదనపు ఎల్‌హెచ్‌ఎస్ నిర్మించాలి. **టెండరు విలువ : (రూ):** 3,37,13,470.14 **ఎర్నెస్ట్ మనీ: (రూపాయలలో):** 3,18,600.00 **పని పూర్తిచేయాల్సిన గడువు సమయం:** 12 నెలలు. **టెండరు పత్రం ఖరీదు:**(రూ): 0/–

**4.టెండరు నెం: టి–2025–26–2–075 అథారిటీ:** సమన్వయ **పని అభివర్ణన:** ఎన్ఇడి–ఎకె–సిఎంయు సెక్షన్:775/8–9 కి.మీ వద్ద ఎల్‌హెచ్ఎస్ నిర్మాణం కోసం ప్రతిపాదిత (అతిక్రమణ ప్రదేశం–యుఎంఎల్‌సి నెం.95 సమీపంవద్ద) ఎయిర్ పుషింగ్ మెథడ్‌లో ఆర్‌హెచ్ గిర్డర్‌తో లోహగో–అమనోవాడి స్టేషన్ల మధ్య నిర్మించాలి. **టెండరు విలువ:(రూ):** 5,03,96,275.99 **ఎర్నెస్ట్ మనీ : (రూపాయలలో):** 4,02,000.00 **పని పూర్తిచేయాల్సిన గడువు సమయం:** 12 నెలలు. **టెండరు పత్రం ఖరీదు:(రూ):** 0/–

**1. టెండరు నెం: టి–2025–26–2–072 ఒకేవిధమైన పని (ఖరీదు 50 లక్షలు పైగా):** ఎలాంటి సివిల్ ఇంజనీరింగ్ పని అయినాగానీ (ట్రాక్ పనులు/జోనల్ పనులు మినహాయించి). **టెండరు పత్రం ఖరీదు :**(రూ): 0/–

**2.టెండరు నెం: టి–2025–26–2–073 ఒకేవిధమైన పని చేయాలి (ఖర్చు 50 లక్షలు పైగా):** ఎలాంటి సివిల్ ఇంజనీరింగ్ పని అయినాగానీ జోనల్ పని మినహాయించి చేయాలి.

**3. టెండరు నెం: టి–2025–26–2–074 ఒకేవిధమైన పని చేయాలి (ఖర్చు 50 లక్షలు పైగా ఉండాలి):** ఎలాంటి సివిల్ ఇంజనీరింగ్ నిర్మాణం పని అయినాగానీ బాక్స్ పుషింగ్/పైపు జాకింగ్ టెక్నిక్ లేదా (బ్రిడ్జి వర్కు ఖర్చు మరియు పిఎస్‌సి స్లాబ్ లాంచింగ్/పిఎస్‌సి గిర్డర్/పిఎస్‌సి బాక్స్ పనులు ఉంటాయి.

**4.టెండరు నెం: టి–2025–26–2–075 ఒకేవిధమైన పని (ఖర్చు 50 లక్షలు పైగానే):** ఏ విధమైన సివిల్ బ్రిడ్జి నిర్మాణమైనాగానీ బాక్స్ పుషింగ్/ పైపు జాకింగ్ టెక్నిక్ లేదా (బ్రిడ్జి వర్కులు కలిపి ఉంటాయి ఖర్చు మరియు పిఎస్‌సి శ్లాబ్ లాంచింగ్/ పిఎస్‌సి (గిడర్/ పిఎస్‌సి బాక్స్.

పైన పేర్కొన్న టెండరు ముగింపు తేదీ: 31.10.2025 మధ్యాహ్నం 3.00 గంటలకు. ఇతర వివరాలకు మా వెబ్‌సైటు www.ireps.gov.inను సందర్శించండి.
**సీనియర్ డివిజనల్ కో–ఆర్డినేటర్/నాందేడ్**

**టెండరు నోటీసు** PUB/1260

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ /సికింద్రాబాదు డివిజన్, దక్షిణమధ్య రైల్వే, సికింద్రాబాదు. ఈ క్రింది పనులకు ఇ–సేకరణ ద్వారా బహిరంగంగా టెండర్లను ఆహ్వానించడమైనది.

**1. టెండరు నెం & తేదీ:** సి ఎస్‌జి 36 575 తేదీ: 06/10/2025 , ముగింపు తేదీ : 27/10 /2025. **పని పేరు:** 1) చర్లపల్లి (సిహెచ్‌జెడ్) స్టేషన్ నుండి సికింద్రాబాద్ వైపు ప్రతిపాదిత ట్రాక్షన్ మోటార్ సమీపం చివరి వరకూ ప్రతిపాదిత టిప్, షెడ్‌కు సంబంధించిన సిగ్నల్ మరియు టెలికాం ఏర్పాట్లు.
2) ఎస్ఎస్ఎఫ్ యార్డ్–లెగ్ వద్ద కొత్త టిప్ షెడ్ నిర్మించడానికి సంబంధించిన టెలికాం ఏర్పాట్లు సిద్ధం చేయడం
3) ఛిత్తపూర్ (సిటి) స్టేషన్‌వద్ద షంటింగ్ నెక్ సిద్ధం చేయడానికి సంబంధించిన సిగ్నలింగ్ ఏర్పాట్లు
4) ఛిత్తపూర్ (సిటి) స్టేషన్ వద్ద ప్రతిపాదిత సరుకు రవాణా రైలు తనిఖీల సదుపాయాలకు (రెండవ దశ) సంబంధించిన సిగ్నలింగ్ ఏర్పాట్లు. **సుమారు విలువ: (రూ):** 3,40,91,159.85 **బిడ్ సెక్యూరిటీ/ఇఎండి: (రూ):** 3,20,500/–

ఇతర వివరాలకు www.ireps.gov.in వెబ్‌సైటును సందర్శించండి.
**సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, సికింద్రాబాదు**
A1580

**మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైటును సందర్శించండి.**


ప్రపంచంలోనే అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌లో...


# భారత్‌కు 3వ స్థానం



### ప్రధానమంత్రి మోదీ వెల్లడి
### నవీ ముంబయిలో అంతర్జాతీయ విమానాశ్రయం, ముంబయి మెట్రో ఆక్వాలైన్ మొదటి దశ ప్రారంభం

**నవీ ముంబయి :** ముంబయి నగరంలో కేంద్ర ప్రభుత్వం తోడ్పాటుతో నేడు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆయన బుధవారం దేశ ఆర్థిక రాజధాని నవీ ముంబయిలో అంతర్జాతీయ విమానాశ్రయం, ముంబయి మెట్రో యొక్క ఆక్వాలైన్ మొదటి దశను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగిస్తూ తామర పువ్వు ఆకారంలో ఉన్న నవీముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం వీక్షిత్ భారత్‌ను ప్రతిబింబిస్తుందని మోదీ పేర్కొన్నారు. 'ఈ విమానాశ్రయం శివాజీ మహరాజ్ భూమిపై ఉంది. ఇది ఒక సామూహిక సంస్కృతి, శ్రేయస్సు. ఈ విమానాశ్రయం కారణంగా రైతులు, మత్స్యకారులు ఇప్పుడు మార్కెట్లను పొందవచ్చు' అని ప్రధాని మోదీ అన్నారు. 2014లో తాను పదవీ బాధ్యతలు స్వీకరించినప్పుడు దేశంలో కేవలం 74విమానాశ్రయాలు మాత్రమే ఉండేవని, కానీ నేడు ఆ సంఖ్య 160కి పైగానే చేరిందన్నారు. ప్రపంచంలోనే భారతదేశానికి మూడవ అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా గొప్ప స్థానం దక్కిందని కొత్త విమానాల ఆర్డర్‌లతో, మరికొందరు పైలట్లకు అవకాశాలు, క్యాబిన్ క్రూ, గ్రౌండ్ వర్కర్లు, మరమ్మతుల నిర్వహణకు మరిన్ని అవకాశాలు పెరిగాయని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. 'ముంబయి వన్ యాప్ లాంచ్' కారణంగా కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం, భూగర్భ మెట్రో కారిడార్‌తో ముంబయి మహానగరం ఆసియాలోనే అతిపెద్ద కనెక్టివిటీ హబ్‌గా మారుతుందన్నారు. స్థానిక రాజకీయ ప్రముఖుడు, రైతు కార్మికుల పార్టీ (పిడబ్ల్యుపి) నాయకుడు దివంగత డి.బి.పాటిల్ చేసిన కృషిని ఈ సందర్భంగా ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆయన రైతుల సంక్షేమం కోసం కృషిచేశారు. నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టనున్నారు. డి.బి.పాటిల్ 'సమాజానికి ఒక ప్రేరణ' అని ప్రధానమంత్రి మోదీ అభివర్ణించారు. అనంతరం ఉగ్రవాదం విషయంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిని ప్రధానమంత్రి మోదీ తూర్పారబట్టారు. పాకిస్థాన్‌తో సంబంధం కలిగి ఉన్న 26/11 ముంబయి ఉగ్రదాడుల తర్వాత కాంగ్రెస్ పార్టీని ఎవరు నిరోధించారో దేశానికి చెప్పాలని ప్రధానమంత్రి మోదీ గట్టిగా నిలదీశారు. ఉగ్రవాదంపై పోరాటాన్ని కాంగ్రెస్ పార్టీనే బలహీనపరుస్తోందని ప్రధాని ఆరోపించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఏ ప్రభుత్వం (200414) ఉగ్రవాదంపై పోరాటాన్ని బలహీనపరిచిన కారణంగా దేశం భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వచ్చిందని మండిపడ్డారు. 2008లో ముంబయి ఉగ్రదాడుల తర్వాత ఒక దేశం భారతదేశం చర్యలను నిరోధించిందని అప్పుడు కేంద్ర హోం మంత్రిగా ఉన్నటువంటి కాంగ్రెస్ ముఖ్య నాయకుడు ఒకరు చెప్పారని ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ తప్పకుండా స్పష్టంచేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నవీముంబయిలో భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించారు. 2008లో ఉగ్రవాదులు ముంబయిని లక్ష్యంగా చేసుకుని నిర్వహించిన తీవ్రమైన ఉగ్రదాడుల కారణంగా శక్తివంతంగా ఉన్న ముంబయి మహానగర భవిష్యత్తు దుర్బలంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నొక్కిచెప్పారు. అప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్న కాంగ్రెస్ ముఖ్యనాయకుడు మాట్లాడుతూ ఉగ్రవాదులు పాకిస్థాన్‌పై దాడి చేసినందుకు యుపిఎ ప్రభుత్వం ఒత్తిడికి గురైందన్నారు. మన రక్షణ దళాలు ఈ దాడిని తిప్పికొట్టేందుకు మన దేశ ప్రజల ఆలోచనకు అనుగుణంగా మన రక్షణ దళాలు పొరుగుదేశమైన పాకిస్థాన్‌పై ప్రతీకార దాడి చేయాల్సి ఉన్నదని, అయితే ఆ విషయమై భారతప్రభుత్వం ఏ మాత్రం స్పందించలేదని గుర్తుచేస్తూ, ఆనాటి కేంద్ర హోం మంత్రి చిదంబరం వ్యాఖ్యలను ప్రధాని మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. 2008 నవంబరులో పాకిస్థాన్ నుంచి భారీగా ఆయుధాలు ధరించి వచ్చిన సాయుధ ఉగ్రవాదులు ముంబయిలో మూడు రోజులపాటు మారణహోమం సృష్టించారు. అమెరికా జాతీయులు సహా 166మంది వారి దాడుల ఘటనలో చనిపోగా,300మందికి పైగా గాయపడ్డారు. మోదీ కాంగ్రెస్ పార్టీపై మరింత పదునైన విమర్శనాస్త్రాలు సంధించారు. యుపిఎ ప్రభుత్వ హయాం నాటి పరిస్థితి నేడు భారతదేశంలో లేదని, దేశంలోకి చొరబడి ఉగ్రదాడులకు పాల్పడ్డ శత్రువులకు భారతదేశం గట్టిగా తిరుగు సమాధానం ఇచ్చిందని మోదీ గుర్తుచేశారు. జాతీయ భద్రత విషయంలో తమ ప్రభుత్వం ఎలాంటి రాజీపడబోదని మోదీ అన్నారు.

## మోదీ పాలనలో దళితులకు గౌరవం లేదు : ఖర్గే



**బెంగళూరు :** ఉన్నతస్థానాల్లో ఉండే లేదా సాధారణ దళిత పౌరులకు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ పరిపాలనలో ఎలాంటి గౌరవం లేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై ఒక న్యాయవాది తన కాలి బూటు విసిరేందుకు విఫలయత్నం చేశారు. అవమానకరంగా ప్రవర్తించిన ఇటీవలి ఆ సంఘటనను ప్రస్తావిస్తూ ఖర్గే పైవిధంగా స్పందించారు. ఉత్తరప్రదేశ్ రాయ్‌బరేలీజిల్లాలో వాల్మీకి వర్గానికి చెందిన ఒక వ్యక్తిపై దొంగ అని ముద్రవేసి విచారణలేకుండా గ్రామస్థులు చిత్రవధ చేసిన ఘటనను కూడా ఖర్గే ఖండించారు. ఆ రాష్ట్రంలో దిగజారిపోతున్న శాంతి భద్రతల పరిస్థితికి ఇది ఒక తార్కాణమని విమర్శించారు. జస్టిస్.బి.ఆర్.గవాయ్‌పై కాలి బూటు విసిరి దాడికి యత్నించి మనుస్మృతి,సనాతన ధర్మం పేరుతో సమాజంలో శాంతికి విఘాతం కలిగిస్తూ ప్రజల ప్రాథమిక హక్కులను లాక్కోవాలని కోరుకునే అలాంటి వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఖర్గే డిమాండ్ చేశారు. దీనిని తాను రాజకీయంగా ఉపయోగించుకోవాలని కోరుకోవడంలేదని, సమాజంలో ఈ విధమైన ఆలోచనాదృక్పథం ఉన్న వ్యక్తులను కొన్ని సంస్థలే సృష్టిస్తున్నాయని, ఆ విధమైన మతోన్మాద సిద్ధాంతాలను వ్యాప్తిచేస్తున్నాయని పరోక్షంగా ఆర్ఎస్ఎస్ మత సంస్థలను విమర్శించారు. ఇలాంటి వారు మనుషులను మనుషులుగా చూడటంలేదనీ, మహిళల హక్కులకు లాక్కుంటున్నారని, స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు గడచిన తర్వాత కూడా ఈ ఆలోచనావిధానంలో మార్పు రాలేదని అన్నారు. మనుస్మృతి పేరుతో ప్రజల ప్రాథమిక హక్కులను లాక్కోవాలని కోరుకునేవారిని కఠినంగా శిక్షించాలన్నారు. ''న్యాయవాదినని చెప్పుకుంటున్న ఒకవ్యక్తి మతం పేరుతో భారత ప్రధాన న్యాయమూర్తిపై కాలి బూటు విసిరే ప్రయత్నం చేశాడు. వ్యక్తిగతంగాను, పార్టీ తరపునా కూడా నేను ఈ ఘటనను తీవ్రంగా ఖండించాను, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ (కాంగ్రెస్ నాయకులు) కూడా ఈ ఘటనను ఖండించారు. కొంచెం ఆలస్యంగానైనాగానీ ప్రధానమంత్రి కూడా స్పందించి ఖండించారు'' అని ఖర్గే చెప్పారు. బెంగళూరులో బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, మతంపేరుతో సుప్రీంకోర్టు గదిలో భారత ప్రధాన న్యాయమూర్తిని అవమానించేందుకు ప్రయత్నం చేసిన ఆ వ్యక్తిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి, ఎంతో హృదయభారంతో నేను ఈ విషయం చెబుతున్నా, మత ప్రాతిపదికపై జరిగిన ఈ ఘటన తర్వాత న్యాయవాదులు, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీల నుండి భారీస్థాయిలో ప్రతిఘటన, ప్రతిస్పందన వ్యక్తం కాలేదు, కానీ కొన్ని ప్రగతిశీల రాష్ట్రాల నుండి మాత్రమే ఈ ఘటనను ఖండిస్తూ ప్రతిస్పందనలు వచ్చాయి, సానుకూల ఆలోచనాదృక్పథంగల న్యాయవాదులు, రాజకీయపార్టీల నాయకులు మాత్రమే సుప్రీంకోర్టులో జరిగిన ఈ ఘటనను ఖండించారు'' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో బాహాటంగా జరిగిన ఈ ఘటనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్దస్థాయిలో ప్రతిఘటన రాలేదన్నారు. ఒక వృద్ధుడైన న్యాయవాది కోర్టు గదిలో భారత ప్రధాన న్యాయమూర్తిపై కాలి బూటు విసిరే ప్రయత్నంచేసిన ఇదొక అసాధారణమైన, దిగ్భ్రాంతి కలిగించే విషయం గడచిన సోమవారం జరిగింది. ఆ తర్వాత ఆ న్యాయవాదిని పోలీసులు తీసుకుపోతున్నప్పుడు ''సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేందిలేదు....అంటూ పెద్దపెద్దగా కేకలు పెట్టారు.

## ఐదేళ్లలో 146 రోజులు భేటీ

### 78 బిల్లులను ఆమోదించిన 17వ బిహార్ అసెంబ్లీ



**న్యూఢిల్లీ :** పదవీ కాలం ముగిసే ప్రస్తుత బిహార్ శాసనసభ మొత్తం 146 రోజులు సమావేశమైంది. ఇది దాని ఐదేళ్ల పదవీకాలంలో అత్యల్పమని శాసనసభ మేధావి బృందం తెలిపింది. ఈ 17వ అసెంబ్లీ సంవత్సరానికి సగటున 29 రోజులు సమావేశమైంది. సభ సమావేశమైన రోజులలో సగటున మూడు గంటలు కార్యకలాపాలు నిర్వహించింది. 2024లో అన్ని రాష్ట్రాలలో అసెంబ్లీలు సమావేశమైన రోజులలో సగటున ఐదు గంటలు సమావేశమయ్యాయని పిఆర్ఎస్ శాసనసభ విశ్లేషణ చేసింది. కాగా, బిహార్‌లో నవంబర్ 6, 11 తేదీలలో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 14న ఫలితాలు వెల్లడి కానున్నాయి. అయితే 17వ అసెంబ్లీ 78 బిల్లులను ఆమోదించింది. అన్ని బిల్లులను కూడా వాటిని ప్రవేశపెట్టిన రోజే ఆమోదించారు. తదుపరి చర్చ కోసం ఏ బిల్లును ఏ కమిటీకీ సూచించలేదు. ఈ కాలంలో ఆమోదించబడిన బిల్లులలో ఎక్కువ భాగం విద్య, ఆర్థికం, పన్నులు, పరిపాలనకు సంబంధించినవే ఉన్నాయి. ఈ బిల్లులలో కొన్ని బిహార్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అన్యాయమైన మార్గాల నివారణ) బిల్లు, 2024, బిహార్ కంట్రోల్ ఆఫ్ క్రైమ్స్ బిల్లు, 2024, ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, భద్రత, సంక్షేమం) బిల్లు, 2025 ఉన్నాయి. 2023లో ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థలలో రిజర్వేషన్లను పెంచేందుకు రెండు బిల్లులను ఆమోదించింది. అయితే, వీటిని జూన్ 2024లో పాట్నా హైకోర్టు కొట్టివేసింది. వార్షిక బడ్జెట్‌పై సాధారణ చర్చలు కాకుండా, శాసనసభ్యులు పదవీకాలంలో ప్రధాన మంత్రిత్వ శాఖల ఖర్చులను కూడా చర్చించారు. 2020 నుండి ఐదు సంవత్సరాలలో, సగటున తొమ్మిది రోజుల పాటు మంత్రిత్వ శాఖ ఖర్చులను అసెంబ్లీ చర్చించిందని అది తెలిపింది.

## జాతీయ చైతన్యంలో వైమానిక చర్యకు..
# ఆపరేషన్ సిందూర్ సరైన స్థానాన్ని పునరుద్ధరించింది

### ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ వెల్లడి
### హిండన్ ఎయిర్‌బేస్‌లో నిర్వహించిన '93వ ఎయిర్‌ఫోర్స్ డే' కార్యక్రమంలో కీలక ప్రసంగం



**హిండన్ (యుపి) :** ఆపరేషన్ సిందూర్ సమయంలో శత్రు లక్ష్యాలపై భారత వైమానిక దళం (ఐఎఎఫ్) జరిపిన 'ధైర్యం'తో కూడిన 'ఖచ్చితమైన' దాడులు జాతీయ స్పృహలో దాడిచేసే వైమానిక చర్యకు సరైన స్థానాన్ని పునరుద్ధరించాయని వాయుసేన అధిపతి ఎ.పి.సింగ్ అన్నారు. కొన్ని రోజుల్లోనే సైనిక ఫలితాలను రూపొందించడంలో వాయుశక్తిని ఎలా సమర్థవంతంగా ఉపయోగించవచ్చో తన దళం ప్రపంచానికి నిరూపించిందని సింగ్ తెలిపారు. బుధవారం 93వ వైమానికదళ దినోత్సవం సందర్భంగా ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్ బేస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వైమానిక సైనికులను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. భారత వైమానికి దళం అక్టోబరు 8, 1932న అధికారికంగా స్థాపించబడింది. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రశంసిస్తూనే, భవిష్యత్తు భద్రతా సవాళ్లకు సిద్ధంగా ఉండాలని వైమానిక యోధులకు పిలుపునిచ్చారు. భారత వైమానిక దళం ప్రణాళిక వినూత్నంగా, ఆచరణాత్మకంగా, అనుకూలతతో ఉండాలన్నారు. దాని శిక్షణ 'మనం పోరాడినట్లుగా శిక్షణ ఇవ్వండి' అనే సూత్రంపై ఆధారపడి ఉండాలని ఎ.పి.సింగ్ నొక్కిచెప్పారు. 'ఆపరేషన్ సిందూర్‌లో మా పనితీరు మాకు వృత్తిపరమైన గర్వాన్ని నింపుతోంది. సైనిక ఫలితాన్ని రూపొందించడంలో వైమానిక శక్తిని ఎలా సమర్థవంతంగా ఉయోగించవచ్చో కొన్ని రోజుల్లోనే ప్రపంచానికి నిరూపించాం' అని సింగ్ పేర్కొన్నారు. ఖచ్చితమైన ప్రణాళిక క్రమశిక్షణతో కూడిన శిక్షణ, దృఢ నిశ్చయంతో కూడిన అమలు ద్వారా ఏమి సాధించవచ్చో ఆపరేషన్ సిందూర్‌ను ఒకప్రకాశవంతమైనఉదాహరణగా వాయుసేనఅధిపతిఎ.పి.సింగ్‌సోదాహరణంగా అభివర్ణించారు.'మాబలమైనవాయురక్షణనిర్మాణం,దీర్ఘశ్రేణి ఉపరితలం నుంచి గగనతల క్షిపణుల వ్యవస్థల దాడి ఉపయోగం ప్రత్యర్థి యొక్క ఆపరేషన్ సామర్థ్యాన్ని పరిమితం చేసిందని, అంతేకాకుండా మా వైమానిక ఆస్తుల భద్రతను కూడా నిర్ధారించింది' అని ఎయిర్ చీఫ్ మార్షల్ చెప్పారు. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేయబడిన, సమీకృత ఆయుధాదల అత్యుత్తమ పనితీరు, శత్రుభూభాగంపై ఖచ్చితమైన, విధ్వంసకర దాడులను అందించడం, స్వదేశీ సామర్థ్యంపైన మన విశ్వాసాన్ని రుజువు చేస్తుందని సింగ్ వివరించారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ దాడికి ప్రతిస్పందనగా భారత దేశం మే 7న ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. పాకిస్థాన్ నియంత్రణలో ఉన్న భూభాగాలలోని అనేక ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేయడానికి భారత వైమానిక దళం వైమానిక శక్తిని ఉపయోగించింది. ఈదాడులు నాలుగురోజుల పాటు తీవ్ర ఘర్షణలకు దారితీసింది. మే 10న సైనిక చర్య నిలిపివేయడంతో ఇరుదేశాల తీవ్ర ఘర్షణలు ముగింపునకు వచ్చి ఒక అవగాహనకు వచ్చాయి. భారత వైమానిక దళం కార్యచరణ ప్రణాళికలలో కొత్త వ్యవస్థలు, ఆయుధాలు, ఐఎఎఫ్‌కు సంబంధించిన ఆపరేషన్ ప్రణాళికల సామగ్రి భారత్ గణనీయ విజయానికి ప్రాముఖ్యతను ఇచ్చిందని ఆయన ఈ సందర్భంగా వివరించారు.వైమానిక యోధులలో జవాబుదారీతనం, రక్షణ మరియు భద్రత యొక్క పెరిగిన సంస్కృతి ఉందని నేను గమనించగలను. ఇదాఇ మన తగ్గిన సంఘటనలు, ప్రమాదాలలో ప్రత్యక్షంగా ప్రతిబింబిస్తున్నది అని ఎయిర్ చీఫ్ మార్షల్ సింగ్ తెలిపారు.ఎలాంటి ఆకస్మిక పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ఐఎఎఫ్ సిద్ధంగా ఉండాల్సిన ఆవశ్యకతను వాయుసేన అధిపతి వైమానిక యోధులకు వివరించారు.

## కరూర్ తొక్కిసలాట ఘటనపై
# సుప్రీంకోర్టుకు విజయ్



**చెన్నై:** టివికె పార్టీ అధినేత విజయ్ బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై సిట్ దర్యాప్తునకు మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును ఆయన సవాల్ చేశారు. తన పార్టీకి వ్యతిరేకంగా సిట్ పక్షపాత వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై దర్యాప్తునకు సీనియర్ ఐపిఎస్ అధికారి అస్రాగార్గ్ అధ్వర్యంలో సిట్ ఏర్పాటైంది. పోలీసుల దర్యాప్తు, అధికారుల పాత్రపై తాము ఇదివరకే ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ.. రాష్ట్ర పోలీసు అధికారులతోనే మద్రాస్ హైకోర్టు సిట్‌ను ఏర్పాటుచేసిందని టివికె తన పిటిషన్‌లో పేర్కొంది. తమ పార్టీపై సిట్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని విజయ్ ఆరోపించారు. టీవీకే అధ్యక్షుడు విజయ్ కు నాయకత్వ లక్షణాల్లేవని, ఘటన జరిగిన వెంటనే ఆ పార్టీ నేతలందరూ పారిపోయారని వ్యాఖ్యానించిన మద్రాసు హైకోర్టు... కరూర్ ఘటనపై ఆ పార్టీ తీరును తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే. తొక్కిసలాట తర్వాత అన్ని పార్టీలూ సహాయక చర్యలు చేపడితే, నిర్వాహకులు వెళ్లిపోయారని తప్పుపట్టిన సంగతి తెలిసిందే. ఈవిషయాన్ని టివికె పార్టీ తన పిటిషన్‌లో ప్రస్తావించింది. ఆ వ్యాఖ్యలు ఇప్పటికే దర్యాప్తును ప్రభావితం చేశాయని పేర్కొంది. తన ర్యాలీలో ఇబ్బందులు సృష్టించేందుకు ముందస్తు కుట్రలను తోసిపుచ్చలేమని పేర్కొంది. టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను కలిసేందుకు తనకు అనుమతివ్వాలంటూ డిజిపికి విజయ్ మెయిల్ పంపారు. విషాదంలో ఉన్న బాధిత కుటుంబాలను స్వయంగా కలిసి పరామర్శించాలని కోరుకుంటున్నట్లు అందులో పేర్కొన్నారు. దీనికి ముందు ఆయన బాధిత కుటుంబాలతో వీడియో కాల్‌లో మాట్లాడారు. త్వరలోనే వారివద్దకు వస్తానని హామీ ఇచ్చారు. కాగా, తొక్కిసలాటలో మతి చెందిన 13 ఏళ్ల బాలుడి తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు.

## గ్యాస్ సిలిండర్ల ట్రక్కులు ఢీ... భారీ పేలుడు

**జైపూర్ :** రాజస్థాన్‌లో జైపూర్‌అజ్మేర్ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి రాత్రి ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను తీసుకెళుతున్న ట్రక్కు మరో ట్రక్కు ఢీకొంది. దీంతో గ్యాస్ సిలిండర్లు పేలి ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. ఈ ఘటనతో సమీపంలోని వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. కొన్ని కిలోమీటర్ల మేర పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ అయింది. ఈ ఘటనపై రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ ఆదేశాలతో డిప్యూటీ సీఎం ప్రేమ్‌చంద్ బైర్వా ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. రెండు ట్రక్కుల డ్రైవర్లు, క్లీనర్లు కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. వారి జాడ కోసం పోలీసులు వెతుకుతున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ప్రజాపక్షం
గురువారం, 09 అక్టోబరు

## ఐదు దశాబ్దాల వెట్టి చాకిరీ!

ఐదు దశాబ్దాలుగా వెట్టిచాకిరీ చేస్తున్న అంగన్వాడీల సమస్యలు ఎవరికీ పట్టడం లేదు. డిమాండ్లను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ఎవరిలోనూ లేదు. దేశ రాజధాని న్యూఢిల్లీ నుంచి, అంగన్‌వాడీ సమాఖ్య సదస్సు వేదికగా వేలాది మంది 'వలంటీర్లు' వెలిబుచ్చిన అభిప్రాయాలు.. పంచుకున్న సమస్యలు కూడా అరణ్య రోదనలే అవుతాయన్నది చేదు నిజం. అంగన్వాడీ సేవలకి 50 ఏళ్ల ప్రయాణం.. వారిని గుర్తింపు కోసం అర్ధ శతాబ్దం పోరాటం. దేశవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసిడిఎస్)లో అంగన్వాడీలు, హెల్పర్ల సేవలు మొదలై యాభై ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఢిల్లీలో జరిగిన సమావేశం మరోసారి భారతదేశంలోని అంగన్వాడీ సిబ్బంది స్థితిగతులపై దృష్టిని సారించింది. సుదీర్ఘ ప్రయాణం పూర్తి చేసుకున్న ఆనందం కంటే, ఈ నిలకడలేని కొలువులు ఇంకెంతకాలమనే ఆవేదనే అక్కడ అందరిలోనూ కనిపించింది. డిమాండ్లను తీర్చాలన్న నినాదాలతో ఆ ప్రాంతం ప్రతిధ్వనించింది. దేశంలో శిశు మరణాల రేటు, పోషకాహార లోపాలు, తల్లి ఆరోగ్య పరిస్థితులు తీవ్రంగా ఉన్న పరిస్థితుల్లో, 1975లో మహిళా శిశు అభివృద్ధి లక్ష్యంగా ప్రారంభమైన ఈ పథకం, తన సుదీర్ఘ ప్రయాణంలో అత్యంత విలువైన సేవలు అందిస్తున్నది. లక్షలాది మంది చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం, టీకాలు, ప్రాథమిక విద్య తదితర సేవల్లో కీలక భూమిక పోషిస్తున్నది. కానీ, ఈ అత్యుత్తమ సేవల వెనుక అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల శ్రమకు గుర్తింపు లేదు. దేశ వ్యాప్తంగా దాదాపు 14 లక్షలకుపైగా ఉన్న అంగన్వాడీ సిబ్బందిలో అత్యధిక శాతం మంది గ్రామీణ మహిళలు. వారి కష్టమే ఈ పథకాన్ని నడిపిస్తున్న చోదక శక్తి. అయినప్పటికీ వారి జీతభత్యాలు, పని పరిస్థితులు మాత్రం నిరాశాజనకం. వర్కర్లకు సగటున 10 నుంచి 12 వేల రూపాయలు, హెల్పర్లకు దాదాపుగా అందులో సగం మాత్రమే చెల్లిస్తున్నారు. చాలా రాష్ట్రాల్లో ఈ చెల్లింపులు తరచు ఆలస్యమవుతున్నాయి. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్న అంగన్వాడీల దశాబ్దాల డిమాండ్ పాలకుల చెవికి ఎక్కడం లేదు. వారిది కేవలం వేతన సమస్య కాదని.. గుర్తింపు, భద్రత, గౌరవం మేళవించిన పోరాటంలో భాగమని గ్రహించడం లేదు. 'వలంటీర్' అనే ముద్రవేసి, జీతాలు, వేతనాల బంధనాలను తెంపేసుకుంటున్న ప్రభుత్వాలు, పనిభారాన్ని మాత్రం పూర్తిగా వారి భుజాలపై వేస్తున్నాయి. గ్రామీణ ఆరోగ్యం మెరుగుపడిందని గొప్పగా ప్రకటించుకుంటున్నాయి. తమ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నాయి. అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోసం నిరసనలు, ఉద్యమాలు మొదలైన ప్రతిసారీ కమిటీలు, అధ్యయనాల పేరుతో 'కాలయాపన' నాటకం. బాధితులకు ఒరిగింది ఏమీ లేదు. వారి ఆశలు నెరవేరింది లేదు. ఐసిడిఎస్ అనేది సామాజిక సేవ అంటూ ప్రభుత్వాల పలాయనవాదం. కాబట్టి, అంగన్వాడీలంతా స్వచ్ఛంద కార్యకర్తలని, ఉద్యోగులుగా గుర్తించే అవకాశం లేదంటూ వితండవాదం. అదే నిజమైతే, వారిపై ప్రభుత్వాల పెత్తనం ఏమిటి? వారిపై విపరీతమైన భారం మోపడం ఎందుకు? కొత్త డిజిటల్ యాప్‌లు.. డేటా అప్‌డేట్‌లు.. ఆరోగ్య సర్వేలు... అంటూ ఒత్తిళ్లు ఎందుకు? వాస్తవానికి, ఐసిడిఎస్ పథకం కారణంగా దేశంలో శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గింది. పోషకాహార లోపాలు తగ్గుముఖం పట్టాయి. పల్లెల్లో మహిళా విద్య, ఆరోగ్య అవగాహన పెరిగింది. ఈ మార్పులకు ప్రధాన కారణం అంగన్వాడీ వ్యవస్థే అని అందరికీ తెలుసు. కానీ, ఈ వ్యవస్థను నడిపే మహిళలను గౌరవించటం, వారి సమస్యలు తీర్చడం మాత్రం తెలియదు. అంగన్వాడీ వర్కర్లకు కనీసం ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగ హోదా ఇవ్వాలన్న డిమాండ్ సమంజసం. వారి వేతనం కేంద్ర, రాష్ట్ర నిధుల ద్వారా సుస్థిరంగా ఉండేలా వ్యవస్థ రూపకల్పన జరగాలన్న సూచన అనుసరణీయం. అర్ధ శతాబ్దానికిపైగా 'వలంటీర్ల' పేరుతో మోసగించడం గర్హనీయం... వారి సేవలను అవమానించడం. గౌరవం, భద్రత లేని ఈ కొలువు ఎంత కాలం చేయాలన్న అంగన్వాడీల ప్రశ్నకు ప్రభుత్వాలు సమాధానం ఇచ్చి తీరాలి. సామాజిక అభివృద్ధికి పునాదులు వేయాలన్న ఒక ఆలోచనను తమ విశిష్ట సేవలతో గొప్ప వ్యవస్థగా తీర్చిదిద్దిన అంగన్వాడీలకు న్యాయం జరగాలి. వారి సమస్యలపై ప్రభుత్వాలు మౌనం వీడకపోవడం... కష్టాలను చూడకుండా కళ్లు మూసుకోవడం ఇంకెంతోకాలం సాగదు. అర్ధ శతాబ్దం పాటు అట్టడుగు స్థాయిలో పనిచేసిన మహిళల వేదన, గౌరవ పోరాటాలు ఆగవు. వారికి ఉద్యోగ హోదా ఇవ్వనప్పుడు, సేవా దశాబ్దాలు... అర్ధ శతాబ్దాలు జరుపుకోవడంలో అర్థం ఉండదు. వారిది నేడు జీవన్మరణ సమస్య. అందుకే, కనీస గౌరవం కోసం.. ఉద్యోగ భద్రత కోసం పోరాట సన్నాహాలు. అంగన్వాడీలు విధులు బహిష్కరించి, ఉద్యమబాట పట్టకముందే ప్రభుత్వాలు మేల్కోవాలి. వారి సేవలు గుర్తించాలి. న్యాయమైన డిమాండ్లు తీర్చాలి.

# గాజాపై ట్రంప్ 20 అంశాల శాంతి మంత్రం

*గాజాలో యుద్ధం పరిసమాప్తి, శాంతిస్థాపన, రెండు సంవత్సరాలుగా సాగుతున్న ఇజ్రాయెల్ విధ్వంసకాండలో సర్వనాశనమైన గాజా ప్రాంతం పునరాభివృద్ధి, టెర్రరిజానికి తావులేకుండా ఇరుగుపొరుగు దేశాల మధ్య శాంతియుత సహజీవనం నెలకొల్పటం ధ్యేయమంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ జె.ట్రంప్ తమ పశ్చిమ మిత్రులతో, అరబ్ మిత్రులతో చర్చించి ప్రకటించిన సెప్టెంబర్ 27న 20 అంశాల కార్యక్రమం ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి రేపింది. ప్రపంచ రాజధానుల్లో పాలస్తీనియన్‌లపట్ల సంఘీభావ ప్రదర్శన పెరుగుతూ ఉండటం, మూడు – నాలుగు జి.7 దేశాలు సహా దాదాపు 150 దేశాలు పాలస్తీనా అథారిటీని గుర్తించిన నేపథ్యంలో ట్రంప్ ఈ చొరవ తీసుకున్నారు. నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు ఆయన తాపత్రయం సైతం తొందరపెట్టి ఉండవచ్చు. ట్రంప్ ప్రతిపాదనల్లోని తొలిభాగం – శాశ్వత కాల్పుల విరమణ, బందీలు–ఖైదీల విడుదలపై ప్రస్తుతం కైరో (ఈజిప్టు)లో చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ప్రాముఖ్యత గల ట్రంప్ 20 ప్రతిపాదనల పథకాన్ని ఇక్కడ ఇస్తున్నాం. – సం॥)*




1. గాజా డీరాడికలైజ్ చేయబడుతుంది; టెర్రర్ రహిత మండలం అవుతుంది. అది తన పొరుగు దేశాలకు ముప్పు కలిగించజాలదు.
2. మీదు మిక్కిలి బాధలనుభవించిన గాజా ప్రజల మేలుకోసం గాజా తిరిగి అభివృద్ధి చేయబడుతుంది.
3. ఈ ప్రతిపాదనను ఇరుపక్షాలు అంగీకరించినట్లయితే యుద్ధం వెంటనే ముగుస్తుంది. బందీల విడుదలకు అనువైన పరిస్థితులు కల్పించేందుకు ఇజ్రాయెల్ సైన్యాలు అంగీకారం కుదిరిన రేఖ వద్దకు ఉపసంహరించుకుంటాయి. ఈ సమయంలో, గగనతలం నుంచి బాంబుదాడులు, ఫిరంగుల షెల్లుల సహా మిలటరీ ఆపరేషన్స్ అన్నీ నిలుపు చేయబడతాయి. దశల వారీ సంపూర్ణ ఉపసంహరణ పూర్తయ్యేందుకు నిర్దేశితమైన షరతులు పాటించేవరకు పోరాట మార్గాలు స్తంభించి ఉంటాయి.
4. ఈ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ బహిరంగంగా ఆమోదించిన 72 గంటల లోపు బందీలందరూ – సజీవులు, మృతులు – తిరిగి పంపబడతారు.
5. బందీలందరి విడుదల పూర్తయినాక, 2023 అక్టోబర్ 7 తర్వాత ఇజ్రాయెల్ జీవిత ఖైదు విధించిన 250మంది ఖైదీలు, నిర్బంధించిన 1700మంది గాజన్‌లను – ఈ సందర్భంగా డిటైన్ చేయబడిన మహిళలు, బాలలు సహా – ఇజ్రాయెల్ విడుదల చేస్తుంది. విడుదల చేసే ప్రతిఒక్క ఇజ్రాయెలీ బందీ అవశేషాలకు, చనిపోయిన 15మంది గాజన్‌ల అవశేషాలను ఇజ్రాయెల్ విడుదల చేస్తుంది.
6. బందీలందరూ తిరిగి వచ్చాక, శాంతియుత సహజీవనానికి, తమ ఆయుధాలు విసర్జించేందుకు అంగీకరించిన హమస్ సభ్యులకు క్షమాదానం ప్రకటించబడుతుంది. గాజా విడిచి వెళ్లదలుచుకున్న హమస్ సభ్యులకు వారిని స్వీకరించే దేశాలకు వెళ్లటానికి సురక్షిత ప్రయాణం ఏర్పాటు చేయబడుతుంది.
7. ఈ ఒప్పందాన్ని అంగీకరించిన మీదట, గాజా స్ట్రిప్‌కు సంపూర్ణ సహాయం వెంటనే పంపబడుతుంది. మానవతా సహాయానికి సంబంధించి 2025 జనవరి 19 ఒప్పందంలో చేర్చబడిన మేరకు కనీస సహాయ పరిమాణాలు ఉంటాయి. పునరావాస మౌలిక వసతులు (నీరు, విద్యుచ్ఛక్తి, పారిశుద్ధ్యం), ఆసుపత్రులు, బేకరీల పునరుద్ధరణ, శిథిలాలు తొలగింపునకు, రహదారులు ప్రయాణ యోగ్యం చేసేందుకు అవసరమైన యంత్ర సామాగ్రి పంపటం ఆ మానవతా సహాయంలో ఉంటాయి.
8. గాజా స్ట్రిప్‌లోకి సహాయం ప్రవేశం, పంపిణీ రెండుపక్షాల జోక్యం లేకుండా ఐక్యరాజ్యసమితి, దాని ఏజన్సీల ద్వారా, రెడ్ క్రెసెంట్ ద్వారా జరుగుతుంది. వైరిపక్షాల్లో దేనితోనూ ఏవిధంగానూ సంబంధంలేని ఇతర అంతర్జాతీయ సంస్థలు కూడా అనుమతించబడతాయి. ఇరువైపులా రఫా క్రాసింగ్ తెరవటం కూడా 2025 జనవరి 19 ఒప్పందం కింద అమలుచేసే ఏర్పాట్ల ప్రకారం జరుగుతుంది.



9. గాజాలో తాత్కాలిక పరివర్తనా కాల పరిపాలన టెక్నోక్రాటిక్, రాజకీయ రహిత పాలస్తీనియన్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతుంది. ఈ కమిటీలో అర్హులైన పాలస్తీనియన్ లు, అంతర్జాతీయ నిపుణులు ఉంటారు. ''బోర్డు ఆఫ్ పీస్'' అని పిలిచే ఒక కొత్త అంతర్జాతీయ సంస్థ పరిశీలన, పర్యవేక్షణ కింద ఆ కమిటీ పనిచేస్తుంది. ఆ బోర్డుకు అధ్యక్షుడు డోనాల్డ్ జె.ట్రంప్ చైర్మన్‌గా ఉంటారు. ఆ బోర్డులో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ సహా ఇతర సభ్యులు, రాజ్యాధినేతలు ఉంటారు. పాలస్తీనా అథారిటీ తన సంస్కరణ కార్యక్రమం పూర్తి చేసేవరకు – అది ఎప్పటికి పూర్తి అయితే అప్పటి వరకు – ఈ సంస్థ గాజా పునరాభివృద్ధి నమూనాను నిర్దేశిస్తుంది, నిధుల సమీకరణ, వ్యయాలను నిర్వహిస్తుంది.
10. మధ్య ప్రాచ్యంలో ఆధునిక అద్భుత నగరాలుగా వర్ధిల్లుతున్న నగరాల నిర్మాణానికి సహాయపడిన నిపుణుల బృందాన్ని సమావేశపరిచి, గాజా పునర్నిర్మాణ ప్రణాళిక రూపకల్పన వారికి అప్పగించబడుతుంది. సదాలోచన పరులైన అంతర్జాతీయ బృందాలు లోతైన ఆలోచనతోకూడిన పలు పెట్టుబడి ప్రతిపాదనలు, అద్భుతమైన అభివృద్ధి ఆలోచనలు రూపొందిస్తున్నాయి. ఈ పెట్టుబడులు ఆకర్షించేందుకు, వాటికి దోహదం చేసేందుకు వీలుగా భద్రత, పరిపాలన చట్రాలు రూపొందించబడతాయి. ఈ పథకాలు ఉపాధులు, అవకాశాలు కల్పిస్తాయి. భవిష్యత్ గాజాకు ఆశారేఖలవుతాయి.
11. ఒక ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు చేయబడుతుంది. అందులో పాల్గొనే దేశాలతో చర్చలు జరిపి అంగీకారయోగ్యమైన టారిఫ్, యాక్సెస్ రేట్లు నిర్ణయించబడతాయి.
12. గాజా వదిలి వెళ్లిపోవాల్సిందిగా ఎవరిపైనా ఒత్తిడి ఉండదు. వెళ్లదలుచుకున్నవారు వెళ్లవచ్చు, వారికి తిరిగివచ్చే స్వేచ్ఛ ఉంటుంది. ఇక్కడే ఉండండి, గాజా పునర్నిర్మాణానికి తోడ్పడండి అని ప్రజలు ప్రోత్సహించబడతారు.
13. గాజా పరిపాలనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా లేదా ఏ రూపంలోనైనా పాత్రను కోరబోమని హమస్, ఇతర గ్రూపులు అంగీకరించాలి. అన్ని మిలటరీ, టెర్రర్, సైనిక దాడి మౌలిక వసతులన్నీ – సొరంగాలు, ఆయుధ తయారీ వసతులు సహా – ధ్వంసం చేయబడతాయి. స్వతంత్ర మానిటర్ల పర్యవేక్షణ కింద గాజా నిస్సైనికీకరణ ఒక క్రమంలో జరుగుతుంది. నూతన గాజా, సౌభాగ్యవంతమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి, తమ ఇరుగుపొరుగుతో శాంతియుత సహజీవనానికి సంపూర్ణంగా కట్టుబడుతుంది.
14. హమస్, ఇతర గ్రూపులు తమ బాధ్యతలకు కట్టుబడి ఉంటాయని, నూతన గాజా తన ఇరుగుపొరుగుకు, తన ప్రజలకు ఎటువంటి ముప్పు కాబోదని ప్రాంతీయ భాగస్వాములు గ్యారంటీ ఇవ్వాలి.
15. గాజాలో తక్షణమే నియోగించే నిమిత్తం ఒక తాత్కాలిక అంతర్జాతీయ స్థిరీకరణ దళాన్ని (ఐఎస్ఎఫ్) అరబ్, అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి అభివృద్ధి చేయటానికి అమెరికా కృషి చేస్తుంది. ఈ ఐఎస్ ఎఫ్ గాజాలో వడపోతపోసిన పాలస్తీనియన్ పోలీసు దళాలకు శిక్షణ ఇస్తుంది, తోడ్పాటు ఇస్తుంది. ఈ రంగంలో అపారమైన అనుభవం కలిగిన జోర్డాన్, ఈజిప్టులతో సంప్రదిస్తుంది. దీర్ఘకాలిక అంతర్గత భద్రతకు ఈ బలగం పరిష్కారమవుతుంది. కొత్తగా శిక్షణ పొందిన పాలస్తీనియన్ పోలీసు బలగంతోపాటు ఐఎస్ఎఫ్ సరిహద్దు ప్రాంతాల రక్షణకు ఇజ్రాయెల్, ఈజిప్టులతో కలిసి పనిచేస్తుంది. గాజాలోకి మందుగుండు సామాగ్రి ప్రవేశించకుండా నిరోధించటం, గాజా పునర్నిర్మాణం, పునరుజ్జీవంకోసం సామాగ్రి సత్వరంగా, భద్రంగా గాజాలో ప్రవేశించటం ఎంతైనా అవసరం. ఒక సంఘర్షణ రహిత మెకానిజాన్ని సంబంధిత పక్షాలు అంగీకరించటం అవసరం.
16. ఇజ్రాయెల్ గాజాను ఆక్రమించదు, తనలో కలుపుకోదు. ఐఎస్ఎఫ్ గాజాలో నియంత్రణను స్థిరపరచి, స్థిరత్వం సాధించిన తదుపరి ఇజ్రాయెల్ రక్షణ దళాలు ఐడిఎఫ్) – ఐడిఎఫ్, ఐఎస్ఎఫ్, గ్యారంటీదారులు, అమెరికా నిస్సైనికీకరణ విషయంలో అంగీకరించే ప్రమాణాలు, లక్ష్యసాధనలు, కాలావధుల ప్రాతిపదికపై – ఉపసంహరించుకుంటాయి. సురక్షితమైన గాజా ఇంకెంతమాత్రమూ ఇజ్రాయెల్, ఈజిప్టులకు, లేదా తన పౌరులకు ముప్పుకాదన్న భరోసా ఈ క్రమం ధ్యేయం. ఐడిఎఫ్ గాజానుండి పూర్తిగా ఉపసంహరించుకునేంత వరకు తాత్కాలిక పాలనా అథారిటీతో ఉండే ఒప్పందం ప్రకారం, తన ఆక్రమణలోని గాజా భూభాగాన్ని క్రమానుగతంగా (అంచెలంచెలుగా) ఐఎస్ఎఫ్‌కు అప్పగిస్తుంది. అయితే టెర్రరిజం ప్రమాదం తిరిగి తలెత్తకుండా గాజా సురక్షితం అయ్యేంతవరకు ఐడిఎఫ్ భద్రత ఉనికి కొనసాగుతుంది.
17. ఈ ప్రతిపాదన ఆమోదించటాన్ని లేదా తిరస్కరించటాన్ని హమస్ జాప్యం చేసిన పక్షంలో, సహాయం పెంపుజేసే కార్యకలాపాలు సహా పైన పేర్కొన్న పనులు టెర్రర్ రహిత ప్రాంతాల్లో కొనసాగుతాయి; ఐడిఎఫ్ నుంచి ఐఎస్ఎఫ్‌కు అప్పగించబడతాయి.
18. పాలస్తీనియన్‌లు, ఇజ్రాయెలీల మానసిక స్థితిలో, ఒండొరుల కథనాల్లో మార్పు తెచ్చే నిమిత్తం సహిష్ణుత, శాంతియుత సహజీవనం ప్రాతిపదికపై అంతర్ విశ్వాస సంభాషణ క్రమం ఏర్పాటు చేయబడుతుంది. శాంతి నుండి వనగూరే మేళ్లు వక్కాణించి చెప్పబడతాయి.
19. గాజా పునరాభివృద్ధి పురోగమిస్తుండగా, పాలస్తీనియన్ అథారిటీ సంస్కరణ కార్యక్రమం విశ్వసనీయతతో అమలు జరుగుతుండగా పాలస్తీనియన్ స్వయం నిర్ణయాధికారం, రాజ్య ప్రతిపత్తికి విశ్వసనీయమైన మార్గం అంతిమంగా ఏర్పడవచ్చు. పై రెండింటినీ పాలస్తీనియన్ ప్రజల ఆకాంక్షగా మేము గుర్తిస్తున్నాం.
20. శాంతియుతమైన, సౌభాగ్యవంతమైన సహజీవనం కోసం రాజకీయ యవనికపై ఇజ్రాయెల్, పాలస్తీనియన్‌ల మధ్య ఒక సంభాషణను అమెరికా ఏర్పాటు చేస్తుంది.

# మూఢత్వం, ఛాందసం ముసుగులో ఆధునిక మానవుడు



ఎస్.బాబు
టిజిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు

ప్రాచీన కాలం నుండి మూఢ నమ్మకాలు బలంగా ఉన్నాయి. శాస్త్రీయంగా నిరూపణ కానివే మూఢ నమ్మకాలు. వీటిని నమ్మేవారిలో గ్రామీణులే కాదు, చదువుకున్నవారు, సంఘ శ్రేష్ఠులు కూడా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఈ నమ్మకాలు మనిషిలో ఛాందసాన్ని, మూర్ఖత్వాన్ని పెంచుతాయి. మనిషి నియంత్రణ కోల్పోయినప్పుడు లేదా ఒత్తిడి కి లోనయినప్పుడు వీటిపై నమ్మకాలను పెంచుకుంటాడు. సమాజంలో ఆదర్శవంతులుగా ఉండాల్సిన విద్యావేత్తలు, రాజకీయ నాయకులు, మేధావులు, వ్యాపార దిగ్గజాలు అనేకమంది అతీంద్రియ శక్తులు చూపే బాబాలకు, స్వాములకు శిష్యరికం చేస్తున్నారు. మూఢ నమ్మకాలలో బాగా జనంలోకి పాతుకుపోయినది చేతబడి. దీనినే కొన్ని ప్రాంతాలలో బాణామతి, చిల్లంగి అని కూడా అంటారు. తమకు ఇష్టం లేనివారిని హింసించడానికో, చంపడానికో ఇది ప్రయోగిస్తూ ఉంటారు. జంతుబలి కూడా మరో మూఢాచారం. దైవప్రీతి కోసం ఏదో ఒక జీవాన్ని చంపే క్రతువే ఈ జంతుబలి. ఇది హిందూమతంలో గిరిజన సంప్రదాయం. హైందవ జానపదుల ఆచారంగా వస్తోంది. పురాతన వైదిక మతంలో కూడా ఈ ప్రస్తావన ఉంది. అశ్వమేధ యాగంలో గుర్రాన్ని బలిగా ఇస్తారు. అష్టాదశ పురాణాల్లో కూడా జంతుబలుల ప్రస్తావన ఉంది. అనేక దేవాలయాల్లో దేవతలకి జంతుబలులు, మత్తు పానీయాలు, చేపలను సంప్రదాయంగా సమర్పిస్తారు. గుప్త, చాళుక్య, చోళరాజులు కూడా అశ్వమేధ యాగాలు నిర్వహించినవారే. సనాతన సంప్రదాయ వాదులైన హిందువులు కొంతమంది జంతుబలి సంప్రదాయాన్ని ఇప్పటికీ పాటిస్తున్నారు. కలకత్తాలోని కాళీఘాట్ ఆలయంలో ప్రతిరోజు వందలాది జంతువులను బలి ఇస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా జాన్ పహాడ్‌లో కూడా ప్రతి శుక్రవారం కొన్ని వందల జంతువులు బలవుతుంటాయి. కోళ్ళు, మేకలు, పావురాలు, దున్నపోతులు, గుర్రాలు, ఒంటెలు బలి జంతువులుగా ఉన్నాయి. క్షుద్ర దేవతల పూజల్లో నరబలి ఇచ్చిన ఉదంతాలు కూడా ఉన్నాయి.

రాత్రిపూట గోళ్ళు కత్తిరిస్తే దురదృష్టం వస్తుందని నమ్మకం. ఇంటిపై కాకి అరిస్తే చుట్టాలు వస్తున్నారని, అరచేతులు దురద పెడితే డబ్బు వస్తుందని ప్రజలు నమ్ముతారు. నరేంద్ర దభోల్కర్ అనే రచయిత చేతబడిని నిషేధించాలని అన్నందుకు దుండగులు బైకుల మీద వెంటాడి కాల్చి చంపారు. సతీ సహగమనం ఆచారాన్ని రాజా రామ్ మోహన్ రాయ్ రద్దు చేయాలని కోరారు. 1829 లో లార్డ్ విలియం బెంటిక్ సతీ సహగమన ఆచారాన్ని రద్దు చేశారు. అదొక మూఢాచారమని 1987 లో భారత ప్రభుత్వం సతీ సహగమనం చేయరాదని చట్టం చేసింది. వ్యాపారాలు, వివాహాలు, శుభదినాలు, శుభఘడియలను జ్యోతిష శాస్త్రాన్ని అనుసరించి చేయటం సమాజంలో ప్రబలంగా ఉంది. హస్త సాముద్రికం, జాతకాలు, సంఖ్యా శాస్త్రం, చిలక జోస్యం, రుద్రాక్షలు ధరించటం లాంటివి కూడా ఆచరణలో ఉన్నాయి. భారతదేశంలో ''గాడ్ మేన్'' అనే పదం బాగా వ్యాప్తిలో ఉంది. వారినే బాబాలని, స్వామీజీలని, గురూజీలని పిలుస్తుంటారు. వారిలో కొందరు పాన్ ఇండియా స్థాయిలో ఉన్నారు. మరికొందరు ఇంటర్నేషనల్ లెవల్ నెట్వర్క్ కలిగి ఉన్నారు. వీరికి ప్రచార కర్తలుగా డాక్టర్లు, ఇంజనీర్లు, వ్యాపార దిగ్గజాలు, రాజకీయ నాయకులు పని చేయడం విచారకరం.

''విప్రులెల్ల జేరి వెర్రి కూతలు కూసి
సతీ పతులను కూర్చ సంబరమున
మును ముహూర్తముంచ ముండెట్లు మోసెరా
విశ్వదాభిరామ వినుర వేమ''

వధూవరుల జాతకాలు చూసి శుభదినం అనే ముహూర్తం పెట్టి చేసిన పెళ్ళిళ్ళు ఎందుకు విడాకుల దాకా పోతున్నాయి? ఎందుకు అర్థాంతరంగా చనిపోతున్నారు? అని సమాజాన్ని నిగ్గదీశారు కవి. చనిపోయిన పితరుల ఆత్మల ఆకలి తీర్చటం కోసం వారికి సద్గతి ప్రాప్తించాలని పిండాలను చేసి తర్పణాలను వదలటం మూఢాచారం. ఇక్కడ పెట్టే పిండాలు దశాబ్ద కాలం క్రితం చనిపోయిన వారికి పెడితే అవి కాకులు తింటే వారి ఆకలి తీరడం ఏమిటి? ఈ సాంఘిక మూఢత్వాన్ని యోగి వేమన తూర్పార బట్టారు. ఆయన మాటల్లో చెప్పాలంటే –

''పిండముల చేసి పితరుల తలపోసి
కాకులకు పెట్టు గాడిదలారా!
పెంట తినెడి కాకి పితరుడెట్లాయెరా
విశ్వదాభిరామ వినుర వేమ!''

సుమారు 600 ఏళ్ళ క్రితమే వేమన తన పదునైన పదజాలంతో సమాజాన్ని ప్రశ్నించిన తీరు ఆయనకున్న శాస్త్ర విజ్ఞానానికి నిదర్శనం. ఇదే విషయాన్ని చార్వాకులు, శిక్కు మత గురువైన గురు నానక్ పురోహిత వర్గాన్ని ప్రశ్నించారు. కాని వారి నుండి సమాధానం లేదు. కుజదోషం ఉన్న వ్యక్తిని చెట్టుకో, పుట్టకో, జంతువుకో, నిర్జీవ పదార్థానితోనో పెళ్ళి జరపటం వలన దోష ప్రభావం పోతుందనే మూఢత్వం చాలామంది జనాల్లో ఉంది. ఏడు మిరపకాయలతో కట్టిన నిమ్మకాయలు ఇంటిముందు వేలాడతీస్తే దుష్టశక్తులు దరిచేరవనే నమ్మకం బాగా ఉంది. వాహన పూజ చేసి నిమ్మకాయలు తొక్కిస్తుంటారు. మరి అలాంటి వాహనాలకు ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి? మంగళవారం వాహనాలు కొనుగోలు చేయరాదని జ్యోతిష శాస్త్రం చెబుతోంది అంటారు. ఇది కూడా మూఢ నమ్మకమే. ప్రస్తుత సమాజంలో తిథి, వార, నక్షత్రాలు చూసుకుని గర్భిణీ స్త్రీలకు సహజ ప్రసవ సమయం కాకపోయినా సిజేరియన్ ఆపరేషన్ చేయించుకుని బిడ్డల్ని కంటున్నారు. దానివల్ల వారు మహర్జాతకులవుతారని, ప్రపంచ ప్రఖ్యాతి పొందుతారని వారి విశ్వాసమైనా అదీ మూఢ నమ్మకమే.

సూర్య చంద్ర గ్రహణాల సమయంలో ఆహారం వండరు, తినరు. దేవాలయాలు మూసివేయటం, దుకాణాలు మూసివేయటం, గర్భిణీ స్త్రీలు బయటకు రావద్దనడం జరుగుతోంది. హేతువాద సంస్థలు ఈ సమయాల్లో పై కార్యాలు చేసి ఏమీ కాలేదని నిరూపించిన సంఘటనలు కోకొల్లలు. ఆశారాం బాపూ తన ఆశ్రమంలో మహిళా భక్తులు, మైనర్ బాలికలను లైంగిక వేధింపులకు గురి చేసినందుకు ఆయనకు జీవిత ఖైదు పడింది. మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుకు ఆధ్యాత్మిక గురువైన చంద్రస్వామి విదేశీ మారక ద్రవ్య చట్టాన్ని ఉల్లంఘించినందుకు సుప్రీం కోర్టు ఆయనకు 9 కోట్ల జరిమానా విధించింది. స్వాములు చట్టాలను ఉల్లంఘించటమేమిటో? 1995 లో ఢిల్లీలోని గణేశ విగ్రహం పాలు తాగడం ఓ పెద్ద సంచలనం. ఆ దెబ్బతో పాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. భారతీయ శాస్త్రవేత్త దాన్ని భ్రమ అన్నారు. నేషనల్ కౌన్సిలింగ్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్.సిఎస్.టి) శాస్త్రవేత్తలు పాలలో ఎరుపు రంగు కలప డం ద్వారా కేశ నాళిక చర్యవల్ల ఇది సంభవిస్తుందని నిరూపించారు.

మన ప్రధానమంత్రి నరేంద్రమోడీ 2014 అక్టోబర్ లో బాంబేలోని ఓ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ ''ప్రాచీన భారత దేశంలోనే ప్లాస్టిక్ సర్జరీ అభివృద్ధి చెందింది అనేందుకు ఏనుగు తల కలిగిన హిందూ దేవుడు గణేశుడే సాక్ష్యం'' అన్నారు. ఇది అశాస్త్రీయమైన వాదన. ప్రధానమంత్రి స్థాయి వ్యక్తి మూఢ నమ్మకాలను ప్రచారం చేసే విధంగా మాట్లాడటం అత్యంత బాధాకరం. పశువులైనా, పక్షులైనా, మనుషులైనా శుక్ర శోణితాలు కలిస్తేనే సంతానం లేదా గుడ్లు వస్తాయి. ఇది సైన్స్. ఇదే నిజం కూడా. కాని రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి (మేధావి వర్గానికి చెందినవారు) ''మగ నెమలి కన్నీళ్ళను ఆడ నెమలి తాగడం వల్ల వాటి సంతానానికి జన్మనిస్తాయి'' అన్నారు.

మేధావి అయిన హైకోర్టు న్యాయమూర్తి మూఢ నమ్మకాన్ని శాస్త్ర నిబద్ధత లేకుండా మాట్లాడటం అత్యంత శోచనీయం. కాని వాస్తవంగా మగ ఆడ నెమళ్ళు సంపర్కంతోనే అవి గుడ్లు పెట్టి వాటి సంతానాన్ని అభివృద్ధి చేసుకుంటాయే తప్ప కన్నీళ్ళ ను మింగి కాదు అనేది శాస్త్ర విజ్ఞానం. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు అద్దంకిలో ఒక వేపచెట్టుకు పాలు కారుతున్నాయని ప్రచారం జరగడంతో ప్రజలు తండోప తండాలుగా ఆ చెట్టు దగ్గరకు వచ్చి పసుపు కుంకుమలతో పూజలు చేయటం మొదలుపెట్టారు. కాని ఇది మూఢ నమ్మకమని వృక్ష శాస్త్రం చెబుతోంది. పెద్ద పెద్ద చెట్లకు కొన్ని సందర్భాలలో వాటి భాగాలలో ఎక్కడో బాక్టీరియా సోకి ఇన్ఫెక్షన్ అవుతుంది. దాని వల్ల కాండ, వేరు భాగాల్లో లేటెక్స్ లాంటి చిక్కటి ద్రవం స్రవిస్తుంది. అది మహిమ కాదు. వృక్ష శాస్త్రం గురించి తెలియని వారు దీన్ని మహిమగా భావించటం వారి అజ్ఞానానికి నిదర్శనం.

ప్రజలలో శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించటం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. కాని ఆ ప్రభుత్వాలు ఆ బాధ్యతల నుండి తప్పించుకుని ప్రజలను మూఢాచారాల వైపు, ఛాందస భావాల వైపు నెడుతున్నాయి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 51ఎ (హెచ్) కూడా అధునాతన శాస్త్ర విజ్ఞానాన్ని ప్రజలకు అందించాలని చెబుతోంది. కాని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ ను పక్కన పెట్టి హైస్కూల్ పిల్లల పాఠ్యాంశంలో ముద్రించబడిన డార్విన్ పరిణామ సిద్ధాంతం, పైథాగరస్ సిద్ధాంతం ఛాప్టర్ లను తొలగించింది. ఇది దేనికి నిదర్శనం? ఈ ప్రభుత్వాలు ప్రజలను ఎటువైపు తీసుకెళుతున్నాయి? ప్రతి ఒక్కరు శాస్త్ర విజ్ఞానాన్ని, అధునాతన ఆలోచనలను అందరితో పంచుకుంటే జ్ఞాన పరిధి పెరిగి ఛాందసం, మూఢత్వం కొంతైనా తగ్గి సమాజం వికసిస్తుంది. థింక్ ఓవర్ ఇట్.

# ఉత్తరమా...నీ జాడెక్కడ!

పోస్ట్...పోస్ట్ అనే శబ్దం వింటే చాలు ఏదో తెలియని ఆనందం. ఇంట్లో నుండి ఒక్క ఉదుటున మరీ పోస్ట్‌మెన్ వద్దకు పరుగులు పెట్టేవారు. ఉత్తరాలు, మనీయార్డర్లు వచ్చాయంటే చాలు... హృదయాలు ఉప్పొంగిపోయేవి. ఇంటికి ఎవర్నుంచైనా ఉత్తరం వచ్చిందంటే చాలు కుటుంబ సభ్యులంతా పోటీపడి దాన్ని అందుకునేవారు. నిరక్షరాస్యులు చదువుకున్న వారి దగ్గరికి వెళ్లి ఆ ఉత్తరాన్ని చదివించుకుని వినేవారు. అయితే ఇదంతా గతం. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మానవుడు సాధించిన విశేష ప్రగతి మూలంగా అత్యాధునిక సమాచార సాధనాలు అందుబాటులోకి వచ్చాయి.

1969 వ సంవత్సరం అక్టోబర్ ఒకటో తేదీ నుండి నవంబర్ 16వ తేదీ వరకు జపాన్ రాజధాని టోక్యో నగరంలో 16వ యూనివర్సల్ పోస్టల్ యూనియన్ కాంగ్రెస్‌ను నిర్వహించారు. ఇందు లో భాగంగా కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న 150 దేశాల ప్రతినిధులందరూ యూనియన్ ఏర్పాటు దినమైన అక్టోబర్ 9వ తేదీని ప్రపంచ తపాలా దినోత్సవంగా జరుపుకోవాలని తీర్మానించారు. అంతేకాకుండా తపాలా శాఖ ద్వారా ఎప్పటికప్పుడు ప్రారంభిస్తున్న నూతన సేవలను ప్రజలకు అవగాహన కల్పించడానికి, నూతన తపాలా బిల్లలు ఆవిష్కరించడానికి ఈ రోజున ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల ప్రజలు తమ సమాచారాన్ని సౌకర్యవంతంగా పంపుకునే యంత్రాంగాన్ని సృష్టించడమే ఈ దినోత్సవం జరపడం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

మొట్టమొదట 1861లో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో పోస్ట్ కార్డును ప్రవేశపెట్టారు. తర్వాత అనతికాలంలోనే ఇది అన్ని దేశాలకు విస్తరించింది. మన దేశంలో 1879 జులై 1న పోస్ట్ కార్డ్ ప్రవేశపెట్టారు. అప్పటి నుండి కొన్ని సంవత్సరాలు పోస్ట్ కార్డుకు జనాలకు విడదీయరాని సంబంధం ఏర్పడింది. టెక్నాలజీ రాకతో ప్రస్తుతం ఉత్తరాలకు ప్రాధాన్యం తగ్గిన మాట వాస్తవం నేటికి. విద్యా వ్యాపారరంగాల్లో అక్కడక్కడ ఉత్తరాలు కనిపిస్తున్నాయి.

సమాజంలో వస్తున్న విప్లవాత్మక మార్పులతో ప్రస్తుతం ఉత్తరాలకు ప్రాధాన్యత తగ్గినప్పటికీ ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ తన ఉనికిని చాటుకుంటోంది భారత తపాలా వ్యవస్థ.

పావురాల ద్వారా బట్వాడా నుండి మొదలుకొని స్పీడ్ పోస్ట్, ఈ మెయిల్ ఇలా కొత్త కొత్త విధానాలతో ముందుకు వెళ్తూ ప్రపంచంలోనే తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకుంది. ప్రస్తుతం దేశంలో రైల్వే తర్వాత అంత పెద్ద వ్యవస్థ తపాలా రంగమే.తపాలా వ్యవస్థ మన ప్రభుత్వంలో సమాచార మంత్రిత్వశాఖలోనే భాగమై ఉంది. దీని నియంత్రణ 'తపాలా సర్వీస్ బోర్డు' ఆధీనంలో ఉంటుంది. ప్రస్తుతం మనదేశంలో మొత్తం 23 తపాలా సర్కిల్స్ ఉన్నాయి. ప్రతీ సర్కిల్‌కు ప్రధాన తపాలా జనరల్ అధికారి ఉంటారు. ఇవికాకుండా భారత రక్షణ వ్యవస్థ కోసం ప్రత్యేకమైన సర్కిల్ ఏర్పాటు చేయబడింది. తాజా గణాంకాల ప్రకారం.. దేశంలో 810 హెడ్ పోస్టాఫీసులు, 24,599 సబ్ పోస్టాఫీసులు, 1,31,312 బ్రాంచి పోస్టాఫీసులు, 4,44,266 పోస్టు బాక్సులు ఉన్నాయి. ప్రస్తుతం చూస్తున్న లెక్కల ప్రకారం.. 2017తో పోలిస్తే చాలా వరకూ సంఖ్య తగ్గిందనే చెప్పొచ్చు. వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తపాలా వ్యవస్థ వెనుకబడిపోతోంది. అనేక కొత్త సర్వీసులను తపాలా కార్యాలయాలతో అనుసంధానిస్తామని చెబుతున్నారు. తపాలా విభాగాన్ని అన్నివిధాలా పరిపుష్టీకరించాలని సుబ్రమణియన్ కమిటీ ఏనాడో ప్రతిపాదించింది. బ్యాంకింగ్ ఒక్కటే కాదు.. బీమా, ఇకామర్స్ సేవల విస్తరణనూ తపాలాతో ముడిపెట్టాల ని ప్రభుత్వానికి సూచించింది. ఇతర దేశాల పురోగతిని సోదాహరణంగా ఆ సంఘం తేటతెల్లం చేసింది. విస్తృత తపాలా వ్యవస్థ గల భారత్‌లో స్పీడ్‌పోస్టు కేంద్రాల సంఖ్య 200కు చేరడానికే ఎంతో కాలం పట్టింది. ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా నిధుల విడుదల, చెల్లింపు బాధ్యతల్ని చాలాకాలంపాటు తపాలాశాఖ నిర్వహించింది.

మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలా శాఖ సైతం కొత్త విధానాలకు శ్రీకారం చుట్టింది. ప్రైవేటు కొరియర్లకు దీటుగా స్పీడ పోస్ట్ తో పాటు ఇతర సర్వీసులను ప్రవేశపెట్టింది. దీంతో పాటు బ్యాంకింగ్ సేవలను విస్తృత పరిచారు. పోస్టల్ శాఖ ద్వారా ఎటిఎం సేవలను అందిస్తున్నారు. మనీ ట్రాన్స్ఫర్ సదుపాయం, ఎలక్ట్రానిక్ మనీయార్డర్, ఇన్స్టెంట్ మనీ ట్రాన్స్ఫర్ వంటి తక్షణ డెలివరీ సదుపాయాలను కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా కోర్ బ్యాంకింగ్ సేవలను సైతం విస్తృత పరుస్తున్నారు. పోస్టాఫిసుల్లో సైతం బ్యాంకుల మాదిరిగా మనీ డిపాజిట్,విత్ డ్రాయల్ సౌకర్యాలు కల్పిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం టికెట్ల బుకింగ్‌లు, రైల్వే కౌంటర్లను, ఆధార్ సేవలు, సుకన్య సంవృద్ధి ఖాతా తదితర సౌకర్యాలను పోస్టాఫీసుల్లో ఏర్పాటు చేస్తున్నారు. పోస్టల్ శాఖ ద్వారా అనేక రకాల ఆకర్షణీయమైన భీమా సౌకర్యాలను కల్పిస్తున్నా రు.

**(అక్టోబర్ 9 ప్రపంచ తపాల దినోత్సవం)**

**సుధాకర్ ఎ వి**

## లంబాడిలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



**ప్రజాపక్షం/వెల్దండ :** లంబాడిలపై అనుచిత వ్యాఖ్యలుచేస్తే ఊరుకోమని ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాణావత్ శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లంబాడిల మధ్య ఆదివాసుల మధ్య చిచ్చుపెడుతున్న తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్‌కుమార్, సోయంబాబురావు, తెల్లంవెంకట్రావ్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో గిరిజన నాయకులు కాడురాంనాయక్, పంతుల నాయక్, వెంకట్రాంనాయక్, లక్ష్మణ్‌నాయక్, నారాయణనాయక్, శ్రీనునాయక్, జైరాంనాయక్, శ్రీనునాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

## లాయర్‌ను అరెస్టు చేయాలి



**ప్రజాపక్షం/జడ్చర్ల:** భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్‌పై దాడికి ప్రయత్నించిన లాయర్ రాకేష్ కిషోర్‌ని వెంటనే అరెస్టు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం నాడు జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో దళిత సంఘాల నేతలు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ భారత ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వినోద్ జంగయ్య, భీమరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## పిసి రాధికకు ఎస్‌పి అభినందనలు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** 74వ ఆల్ ఇండియా పోలీస్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ 2025–26 హర్యానా రాష్ట్రంలో సెప్టెంబర్ 20 నుంచి 24 వరకు జరిగింది. ఈ పోటీలలో తెలంగాణ పోలీస్ బృందం తరపున పాల్గొన్న మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ రాధిక (డబ్ల్యుపిసి 2405) 80+ కేటగిరిలో అద్భుత ప్రతిభ కనబరుస్తూ ఎస్ఎస్‌బి ప్లేయర్ సాంగీతపై పోరాటం చేసి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి రాధిక విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఆమెను తన చాంబర్‌లో శాలువా కప్పి అభినందించారు. పట్టుదల మరియు క్రీడాస్ఫూర్తి ఇతర పోలీసు సిబ్బందికి ఆదర్శప్రాయంగా నిలుస్తాయి. తెలంగాణ పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది క్రీడా రంగంలోనూ ప్రతిభ చాటడం ఎంతో గర్వకారణం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో రాధిక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## జెర్రిపోతుకు శస్త్రచికిత్స



**ప్రజాపక్షం/ జడ్చర్ల:** జడ్చర్ల పట్టణంలోని శ్రీ లక్ష్మీ రాజేందర్ ఇండస్ట్రీలో పవర్ బోర్డులో పొరపాటున చేరిన 8 అడుగుల జెర్రిపోతుకి కరెంట్ షాక్ తగిలి గాయం అయ్యింది. అది గమనించిన ఇండస్ట్రీ ఓనర్ సర్పరక్షకుడు డా।। సదాశివయ్యకు తెలియజేయగా ఆయన శిష్యులు శ్రీకాంత్, శివకుమార్‌లు దానిని సంరక్షించారు. అనంతరం డా।। బూర్గుల రామకృష్ణరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జీవవైవిధ్య సంరక్షణ, విద్యాకేంద్రంలో చికిత్స చేశారు.

## సమాచారం తప్పనిసరిగా ఇవ్వాలి



### వనపర్తి జిల్లా అధ్యక్షుడు జి.రవికుమార్

**ప్రజాపక్షం/అడ్డాకుల:** సమాచార హక్కు చట్టం కింద చేసుకున్న ప్రతి దరఖాస్తుకి తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని ఆర్టీఐ ఆక్టివిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షుడు జి.రవికుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టం 2005 పకడ్బందీగా అమలు చేసే క్రమంలో భాగంగా అక్టోబర్ 12న ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారోత్సవాలను పురస్కరించుకుని ఆర్టీఐ ఆక్టివిటిస్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల గణేష్ ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా అధ్యక్షులు, కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు మండల కార్యాలయాలలో ప్రతిరోజు సమాచారం కోసం 20 నుంచి 25 దరఖాస్తులు చేయడం జరుగుతుందని అన్నారు. బుధవారం నాడు మదనాపురం మండలం ఎంపీడీవో కార్యాలయంలో సమాచారం కోసం అధికారులకు దరఖాస్తును అందజేసినట్లు తెలిపారు. అక్టోబర్ 12 వరకు జరిగే వారోత్సవాలలో ప్రతి రోజు అన్ని శాఖల కార్యాలయాలలో దరఖాస్తుకు చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఐ ఆక్టివిటీస్ కమిటీ సభ్యులు జి.రవికుమార్, మహబూబ్‌నగర్ జిల్లా ఆర్టీఐ ఆక్టివిటీస్ కమిటీ సభ్యులు మంగరాయి వెంకటేశ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత సేవలపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లాలోని డియంఎచ్‌ఓ ఆఫీసులో వివిధ మండలాల కేంద్రాల్లో 108, 102 అమ్మబడి అంబులెన్స్‌లో పనిచేసే పైలెట్లకు, ఎమర్జెన్సీ , టెక్నీషియన్ల, జిల్లా ప్రజలకు అందుతున్న సేవలు గురించి, అత్యవసర సమయంలో ప్రజలు అంబులెన్స్‌కు కాల్ చేయంగానే తక్షణమే సంఘటన స్థలాలకు బయలుదేరాలని, అత్యవసర సమయంలో రోడ్డు ప్రమాద బాధితులకు, గర్భిణీ స్త్రీలకు, పాముకాటు బాధితులకు, మరి ఏ ఇతర వైద్య సహాయం కావాలన్నా వారికి ప్రథమ చికిత్స చేస్తూ దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. జిల్లా ప్రజలు ఉచిత 108 వాహనాలను వైద్య, అత్యవసర సహాయం అవసరం ఉన్న 102 , 108 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేసి ఉచిత వాహనాలు వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపర్వైజర్ రాఘవేంద్ర, 108 సిబ్బంది పాల్గొన్నారు.

## స్పాట్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జడ్చర్లలోని గిరిజన పురుషుల డిగ్రీ, పీజీ కళాశాలలో ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ , కెమిస్ట్రీ కోర్సులో స్పాట్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.పి.నిరీక్షణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో సైన్స్ బ్యాక్ గ్రౌండ్‌తో కనీసం 40 శాతం మార్కులు సాధించిన పురుష విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఎస్టీ33, ఎస్సీ1,ఓసి1, అనాథలు1, వికలాంగులు1, క్రీడలు1 అందుబాటులో ఉన్న సీట్లు కలవని వెల్లడించారు. దరఖాస్తు చేసుకొనేందుకు అక్టోబర్ 15 చివరి తేది అని ఆయన తెలిపారు. విద్యార్థులు నేరుగా కళాశాను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ సందర్శించాలని లేదా ఫోన్ 7901097703, 996615695 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని ఆయన ఈ ప్రకటనలో తెలిపారు.

# బాధ్యతారహితంగా వ్యవహరిస్తే చర్యలు

### ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి
### కలెక్టర్ సిక్తా పట్నాయక్




**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పష్టం చేశారు. ఈ సారి వరి కొనుగోళ్ల ప్రక్రియలో ఎవరైనా బాధ్యతారహితంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయ మీటింగ్ హాల్‌లో జిల్లా పౌర సరఫరా శాఖ సంస్థ ఆధ్వర్యంలో 2025–26 వానాకాలం ఖరీఫ్, వరి ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించింది. వ్యవసాయ శాఖ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఫ్యాక్స్ , పోలీసు, ఆర్డిఓ, మార్కెటింగ్, మెప్మా అధికారులు సమన్వయంతో ఎవరికి అప్పగించిన బాధ్యతలను వారు నిబంధనల మేరకు సక్రమంగా నిర్వహించాలని ఆమె సూచించారు. అయితే సమావేశాల్లో చర్చించేది వేరు క్షేత్రస్థాయిలో జరిగేది వేరు అని ఈ సారి మాత్రం గత సీజన్‌లో జరిగిన పొరపాట్లకు తావు ఇవ్వకుండా అధికారులంతా జాగ్రత్తగా ఉండి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో సజావుగా కొనసాగించాలన్నారు. గత సీజన్‌లో రూ.460 కోట్ల వరి ధాన్యాన్ని జిల్లా రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయడం జరిగిందని, ఈ సీజన్‌లో ఇంకా పెరిగే అవకాశం ఉందని ఆమె చెప్పారు. కొనుగోళ్లలో నిబంధనలు పాటించకపోతే శాఖపరమైన చర్యలు ఉంటాయని పునరుద్ఘాటించారు. జిల్లాలోని అన్ని కేంద్రాలపై డిఆర్డి, డిసిఓ పర్యవేక్షణ ఉండాలన్నారు. మండల మానిటరింగ్ కమిటీ రోజు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. జిల్లాలో ఈ సారి ఐకెపి, ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు, తదితర సంస్థల ద్వారా 110 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఏ ప్రాంతంలో వరి కోతకు వచ్చిందనే వివరాలు తెలుసుకుంటే సమస్య ఉండదని అదనపు కలెక్టర్ సూచించారు. మొత్తానికి రైతు కొనుగోలు కేంద్రానికి వచ్చి ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం విక్రయించి, రైతు ఖాతాలో డబ్బు జమ చేసే ప్రక్రియను సజావుగా కొనసాగించేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ఆదిత్య, ఆర్డీవో రామచందర్ నాయక్, డిఆర్‌డిఓ మొగులప్ప, డీఎస్పీ నల్లపు లింగయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

**ఎన్నికలలో రిటర్నింగ్ అధికారులు ముఖ్య భూమిక పోషించాలి**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు ముఖ్య భూమిక పోషించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో రిటర్నింగ్ అధికారుల సమావేశం నిర్వహించి వారి బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో 13 జడ్పిటిసి, 136 ఎంపిటిసి స్థానాలకు గాను రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, అలాగే జిల్లాలోని 272 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అయితే నామినేషన్ల ప్రక్రియ ను వీడియోగ్రఫీ తీయించాలని, నామినేషన్‌లో అభ్యర్థి సంతకాలు లేకపోతే, సరైన ధ్రువపత్రాలు జత చేయకపోతే రిటర్నింగ్ అధికారులు గుర్తించి సరి చేయాలని, వీలైనంత వరకు నామినేషన్ తిరస్కరణకు గురి కాకుండా చూడాలని ఆర్‌వోలకు కలెక్టర్ సూచించారు. నామినేషన్ల పరిశీలన, అప్పీలు, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, అభ్యర్థుల బీ ఫామ్ తదితర విషయాల గురించి స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ క్లుప్తంగా వివరించారు. ఎన్నికల నియమావళి లోని ప్రతి పేజీని ప్రతి అక్షరాన్ని చదువుకొని అనుమానాలను నివృత్తి చేసుకోవాలని ఆర్‌వోలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, అన్ని మండలాల ఆర్వోలు పాల్గొన్నారు.

# ఓటు హక్కు కాపాడుకుందాం



డిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకుందామని డీసీసీ అధ్యక్షుడు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఎక్కడెక్కడ ఓట్ చోరీ జరిగిందనే విషయాలను రాహుల్గాంధీ ఆధారాలతో సహ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినట్లు తెలిపారు. ఓటు చోరీని అరికట్టాల్సిన బాధ్యత చోరీపై ఏఐసీసీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సంతకాల సేకరణ కార్యక్రమంలో గ్రామస్థాయి నుంచి విజయవంతం చేయాలని కోరారు.

**దేశంలో వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బిజెపి**

దేశంలో వ్యవస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్వీర్యం చేస్తున్నదని డిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐసీసీ నేతృత్వంలో ఓట్ చోరీపై సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. పార్టీలకతీతంగా ప్రతి గ్రామంలో 100 మందిని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని కోరారు. పార్టీ ఇచ్చే కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరుకావాలని డీసీసీ అధ్యక్షులు అన్నారు. కార్యక్రమాలకు కొంతమంది దుమ్మా కొదుతున్నారని, భవిష్యత్తులో కాంగ్రెస్ తరపున సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లుగా నిలబడాలనుకునే వారు పార్టీ కార్యక్రమాలకు రాకుండా ఇంట్లో కూర్చొని భీఫామ్‌లు వస్తాయన్నది పగటికలలు అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, నాయకులు వినోదకుమార్, జహీర అ అక్తర్, ఎన్పి వెంకటేష్, సీజే బెనహర్, వసంత సిరాజ్ ఖాద్రీ, సాయిబాబా, పయాజ్, అజ్మత్ అలీ, అవేజ్, అబ్దుల్ హక్ తదితరులు పాల్గొన్నారు.



## బలహీనవర్గాల కోసం, మైనార్టీల కోసం పనిచేసేదే సిపిఐ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** స్థానికసంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను, సిపిఐ బలపర్చిన అభ్యర్థులను అభ్యుదయవాదులను లౌకికవాదులను గెలిపించాలని సిపిఐ జిల్లాకార్యవర్గసభ్యులు కొమ్ము భరత్ విజ్ఞప్తి చేశారు. బుధవారం తాడూరు మండలం నాగదేవపల్లి గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజలకోసం పనిచేసేటటువంటి బడుగు బలహీనవర్గాలకోసం, మైనార్టీల కోసం పనిచేసేటటువంటి పార్టీ ఏకైకపార్టీ సిపిఐ అని అలాంటిపార్టీ అభ్యర్థులను గెలిపించడం వలన ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. డబ్బులకు, మద్యానికి ఓటును అమ్ముకోకుండా నిజాయితీపరులకు ఓటువేసి గెలిపించాలని కోరారు. పేదల కోసం నిరంతరం పోరాటం చేసే ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. కావున రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో సిపిఐపార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామశాఖ కార్యదర్శి రాముడు, లక్ష్మణ్, వెంకటయ్య, కృష్ణయ్య, హన్మంతు, పరుషరాములు, అర్జునయ్య, అనిల్‌కుమార్, మైసన్న, శంకర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

# పోలీస్ వ్యవస్థను ప్రజానుకూలంగా తీర్చిదిద్దాలి

### మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జోన్-7 డిఐజి ఎల్.ఎస్.చౌహన్ వార్షిక తనిఖీ



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** జోన్ 7 జోగులాంబ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. తనిఖీ సందర్భంగా డిఐజీ జిల్లా పోలీసు కార్యాలయం పరిధిలోని విభాగాలు డిపిఓ, స్పెషల్ బ్రాంచ్, డిసిఆర్‌బి, ఎఆర్ హెడ్‌క్వార్టర్స్ తదితర విభాగాలను సందర్శించి, పనితీరు, రికార్డు నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ పారదర్శకత కార్యనిర్వహణ విధానాలను సమీక్షించారు. డీఐజీ పోలీసు రికార్డులు, రిజిస్టర్లు, ఆఫీస్ ఫైల్స్ బలగాల హాజరు రికార్డులు ఆయుధ నిల్వలు, వాహనాల సంరక్షణ విధానాన్ని పరిశీలించి సిబ్బంది నిబద్ధతపై సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీ అనంతరం డీఐజీ మాట్లాడుతూ జిల్లా పోలీసు వ్యవస్థను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దడం ప్రతి ఒక్కరి బాధ్యత, ప్రజలతో అనుసంధానం మెరుగుపరచి, సకాలంలో స్పందించడం విధులు నిర్వర్తించాలి. రికార్డులు సక్రమంగా, నవీకరించబడిన విధంగా ఉంచడం అత్యవసరం. అధికారి సిబ్బంది మధ్య సమన్వయం ఉంటే సేవా నాణ్యత మరింత మెరుగుపడుతుందని సూచించారు. డీఐజీ జిల్లాలో నేరాల నివారణ, చట్టవ్యవస్థ కాపాడటంలో కృషిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత క్రమశిక్షణతో ప్రజాసేవలో అగ్రగాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం, ఎఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డిసిఆర్‌బి డిఎస్పి రమణారెడ్డి, ఎఆర్ డిఎస్పి శ్రీనివాసులు, ఎఓ రుక్మిణి భాయి, ఆర్‌ఐలు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ అభియాన్



**ప్రజాపక్షం/దామరగిద్ద :** పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామం గడిముంకన్‌పల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు మరియు బాలింతలకు పౌష్టికాహారం యొక్క ఉపయోగాలు గురించి చెప్పి పండ్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, అనుమానిత వ్యక్తులను మరియు పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం నారాయణపేట బస్టాండు మరియు ప్రధాన చౌరస్తాలలో నారాయణపేట పోలీసులు గోపాల్, రవి కుమార్‌లు, ఆకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్‌తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. పౌరులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఎటిసిలో శిక్షణతో విద్యార్థుల భవిష్యత్తుకు బాట

### విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్స్‌తో పాటు అత్యాధునిక సాంకేతిక శిక్షణ అందించాలి
### కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** ఏటిసిలో శిక్షణ పొందుతున్న విద్యార్థిని, విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్ క్లాసులు ఆధునిక యంత్రాలతో సమగ్రంగా నిర్వహించాలని, విద్యార్థులకు తాజా సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. ప్రభుత్వ ఐటిఐ బాలుర మరియు బాలికల ఆవరణలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి బుధవారం సందర్శించారు. ఏటిసిలో ఆధునిక సాంకేతిక శిక్షణ కోర్సుల గురించి కలెక్టర్ కు ప్రిన్సిపాల్ వివరించారు. ప్రిన్సిపల్స్, బోధనా సిబ్బందికి కలెక్టర్ సూచనలు చేశారు. ఏటిసిలో అందిస్తున్న కోర్సులు దేశీయంగా మాత్రమే కాకుండా విదేశాలలో కల్పించే కోర్సులని, అందువల్ల విద్యార్థులకు ఆధునిక నైపుణ్యాలు అందించడం అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. తొలుత జిల్లా కేంద్రంలోని బస్టాండు సమీపంలోని బాదం రామస్వామి మరియు సరోజా దేవి మున్సిపాలిటీ గోల్డెన్ జూబ్లీ ఆడిటోరియం, మున్సిపాలిటీలో కళాభారతి, భవనాలను కలెక్టర్ పరిశీలించారు. బాదం రామస్వామి, సరోజాదేవి మున్సిపాలిటీ గోల్డెన్ జూబ్లీ ఆడిటోరియంను పరిశీలించి కావలసిన రిపేర్ల గురించి తెలుసుకుని సూచనలు చేశారు. కళాభారతి నిర్మాణంను పరిశీలించి నిర్మాణ ప్రగతి గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపాల్ బి.శాంతయ్య, బాలికల ఐటిఐ ప్రిన్సిపాల్ ఎస్.గోపాల్ నాయక్, ఐటిఐ/ఏటిసి సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

### తొలివిడతలో 115 ఎంపిటిసి, 10 జడ్‌పిటిసి స్థానాలకు ఎన్నికలు... కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణికుముదిని బుధవారం ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎస్పి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, డిప్యూటి సిఇఓ గోపాల్‌నాయక్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొదటివిడతలో జరిగే ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు , ఎన్నికల నిర్వహణ, మోడల్ ప్రవర్తనా నియమావళి అమలు, లాఅండ్ ఆర్డర్ నిర్వహణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మొదటివిడతలో జరిగే ఎన్నికల నిర్వహణ ఎంపిటిసి, జడ్పిటిసి తొలిదశలో ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికలయంత్రాంగం పటిష్టచర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికలసంఘం జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలతో ఎన్నికల నిర్వహణ, మోడల్‌ప్రవర్తనా నియమావళి అమలు, లాఅండ్‌ఆర్డర్ పరిస్థితుల పర్యవేక్షణవంటి అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. తొలి విడతలో జరిగే ఎన్నికల నామినేషన్ ప్రక్రియను సజావుగా సాగేందుకు పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్లకు ఎస్‌పిలకు పలు సూచనలు సలహాలు అందించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో తొలి విడతలో జరిగే 115 ఎంపిటిసి, 10 జడ్పిటిసి స్థానాలకు జరిగే ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులను అందించి ఎన్నికల ప్రక్రియ నిర్వహణ ఏర్పాట్లపై ప్రత్యేకశ్రద్ధ వహించేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఎంపిటిసి, జడ్పిటిసిలకు సంబంధించి మొదటి విడతలో 115 ఎంపిటిసి స్థానాలకు, పది జడ్పిటిసి స్థానాలకు జరిగే ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను పూర్తిచేయడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణలో బాధ్యతలు నిర్వహించే రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతులద్వారా స్పష్టమైన ఎన్నికలకు సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా అవగాహన కల్పించడం జరిగిందని, ప్రతి మండలకేంద్రంలో నిర్వహించే ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని, నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన ప్రక్రియను తాను అధికారులు సందర్శించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. నేడు ఎన్నికల అధికారులకు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు.

## టిఆర్‌టిఎఫ్ మాడ్గులపల్లి మండల శాఖ ఎన్నిక

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫడరేషన్ (టిఆర్‌టిఎఫ్)మాడ్గులపల్లి మండల శాఖ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా యన్.కరుణాకర్,కొమరాజు జగన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మనగోటి జనార్ధన్, తరాల పరమేశ్ యాదవ్ తెలిపారు. బుధవారం జిల్లా కార్యాలయంలో జరిగిన మండల శాఖ సమావేశంలో వారికి నియామకపత్రం అందజేసి వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఉమ్మడి రాష్ట్రంలో పోరాటాలు చేసి ఎన్నో జీవోలు సాధించిన ఘనత కలిగిన సంఘం అని, ప్రభుత్వ గుర్తింపు పొందిన , సివిల్ సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లో శాశ్వత సభ్యత్వం కలిగి సమాజ శ్రేయస్సు, విద్యాప్రగతి, ఉపాధ్యాయుల సంక్షేమం లక్ష్యాలుగా పనిచేస్తున్నదని అన్నారు. డిసెంబరు నెలలో హైదరాబాద్ లో జరుగనున్న 80 వసంతాల విద్యాసదస్సులో జిల్లా నుండి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. 80 వసంతాల విద్యాసదస్సు కరపత్రాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. జిల్లా గౌరవ సలహాదారులు తంతెనపల్లి సైదులు, జిల్లా గౌరవాధ్యక్షులు నంద్యాల మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు దొడ్డేని సాయిబాబు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

## స.హ చట్టంతో పారదర్శకత పెంపు

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సమాచార హక్కు చట్టం ద్వారా పాలనలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5 నుండి 12 వరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సంబంధిత పోలీసులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సమాచార హక్కు చట్టం కింద ప్రజలు కోరిన సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత పౌర సమాచార అధికారులు, పబ్లిక్ అథారిటిలపై ఉందన్నారు. తప్పుడు సమాచారం ఇవ్వవద్దని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా అధికార యంత్రాంగాలలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుందని తెలిపారు.



## కస్తూర్బా పాఠశాలలో సమస్యలు రావొద్దు

### కస్తూర్బా గాంధీ పాఠశాలను సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/హాలియా:** బాలికలు చదువుకునే కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ అన్నారు. బుధవారం హాలియాలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో పాఠశాలలో నెలకొన్న అన్ని సమస్యలను పాఠశాల ప్రత్యేక అధికారి హైమావతిని అడిగి తెలుసుకున్నారు. ప్రధాన సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన ఆమె వాటిని పరిష్కరించేలా తక్షణం చూస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. బాలికల పాఠశాలలో నెలకొన్న ఏ చిన్న సమస్య అయినా తమ దృష్టికి తీసుకురావాలని తద్వారా దానికి వెంటనే పరిష్కారం దొరుకుతుందని అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాల మొత్తం తిరిగి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ మాట్లాడుతూ బాలికలు లక్ష్యంతో చదువుకొని తల్లిదండ్రులు మీపై ఉంచిన నమ్మకాన్ని పొమ్ము చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన చెప్పారు. సబ్ కలెక్టర్ తాసిల్దార్ రఘు, మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి, ఎస్ ఓ హైమావతి తదితరులు ఉన్నారు.

## తల్లి గర్భంలోనే పసికందు మృతి

### వైద్యుల నిర్లక్ష్యమే అంటూ ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల నిర్లక్ష్యంతో నిండు గర్భిణి కడుపులోనే పసికందు కన్నుమూసిందని మృతురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్రంపోడు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి డెలివరీ కోసం వైద్యులు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించడం జరిగిందని తెలిపారు. వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందని గర్భిణీస్త్రీ కి పొద్దుగాల నుంచే నొప్పులు వస్తున్నా ఇంకా టైం ఉంది అంటూ వైద్యులు నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులను ప్రాధేయపడ్డా పట్టించుకోలేదని తల్లి కన్నీళ్లను అర్థం చేసుకోని ఆసుపత్రి డాక్టర్ల ఆలస్యం కారణంగా తల్లి గర్భంలోనే పసికందు మృతి చెందిందని తల్లి పరిస్థితి కూడా విషమంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇది వైద్యం కాదు, వైద్యుల హత్య అంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బంధువుల ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టడంతో సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు ఆసుపత్రికి చేరుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

## 2625 కేజీల నల్లబెల్లం, 200 కేజీల పటిక పట్టివేత

### నిషేధిత పదార్థాలు రవాణా చేస్తే కఠిన చర్యలు : ఎస్ఐ



**ప్రజాపక్షం/డిండి:** నిషేధిత నల్ల బెల్లం, పటిక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలుంటాయని డిండి ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. బుధవారం ఉదయం మండలంలోని చెరుకుపల్లి గ్రామ సమీపంలో డిండి పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో మహేంద్ర బొలేరో వాహనం టిజి 07 యూ 6853 డ్రైవర్ అనుమానస్పదంగా వాహనాన్ని నడుపుతుండగా వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ నిర్వహించగా వాహనంలో సుమారు 75బ స్తాలలో 2625 కేజీల నల్ల బెల్లం, 5 బస్తాలలో 200 కేజీల పటిక ను పోలీసులు గుర్తించి వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ప్రభుత్వం నిషేదించినటువంటి సారా తయారు చేయడం కోసం నల్ల బెల్లంను, పటికను అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలపడంతో అక్రమంగా నల్లబెల్లం, పటికను తరలిస్తున్న కేతావత్ రవి, రమావత్ రమేష్, గద్దె వెంకటేష్‌లపై కేసు నమోదు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

## కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన



**ప్రజా పక్షం/నల్లగొండ :** పత్తి కొనుగోలులో రైతులు ఇబ్బందులు పడకుండా కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.పత్తి కొనుగోలుకై కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొత్తగా ఏర్పాటు చేసిన కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించే నిమిత్తం బుధవారం నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల వ్యవసాయ,మార్కెటింగ్ శాఖ అధికారులకు ఉద్దేశించి ఉదయాదిత్య భవన్ లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గత సంవత్సరం రైతులు పత్తి ని అమ్మేందుకు ఆన్ లైన్ లో తప్పు బుకింగ్ చేసుకోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఈ సంవత్సరం అలాంటి సమస్యలు రాకుం డా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. రైతులందరూ ఒకేసారి జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకు రాకుండా నిర్ణీత షెడ్యూల్ ను రూపొందించాలని, ఇందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. అన్ని విషయాలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసినట్లయితే రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా పత్తి అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్,మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఛాయాదేవి,జిల్లాల వ్యవసాయ,మార్కెటింగ్ శాఖ అధికారులు ఉన్నారు.

# చివరిగింజ వరకూ ధాన్యం సేకరణ

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చివరి గింజ వరకు ధాన్యం సేకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలను ఆదేశించారు. ఖరీఫ్ (వానాకాలం) 2025/26 సీజన్‌కి సంబంధించి ధాన్యం కొనుగోలుపై బుధవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో ఐకెపి, పిఏసిఎస్, ఎఫ్‌పిఓ, మెప్మా శాఖలకు చెందిన కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ఐకెపి ద్వారా 158, పిఏసిఎస్ ద్వారా 122, ఎఫ్‌పిఓ ద్వారా 15, మెప్మా ద్వారా 13 మొత్తం 308 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని కొనుగోలు కేంద్రాలను వారం రోజుల్లో ప్రారంభించాలని ఇంకా ఎక్కడైనా అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు లోతట్టు ప్రాంతంలో ఉండకుండా ఎత్తైన ప్రదేశాలలో ఏర్పాటు చేసుకోవాలని ప్రతి కేంద్రంలో వెయింగ్ మిషన్, విద్యుత్, త్రాగునీరు, ఫ్లెక్సీపై నిర్వాహకుల పేరు, ఫోన్ నంబర్, టార్పాలిన్ పట్టాలు, పాడి క్లీనర్లు, డ్రైయర్లు, ట్యాబ్ లాంటి మౌళిక వసతులు కల్పించాలని తెలిపారు. ఐకెపి, పిఏసిఎస్, మార్కెటింగ్, మెప్మా శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేసి విజయవంతం చేయాలని, కలెక్టరేట్‌లో కంట్రోల్ మానిటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి రైతుల నుండి ఫిర్యాదు అందగానే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ రైతులకు, మిల్లర్ల ధర కంటే ఎక్కువ మద్ధతు ధర కల్పిస్తుందని గ్రేడ్ ఏ ధాన్యం రకానికి రూ.2,389, కామన్ రకానికి చెందిన ధాన్యానికి రూ.2,369, మద్ధతు ధర ఇస్తుందని అలాగే సన్న రకం వడ్లకు మద్ధతు ధరకు అదనంగా రూ.500 బోనస్ కల్పిస్తుంది కాబట్టి రైతులు నష్టపోకుండా అన్ని ఏర్పాట్లను కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటు చేయాలని ఆకస్మిక వర్షాలు కురుస్తున్నందున ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి అప్పారావు, డిఎస్ఓ మోహన్‌బాబు, డిఎం రాము, డిసిఓ పద్మ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ హనుమంతరెడ్డి, రవాణా అధికారి జయప్రకాష్ రెడ్డి, ఐకెపి, పిఏసిఎస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిజెఐపై దాడి అమానుషం

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై ధర్మాసనం ముందు న్యాయవాది రాకేష్ కిషోర్ బూట్ విసిరి దాడికి పాల్పడడం అత్యంత హేయమైన చర్య అని అమానుషం అని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన బుధవారం మోటకొండూరు ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గవాయ్ పై దాడి భారత న్యాయ వ్యవస్థను దెబ్బ తీయడం సరైన పద్ధతి కాదని ప్రజాస్వామ్యంను దెబ్బ తీయడమే అన్నారు. రాజ్యాంగ మౌలిక లక్ష్యాలకు విఘాతం కలిగించడం, న్యాయమూర్తులపైన దాడి చేయడం ఏచట్టంలో ఉందని, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకే రక్షణ లేకపోతే సామాన్య మానవులకు రక్షణ ఏలా ఉంటుందని ప్రశ్నించారు. న్యాయవాది రాకేష్ కిషోర్ న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాకేష్ కిషోర్ పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎన్నికల నిర్వహణకు సిద్ధం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మొదటి విడత జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ రాష్ట్ర ఎన్నికల కమీషనర్‌కు తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణి కుమిదిని హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, ఎన్నికల అధికారులతో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మొదటి విడత జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లాకు సంబంధించి మొదటి విడతన ఈనెల 9న 11 జడ్‌పిటిసిలు, 112 ఎంపిటిసిలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు సంబంధించి ఆర్ఓ, ఏఆర్ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, పునఃచ్చరణ శిక్షణ కూడా పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియకు తాము సిద్ధంగా ఉన్నామని, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాలను నియమించడం జరిగిందని, ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఎన్నికలకు సంబంధించిన రిపోర్టులను ఎప్పటికప్పుడు పంపించడం జరుగుతుందని చెప్పారు. అలాగే నామినేషన్ల స్వీకరణ సందర్భంగా పూర్తి సంసిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జడ్‌పి సిఇఓ అప్పారావు, డిపిఓ యాదగిరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ పాలన అధికారులు రెవెన్యూ వ్యవస్థను పటిష్ట పరచాలి

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** గ్రామ స్థాయిలో గ్రామ పాలన అధికారులు రెవిన్యూ వ్యవస్థను పటిష్టపరచాలని, నిజాయితీగా, నిబద్ధతతో పారదర్శకంగా పనిచేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో కొత్తగా నియామకం పొందిన గ్రామ పాలన అధికారుల శిక్షణ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీపై నమ్మకంతో పరిపాలన అధికారులుగా తిరిగి పోస్టింగ్ ఇవ్వడం జరిగిందని అన్నారు. గ్రామ పరిపాలన అధికారులు విధుల్లో చేరడం వలన రెవెన్యూ వ్యవస్థకు పునర్జీవం వచ్చిందని అన్నారు. రెవెన్యూ వ్యవస్థలో ఉన్న అన్ని సర్వీసులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజాయితీగా పారదర్శకంగా పనిచేయాలన్నారు. అన్ని సర్వీసులు ప్రజలకు అందించేవి రెవిన్యూ శాఖ మాత్రమే అన్నారు. ప్రస్తుతం రెవెన్యూ వ్యవస్థలో ఉన్న చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. భూభారతి చట్టం కొత్తగా వచ్చినందున క్షుణ్ణంగా చదివి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, అంచలంచెలుగా న్యాయం జరగాలన్నారు. మనిషి పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు సర్టిఫికెట్లను జారీ చేయవలసిన బాధ్యత మీపై ఉందన్నారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ గ్రామ పరిపాలన అధికారులు తమ విధులు బాధ్యతతో ఉండి పనిచేయాలన్నారు. గ్రామ రెవిన్యూ రికార్డులు, లెక్కలను సక్రమంగా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ భూములు, ఇతర ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలో అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ పాలన అధికారులు గ్రామాలలో కుల, ఆదాయ, నివాస, జన్మస్థల ధ్రువపత్రాలు జారీ చేసే విషయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారులు, కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, సురేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృత్తిక, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్ ప్రసాద్, గ్రామ పాలన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల15లోపు రిజిస్ట్రేషన్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వరల్డ్ స్కిల్ కాంపిటీషన్ లో పాల్గొనుటకు ఈనెల15 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రపంచ స్కిల్ కాంపిటీషన్‌లో పాల్గొని యువత తమ నైపుణ్యాని అంతర్జాతీయ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నైపుణ్యం కలిగిన నిరాక్షరాసులు కూడా ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, దీనికి 6 నుండి 24సంవత్సరాల వయస్సుల వారు అర్హులని ఈ పోటీలను రాష్ట్రంలో నవంబర్ 2025 లో జోనల్ స్థాయిలో, డిసెంబర్ 2025 లో రాష్ట్రస్థాయి, జనవరి2025 లో ప్రాంతీయ స్థాయి, ఫిబ్రవరి 2025 లో జాతీయ స్థాయి, పోటీలు నిర్వహిస్తారని ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోని అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి నంద పద్మ తెలిపారు.

# నాణ్యత గల ధాన్యాన్ని తీసుకురండి



ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ(తిప్పర్తి) :** ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులతో కోరారు.బుధవారం ఆమె తిప్పర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.అనంతరం రైతులనుద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో లాగే ఈ సంవత్సరం ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రైతులు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. తిప్పర్తి ధాన్యం కొనుగోలు కేంద్రానికి గత సంవత్సరం 75000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్న చరిత్ర ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు నాణ్యతతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తేవాలని, దాన్యంలో తేమ ఎక్కువగా లేకుండా , 17 మించకుండా తీసుకురావాలని, చెత్త,చెదారం, తాలు వంటి వాటితో తీసుకురావొద్దని, ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలని, ధాన్యం అమ్మిన రైతులకు 72 గంటల్లో చెల్లింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 2 డ్రయ్యర్లను ఏర్పాటు చేయగా, ఒకటి తిప్పర్తిలో మరొకటి మిర్యాలగూడలో ఏర్పాటు చేయడం జరిగిందని ,రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించి మద్దతు ధర పొందేలా చూడాలని అన్నారు. డ్రయ్యర్స్ పై రైతులకు అవగాహన కల్పించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆమె ఆదేశించారు.కర్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,జిల్లా సహకార అధికారి పత్యా నాయక్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను తెలియజేశారు.ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి ,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి ఉన్నారు.

## అడ్డంకులను అవకాశాలుగా మార్చుకోవాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** విద్యార్థులు తమ జీవితంలో ఎదురైన అడ్డంకులను, సవాళ్లను నూతన అవకాశాలుగా మార్చుకోవాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర రావు పేర్కొన్నారు. అలా చేసినప్పుడు తమ లక్ష్యాలను సాధించి, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరగలరని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బుధవారం ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులందరూ తమ పిల్లలను బాగా ప్రోత్సహించినట్లైతే వారు ఆరోగ్యంగా, మానసికంగా, సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతారని తెలియజేశారు. విద్యార్థులు కెరీర్లో రాణించడానికి ఆత్మ విశ్వాసం, నమ్మకం, క్రమ శిక్షణ, శ్రద్ధతో తమ చదువులను కొనసాగించాలని ఆయన సూచించారు. తమ యూనివర్సిటీలో ఎన్‌ఈపీ2020ను అనుసరిస్తామని చెప్పారు.ఆయా విభాగాల డీన్లు, డైరెక్టర్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రత, శాంతిభద్రతల రక్షణలో పని చేస్తున్నాం

### సూర్యాపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్‌పి కె నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పోలీసు స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ బుధవారం 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ముందుగా పోలీసు సిబ్బంది గౌరవ వందనంతో ఎస్‌పికి స్వాగతం తెలిపి పోలీస్ పరేడ్ నిర్వహించారు. పోలీసు స్టేషన్ ప్రాంగణంలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. సిబ్బంది కవాతును, యూనిఫామ్, క్రమశిక్షణ, పోలీసు పరికరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకొని విధుల నిర్వహణపై సూచనలు అందించారు. అనంతరం ప్రజలకు అందించే సేవలు, నేరాల నమోదు, పెండింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల తీరు, కేసుల దర్యాప్తు, ప్రకృతి వైపరిత్యాల సమయంలో పోలీసు పని, కేసుల పురోగతి, సిసి కెమెరాల ఏర్పాటు, మహిళల భద్రతకు తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతి భద్రతల రక్షణలో పటిష్టంగా పని చేస్తున్నాం, రౌడీషీటర్లపై నిఘా ఉంచి ప్రతిరోజు వారి కదలికలను తెలుసుకోవడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇతరులపై భౌతి కదాడులకు, దౌర్జన్యాలకు పాల్పడితే అలాంటి వారిపై రౌడీ షీట్స్ నమోదు చేసి పిడి యాక్ట్ పెట్టి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. విధుల పట్ల ప్రతి పోలీసు బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో పనిచేస్తున్నారని అన్నారు. పోలీస్ సిబ్బంది ప్రేరణ కలిగిస్తూ, నైతిక విలువలతో కూడిన సేవను ప్రజలకు అందించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించడానికి బ్లూకోట్, పెట్రోకార్, డయల్ 100 సిబ్బంది సామర్థ్యంతో పనిచేస్తున్నారన్నారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ షీ టీం బృందాలు జిల్లా కేంద్రంలో నిత్యం నిఘాలో ఉన్నాయని చెప్పారు. ఆకతాయి పనులకు పాల్పడుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయడం కౌన్సిలింగ్ చేయడం చేస్తున్నామన్నారు. రోడ్డు భద్రత చర్యల అదృష్ట నూతన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని, జిల్లా కేంద్రంలో వాహనాల రద్దీ ప్రజల అవసరాలకు అనుగుణంగా ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎక్కువగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయడానికి నేను సైతం కార్యక్రమం ద్వారా కమ్యూనిటి కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. డిఎస్‌పి ప్రసన్నకుమార్, సిఐ వెంకటయ్య, ఎస్ఐ శివతేజ, మహేందర్‌నాథ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ హరిబాబు, ఆర్ఎస్ఐ అశోక్, ఏఎస్ఐ అంజన్‌రెడ్డి, సిసి సందీప్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




# బాలిక హత్య కేసులో నిందితులు అరెస్ట్

### బలహీనంగా ఉన్న బాలికను శారీరకంగా కలవడంతో చనిపోయిందని డిఎస్‌పి వెల్లడి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని టుటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని షంషు నగర్‌లో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారంతో కూడిన నేర పూరిత హత్య పోక్సో చట్టం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేయడం జరిగిందని నల్లగొండ డిఎస్‌పి కె. శివరాం రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ1 నేరస్తుడు నల్లగొండ మండలం జికె అన్నారం గ్రామానికి చెందిన గడ్డం కృష్ణ, గత 3 నెలల క్రితం మైనర్ బాలిక గ్రామములో ట్రాక్టర్ డ్రైవరుగా పనిచేయుటకు వెళ్ళి ఆమెతో పరిచయము పెంచుకొని మాయమాటలు చెప్పి, ప్రేమ పేరుతో దగ్గరై, ఇన్స్టాగ్రామ్ ద్వార చాట్ చేసేవాడని తెలిపారు.ఈనెల 7న మైనర్ బాలిక తన గ్రామం నుండి కాలేజీకి ఊరి నుండి ఆటోలో వచ్చిన బాలికను నిందితుడు బైక్ పై వచ్చి, తన బైక్ పై ఎక్కించుకొని వెళ్ళితే ఎవరైనా చూస్తారని తన స్నేహితుడైన ఏ 2 నేరస్తుడు బచ్చలకూరి మధు సహకారముతో కిరాయి రూమ్ దగ్గరకు వెళ్లాడని తెలిపారు. ఏ 1బలహీనంగా ఉన్న మైనర్ బాలికను బలవంతముగా, శారీరకముగా కలవడంతో ఆ సమయములో బాలికకు తీవ్ర రక్త స్రావము అయి ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్ళి చనిపోయిందని తనకు తెలిసిన వ్యక్తి కి సమాచారం ఇవ్వగా, అతను పోలీసులకు తెలియ పరచడని తరువాత పోలీసు స్టేషన్‌లో తనకు తాను చేసిన నేరం ఒప్పుకొని లొంగిపోయినాడని తెలిపారు. తరువాత ఏ 2 ను కూడ అదుపులోకి తీసుకొని పూర్తి విచారణ చేసి వారి వాహనములు, సెల్ ఫోన్ లు స్వాధీన పర్చుకోని ఇట్టి కేసులో శవ పరీక్ష ను టీమ్ ఆఫ్ డాక్టర్ లచే చేయించి సాంకేతిక పరిజ్ఞానం, డాక్టర్ల ఒపీనియన్ మేరకు పై ఇద్దరు నేరస్తులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరచడం జరిగిందని తెలిపారు. టు టౌన్ సిఐ ఎస్. రాఘవ రావు,వన్ టౌన్ సిఐ ఏ. రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ ఎస్ఐ వై. సైదులు సిబ్బందిని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ అభినందించారు.

# క్రీడ



## పాకిస్థాన్‌కు హ్యాట్రిక్ ఓటమి

### 107 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో చిత్తు

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో పాకిస్థాన్ హ్యాట్రిక్ ఓటమిని చవిచూసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో పాక్‌ను ఆస్ట్రేలియా 107 పరుగుల తేడాతో చిత్తు చిత్తుగా ఓడించింది. బెత్ మూనీ (109; 114 బంతుల్లో 11 ఫోర్లు), అలానా కింగ్ (51*; 49 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించడంతో తొలుత ఆసీస్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో పాక్ 36.3 ఓవర్లలోనే 114 పరుగులకు కుప్పకూలింది. ఆ జట్టు ఏ దశలోనూ పెద్దగా పోరాడలేదు. సిద్రా అమీన్ (35) టాప్ స్కోరర్. రమీన్ షమీమ్ (15), ఫాతిమా సనా (11), నష్రా సంధు (11) పరుగులు చేశారు. సదాఫ్ షామాస్ (5), మునీబా అలీ (3), సిద్రా నవాజ్ (5), నటాలియా (1), ఈమాన్ ఫాతిమా (0) విఫలమయ్యారు. కిమ్ గార్త్ (3/14), మేగాన్ షట్ (2/25), అనాబెల్ సదర్లాండ్ (2/15) పాక్‌ను దెబ్బతీశారు. ఆష్లీన్ గార్డ్‌నర్, జార్జియా, అలానా ఒక్కో వికెట్ తీశారు.

### పోరాడిన బెత్ మూనీ, అలానా కింగ్

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్.. ఆరంభంలో వికెట్లు కోల్పోయి తక్కువ స్కోరుకే ఆలౌటయ్యేలా కనిపించింది. ఓపెనర్లు అలీస్సా హిలీ (20), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (10) పరుగులు చేయడంతో 30/0తో నిలిచిన ఆసీస్ చూస్తుండగానే టపాటపా వికెట్లను చేజార్చుకుంది. నాలుగు బంతుల వ్యవధిలో ఓపెనర్లు వెనుదిరిగారు. తర్వాత వచ్చిన ఎల్లీస్ పెర్రీ (5), అనాబెల్ సదర్లాండ్ (1), ఆష్లీన్ గార్డ్‌నర్ (1), తాహిలా మెక్‌గ్రాత్ (5), జార్జియా వేర్‌హామ్ (0) విఫలమయ్యారు. దీంతో ఆసీస్ 76 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కిమ్ గార్త్ (11) కొద్దిసేపు క్రీజులో నిలవడంతో వికెట్ల పతనం ఆగింది. చివరకు గార్త్ జట్టు స్కోరు 115 పరుగుల వద్ద ఎనిమిదో వికెట్‌గా వెనుదిరిగింది. దీంతో ఆసీస్ 150 రన్స్‌లోపే కుప్పకూలేలా కనిపించింది. క్రీజులో నిలదొక్కుకున్న అలానా బౌండరీలతో అలరించింది. మరో ఎండ్‌లో ఉన్న బెత్ మూనీ కూడా నిలకడగా ఆడి సెంచరీ చేయడంతో ఆసీస్ మంచి స్కోరు సాధించింది. డయానా వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో ఆఖరి బంతికి మూనీ ఔటైంది. పాక్ బౌలర్లలో నష్రా సంధు 3, రమీన్ షమీమ్ 2, సాదియా ఇక్బాల్ 2, ఫాతిమా సనా 2, డయానా బేగ్ ఒక వికెట్ పడగొట్టారు.



## భారత జాతీయ జట్టు అని పిలవొద్దని పిటిషన్..

### చీవాట్లు పెట్టిన ఢిల్లీ హైకోర్టు!

భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలోని క్రికెట్ జట్టును భారత జాతీయ క్రికెట్ జట్టుగా పిలువడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. విచారణ సందర్భంగా పిటిషనర్‌కు హైకోర్టు చీవాట్లు పెట్టింది. ఇలాంటి పిటిషన్లతో విలువైన కోర్టు సమయాన్ని వృథా చేయొద్దంటూ హెచ్చరించింది. అయితే, ప్రభుత్వ యాజమాన్యంలోని దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో వంటి సంస్థలు బిసిసిఐ ఆధ్వర్యంలోని భారత జట్టును 'టీమిండియా'గా పిలువడంపై న్యాయవాది రీపక్ కన్సల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషన్‌ను బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావులతో కూడిన ధర్మాసనంపై పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఆడుతున్న జట్టును భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం లేదని మీరు చెబుతున్నారా? అని ప్రశ్నించింది. బిసిసిఐని పక్కన పెడితే.. దూరదర్శన్, మరో సంస్థ అయినా టీమిండియా అని పిలిస్తే, చూపిస్తే అది భారత జట్టు కాకుండా పోతుందా? అంటూ ప్రశ్నించింది. క్రీడల్లో ప్రభుత్వ జోక్యం ఉంటే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో తెలుసా? అంటూ ధర్మాసనం గుర్తుచేసింది. పిల్‌ను విచారించడం కోర్టు సమయాన్ని వృథా చేయడమేనని అభిప్రాయపడ్డ కోర్టు.. మంచి అంశాలపై పిల్ దాఖలు చేయాలని సూచించింది.

బిసిసిఐ అనేది తమిళనాడు సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదైన ఒక ప్రైవేట్ సంస్థ అని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 12 ప్రకారం అది ప్రభుత్వం పరిధిలోకి రాదని న్యాయవాది రీపక్ కన్సల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ సైతం బిసిసిఐని జాతీయ క్రీడా సమాఖ్యగా గుర్తించలేదని.. ఈ విషయం ఆర్టీఐ ద్వారా వెలుగులోకి వచ్చిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వ యాజమాన్యంలోని ప్రచార సంస్థలు టీమిండియా, భారత జాతీయ జట్టు అని పిలువడం, జాతీయ జెండాను ఉపయోగించడం చట్టవిరుద్ధమన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడంతో పాటు ప్రైవేట్ సంస్థకు అనవసరమైన ప్రయోజనం చేకూరుస్తుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. చిహ్నాలు, పేర్ల (అక్రమ వినియోగ నిరోధక) చట్టం–1950, ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా–2002ను ఉల్లంఘించడమే అవుతుందని వాదించారు.



# ఫోకస్

# కళా రంగం



జాత్యహంకారంతో నాజీలు జరిపిన విధ్వంసకాండ ఎంతో మంది జీవితాలను బలిగొంది. వారిలో తొమ్మిదేళ్ల ఇజాక్ స్టెయిన్ కూడా ఉన్నాడు. పోలాండ్‌లోని ఐశ్వర్యమైన యూదు వారసత్వంతో ప్రసిద్ధి చెందిన రాడోమ్ నగరంలో జన్మించిన ఇజాక్, చిన్న వయసు నుంచే తన మృదువైన స్వభావంతో అందరినీ ఆకట్టుకున్నాడు. జంతుప్రేమ ఎక్కువ. వాటి పట్ల కరుణతో వ్యవహరించేవాడు. పాఠశాలకు వెళ్లడం.. చదువుకోవడం.. జీవితంలో ఉన్నతంగా ఎదగడం వంటి ఎన్నో కలలు. మూగ జీవ కారుణ్యాన్ని ప్రచారం చేయాలని, మూగజీవుల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అనుకునేవాడు. తాను ఎక్కడికి వెళ్లినా, దారిలో కనిపించిన జంతువులకు ఆహారం పెట్టేవాడు. పక్షులతో ముచ్చటించేవాడు. క్రిమికీటకాలకు కూడా ఆహారాన్ని అందించేవాడు. కానీ, అతని ఆశలు, ఆశయాలు అన్నీ జాత్యహంకారం కీలల్లో మసైపోయాయి. అతని సుందర ప్రపంచం 1942లో దారుణంగా ధ్వంసమైంది. కేవలం 9 ఏళ్ల వయసులోనే అతను ట్రెబ్లింకా నిర్మూలన శిబిరానికి అతనిని బలవంతంగా తరలించారు. అక్కడ హోలోకాస్ట్ (మూకుమ్మడి హత్యలు) సమయంలో ప్రాణాలు కోల్పోయాడు. ఇజాక్ ఎదగడానికి, పాఠశాల పూర్తి చేసుకోవడానికి, కలల వెంట పరిగెత్తడానికి, లేదా అతను ఎంతో ప్రేమించిన జీవులను చూసుకోవడానికి ఒక్క అవకాశం లభించలేదు. ఇజాక్ పేరు లక్షలలో ఒకటి మాత్రమేకావచ్చు... కానీ, అతని స్మృతి.. మూగజీవాల పట్ల అతను ప్రదర్శించిన కరుణ ఇప్పటికీ ప్రాధాన్యమే. మనుషుల క్రూరత్వానికి, ఇప్పటికే ఎన్నో రకాల జంతుజాలం నశించిపోగా, వేలాది జాతులు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇజాగ్ గుర్తుకురావడంలో ఆశ్చర్యం లేదు. అతనిని గుర్తించుకునే ఓపిక, తీరిక చరిత్రకు లేకపోవచ్చు. కానీ, మానవత్వం ఉన్న ఎవరికైనా అతని గురించి తెలుసుకోవడం, అతనిని గుర్తుచేసుకోవడం అత్యవసరం.



## సవాళ్లు విసురుతున్న ఆవిష్కరణ!

రష్యాకు చెందిన పురావస్తు శాస్త్రవేత్తలు 1890లో చేసిన ఒక ఆవిష్కరణ ఇప్పటికీ చరిత్ర పరిశోధకులకు సవాళ్లు విసురుతునే ఉంది. ఇది ప్రాచీన కళలపై మన అర్థాన్నే మార్చివేసింది. సాంద్ర అరణ్యాలలో శాస్త్రవేత్తలు ఒక పొడవైన మానవాకార కలప ప్రతిమను గుర్తించారు. అయితే, ఇది సాధారణమైన ప్రతిమ కాదు. దాదాపు 11,500 సంవత్సరాల చరిత్ర కలిగినది. అంటే ఈ విగ్రహం ఈజిప్టు పిరమిడ్లకంటే రెండింతలు పాతది. ఇది చివరి హిమయుగాంతంలో మన ప్రాథమిక మానవులు ఎలా ప్రతీకాత్మక ఆలోచనలు చేసేవారో, కళా వ్యక్తీకరణ ద్వారా సమాజాన్ని ఎలా వ్యక్తపరచేవారో చూపించే అరుదైన నిదర్శనం. ఈ విగ్రహం ఆరు అడుగులకు మించి ఎత్తులో ఉంటుంది, ఒకే చెట్టు మాను నుంచి దానిని చెక్కారు. ముఖ లక్షణాలు, శరీరాకృతులు కొంత విచిత్రంగా కనిపించినా, ఆ బొమ్మ చెక్కిన తీరు చూస్తే, దీనికి ఆ కాలంలోని సమాజానికి మతపరమైన లేదా ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉండి ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. కొందరు దీనిని వంశ మూల పురుషులదై ఉండవచ్చని అంటుంటే, మరికొందరు ఫలప్రదత, వేటా సాధనల ప్రార్థనలు లేదా గోత్ర సమైక్యతతో సంబంధమున్న యజ్ఞాలలో ఉపయోగించేవారని అభిప్రాయపడుతున్నారు. ఇది తయారైన కాలంలో ఇంకా వ్యవసాయం మొదలు కాలేదు. ఆ కాలంలో మనుషులు వేటాడి, అడవి పండ్లపైనే ఆధారపడే 'హంటర్–గాథరర్' జీవన విధానాన్నే కొనసాగించారు. శాశ్వత నివాసాలు, పట్టణ నిర్మాణాలు, మహత్తరమైన కట్టడాలు ఏవీ కూడా ఆరంభం కాలేదు. అయినప్పటికీ, అప్పటికే వారు ప్రతీకాత్మక ఆలోచనా శక్తి, కళాప్రతిభతో ఒక విగ్రహాన్ని సృష్టించగల సామర్థ్యం కలిగి ఉన్నారని ఈ చెక్క బొమ్మ చెప్తుంది. అంతేకాదు, ఈ కలప విగ్రహం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండడం ఓ అద్భుతం. దీని ద్వారా ప్రాచీన మనుషుల కళా నైపుణ్యం, వృక్ష పదార్థాల వినియోగం, ఆ సమాజపు సంస్కృతి గురించి కొత్త విషయాలను అధ్యయనం చేయవచ్చు. ఈ చెక్క బొమ్మ కనిపించిన ప్రాంతంలోనే, గుహా చిత్రాలు, చిన్నచిన్న మట్టి పట్టికలు, రాయి చెక్కులు వంటి హిమయుగ కళలకు ప్రతీకలుగా నిలుస్తాయి. దీనిని బట్టి కళాత్మకత, ప్రతీకావాదం వంటి అంశాలు మానవ జీవనంలో ఊహించిన దానికన్నా ముందుగానే ప్రధాన భాగమని స్పష్టమవుతోంది. అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వేల సంవత్సరాల పాతదైన ఈ కలప విగ్రహంపై సూక్ష్మ విశ్లేషణలో పిగ్మెంట్‌ల ఆనవాళ్లు కనుగొన్నారు. అంటే ఈ విగ్రహం ఒకప్పుడు రంగులతో అలంకరించబడి ఉండే అవకాశం ఉంది. దీని వలన ఇది కేవలం ఒక శిల్ప సంప్రదాయ సాక్ష్యం కాకుండా, ఆధ్యాత్మిక రహస్యాలు, సాంస్కృతిక వ్యక్తీకరణకు సంబంధించిన మరింత లోతైన అర్థాలను ప్రతిబింబిస్తున్నదని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఏదిఏమైనా ఈ చెక్క బొమ్మ ఇప్పటి వరకూ హిమ యుగాంతపు పరిస్థితులపై ఉన్న అభిప్రాయాలను మార్చివేస్తున్నది.




పరిశీలించాలేగానీ చారిత్రక ఆనవాళ్లు ఎన్నో కనిపిస్తాయి. అలాంటిదే ఎలిసెగ్ స్తంభం. ఇది క్రీస్తుశకం 9వ శతాబ్దానికి చెందిందని శాస్త్రవేత్తలు తేల్చారు. వేల్స్‌లోని లాంగోలెన్ సమీపంలో ఉన్న ఈ రాతి స్తంభాన్ని పొవిస్ రాజ్యం చివరి రాజైన కింగెన్ అప్ కడెల్ (మ. 855) తన ముత్తాత ఎలిసెగ్ లేదా ఎలిసెద్ద్ గౌరవార్థం నిర్మించాడు. మొదట ఇది పొడవైన రాతి సిలువగా ఉండేది కాని ఇప్పుడు కేవలం రాతి స్తంభం మాత్రమే మిగిలింది. ఈ స్తంభంపై లాటిన్‌లో పొడవైన శాసనం చెక్కబడి ఉండేది. ఆ శాసనం చెదిరిపోయే లోపు 1696లో చరిత్రకారుడు ఎడ్వర్డ్ ల్యూడ దానిని నమోదు చేశాడు. ఈ శాసనం కింగెన్ యొక్క వంశవృక్షాన్ని ఎలిసెగ్ వరకు అనుసరిస్తూ, పొవిస్ రాజవంశం పాలనకు న్యాయబద్ధతను చూపించే శక్తివంతమైన రాజకీయ ప్రచారంలా పనిచేసింది. ప్రత్యేకంగా ఎలిసెగ్ చేసిన విజయాలను, ముఖ్యంగా ఆయన ఆంగ్లో సాక్సన్ ఆక్రమణదారుల నుండి ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడాన్ని ఎన్నో విశేషణాలను చేర్చి, పొగడ్తలతో వివరించింది. ఎలిసెగ్ స్తంభం వేల్స్ ప్రారంభ మధ్యయుగ చరిత్రను అర్థం చేసుకోవడానికి అత్యంత ముఖ్యమైన సాక్ష్యం. ఇది రాజుల వంశవృక్షం, వారి రాజకీయ ధోరణులు, ప్రాంతీయ స్వాతంత్ర్య పోరాటాల గురించి విలువైన సమాచారాన్ని అందిస్తుంది.

## సిపిఐ శత జయంతి ఉత్సవాల ముగింపు ఘనంగా నిర్వహించాలి

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/వైరా :** డిసెంబర్26న జరుగబోయే భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ముగింపు ఉత్సవాలను ఖమ్మంలో ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ ఉత్సవాల్లో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలతో పాటు సామాజిక వర్గాలు, పేద ప్రజలు మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం వైరా సిపిఐ కార్యాలయంలో యామాల గోపాలరావు అధ్యక్షతన జరిగిన వైరా నియోజకవర్గస్థాయిలో జిల్లా కార్యవర్గ సభ్యులు కౌన్సిల్ సభ్యులు మండల కార్యదర్శులు సమావేశంలో ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి బండి సురేష్ పాల్గొన్యానరు. ఈస ందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ భారతదేశంలో 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ కమ్యూనిస్టు మాత్రమే అని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటిసారిగా పిలుపునిచ్చి అనేక త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ అని, ఆ తర్వాత దేశంలో భూసంస్కరణలు బ్యాంకుల జాతీయరణ దున్నే వాడికి భూమి దక్కాలని అనేక భూ పోరాటాలు నిర్వహించిన ఘనత ఉందని అన్నారు. దేశవ్యాప్తంగా శత జయంతి ఉత్సవాలు ముగింపు సభ ఖమ్మంలో జరగడం మనందరికి గర్వకారణం అని అన్నారు. ఇదే సందర్భంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను అన్ని స్థానాల్లో గెలిపించుకోవడానికి గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా ఎన్నికల్లో పాల్గొని విజయాలు సాధించాలని కోరారు.

**దండి సురేష్‌కు సన్మానం :** సిపిఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా వైరా సిపిఐ కార్యాలయానికి వచ్చిన జిల్లా కార్యదర్శి దండి సురేష్‌ను సిపిఐ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగర్లమూడి రంజిత్, కొణిజర్ల, జూలురుపాడు మండలాల కార్యదర్శిలు గుండెపిన్ని వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్యణ రమేష్, షేక్ నాగుల్‌మీరా, సింగరేణి మండలం సీనియర్ నాయకులు బానోతు దళ్‌సింగ్, ఎల్లంకి మధు, మిట్టపల్లి రాఘవరావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బిల్లులు చెల్లిస్తారా, నిలిపివేయమంటారా!

**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండలంలోని మధ్యాహ్న భోజన పథక కార్మికులు సమావేశంలో దసరాకు చెల్లిస్తామన్న మధ్యాహ్న కార్మికుల బిల్లును ఇప్పటివరకు చెల్లించకుండా దసరా పండగకు పస్తులుండేటట్లు చేసిందని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి చక్రపాణి అన్నారు. గ్రీన్ ఛానల్‌పై ప్రభుత్వం ప్రకటించిన జాడ లేదు ఈనెల 10 వరకు డబ్బులు రాకుంటే 13 నుంచి పూర్తిస్థాయిలో మధ్యాహ్న భోజన పథకం నిలిపివేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నామన్నారు. 10 వరకు పెండింగ్ బిల్లును చెల్లిస్తామని చెప్పి ఇంతవరకు అమలు కాలేదని ప్రభుత్వం ఇప్పటికైనా కానీ గ్రీన్ ఛానల్ ద్వారా తప్పనిసరి ఈనెల 10 వరకు పోయిన సంవత్సరం నుంచి ఇప్పటివరకు కోడిగుడ్డు బిల్లు 2000 వేలు, 9, 10వ తరగతుల మధ్యాహ్న భోజన పథకం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాకు సుమారు ఇప్పటివరకు 10 కోట్ల బకాయి ఉన్నదని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 13న జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేస్తామని నల్లబ్యాడ్జీలు పెట్టుకుని నిరసన తెలిపాలని ప్రభుత్వానికి అధికారులకు తెలియజేస్తున్నామన్నారు. సమావేశంలో సాయమ్మ, లక్ష్మి , ప్రమీల, విజయ, కార్మికులు పాల్గొన్నారు.




## కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజలకు రక్షణ

### స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐని గెలిపించండి : సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/వరంగల్ :** కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే సమాజంలో ప్రజలకు రక్షణ ఉంటుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం శివనగర్ తమ్మెర భవన్‌లో సిపిఐ జిల్లా సమితి పనాస ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రానున్న రోజులలో కమ్యూనిస్టులకే భవిష్యత్తు ఉంటుందని, ప్రజలు చట్టసభల్లో కమ్యూనిస్టులు బలంగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సిపిఐ ఉద్యమిస్తుందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ స్థానాలలో పార్టీ అభ్యర్థులను పోటీ చేయించి వారి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. త్యాగాలకు, పోరాటాలకు నిలయం కమ్యూనిస్టులు అని, అందుకే వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేటికి ప్రజల గుండెల్లో నిలిచి ఉందన్నారు. ఎన్నికలు ధన ప్రవాహంగా మారిపోయినా, మతోన్మాద శక్తులు ప్రజలను విభజిస్తున్న వాటికి ఎదురొడ్డి సిపిఐ నిలబడిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలను ఓడించి లౌకిక, ప్రజాతంత్ర శక్తుల గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, నాయకులు దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, గుండె బద్రి, సంఘీ ఏలేందర్, అక్కపెల్లి రమేష్, గుంపల్లి మునీశ్వరుడు, చింతకింది కుమారస్వామి, వీరగోని శంకరయ్య, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్, ఎండి అక్బర్ పాషా, యాకాంబ్ర చారి, గోవర్ధన్ చారి, అయిత యాకయ్య, తాళ్లపల్లి రహేలా, చిట్యాల సువర్ణ, చిలువేరు విజయ, తదితరులు పాల్గొన్నారు.




## సిపిఐ, కాంగ్రెస్ మైత్రి కొనసాగింపు

**ప్రజాపక్షం/ తాండూర్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ, కాంగ్రె స్ మధ్య మిత్ర ధర్మం కొనసాగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ స్పష్టం చేశారు. బుధవారం తాండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ బృందం కాంగ్రెస్ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో సమావేశమై స్థానిక ఎన్నికల్లో పొత్తు అంశంపై చర్చించిందని, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించి, ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సా లి గామ సంతోష్, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీ నారాయణ, తాండూర్ మండల సహాయ కార్యదర్శులు నరాల ప్రహ్లాద్, మలిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి పట్టి శంకర్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## బెస్ట్ అవైలబుల్స్ స్కూల్స్ బిల్లులు చెల్లించకపోతే ఆందోళన తప్పదు

- ఫీజులు విడుదల చేయకపోతే చదువులు కొనసాగేదెలా
- పేద విద్యార్థులపై వివక్ష చూపిన ప్రభుత్వాలు మునగడ సాధించలేవు
- ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులకు బిల్లులు చెల్లించకుండా విద్యార్థులను విద్యకు దూరం చేస్తూ వారిపట్ల వివక్షత చూపుతుందని ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి పేద విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నది. కానీ గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సిన రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా మూసివేతకు సిద్ధపడుతున్నాయని అన్నారు. సుమారుగా రాష్ట్రవ్యాప్తంగా 200, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఉన్నాయని ఆ స్కూల్స్‌లో సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 23,000 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులు మూడవ తరగతి నుండి పదవ తరగతి వరకు 7000 మంది విద్యార్థుల విద్యను అభ్యసిస్తుంటే కనీసం రాష్ట్ర ప్రభుత్వం 2023–24,25–26, విద్యా సంవత్సరం గాను సుమారుగా 180 కోట్లు బకాయిలు పెండింగ్ ఉండడంతో ప్రభుత్వం రియింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో బెస్ట్ అ వైలబుల్ స్కూల్స్ యాజమాన్యాలు ప్రభుత్వం ఫీజులు చెల్లించే వరకు విద్యార్థులను పాఠశాలలకు రావద్దని హుకుం జారీ చేశాయని దీనితో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు.ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలకు నిధులు ఉంటాయి గాని ఎస్‌సి, ఎస్‌టి పేద విద్యార్థులు చదువుకునే బెస్ట్ అవైలబుల్స్ స్కూల్‌కి నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర ఖజానా లేదని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా పేద విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ ద్వారా ప్రతి ఏటా 3,500 మంది పేద విద్యార్థులకు విద్యను అందిస్తున్నారన్నారు ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా కృషి చేస్తున్న ఆశించిన ఫలితాలు రావట్లేదన్నారు తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రియింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయకపోతే ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు చేయాలి

### ఎఐటియుసి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపు

**ప్రజాపక్షం/ములుగు :** కేంద్ర, రాష్ట్ర కార్మిక వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. ములుగు మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో గుంజ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఏఐటియూసి ములుగు మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న రవీందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ప్రయివేట్ పరం చేశారని, వెంటనే రద్దు చేసి ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. పాఠశాల మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ఎన్నికల హామీ ప్రకారం రూ.10వేల వేతనాలు పెంచాలని, అలాగే జిల్లా వైద్యశాలల్లో శానిటేషన్ సెక్యూరిటీ పేషెంట్ కేర్ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, పాఠశాల స్కావెంజర్లను వేతనాలు నేరుగా వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్కీం వర్కర్స్ అందరిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు అందరూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఇంజం కొమురయ్య, బోడ రమేష్, బుడిమె సదయ్య, పెదకాసు వినోద్, పొర రాధ, మాలగాని కమలక్క, లావుడ్య రఘు, రేగూరి రాజేందర్, సమ్మయ్య, బి నరేష్, రాజు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## మహిళలకు తులం బంగారం ఇవ్వాలి



**ప్రజాపక్షం/కాప్రా :** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వివాహం చేసుకొన్న మహిళలకు తులం బంగారం ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. మల్లాపూర్‌లోని వివిఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 30 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ తహసీల్దార్ వాణి రెడ్డి, కార్పొరేటర్లు ప్రభుదాస్, శాంతి సాయిజెన్, గీత ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## పేద ప్రజల పెన్నిధి కొలను శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** పేద ప్రజల పెన్నిధి కాంగ్రెస్ పార్టీ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు కొలను తరుణ్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. స్థానికంగా గల రాజేశ్వరి వృద్ధుల అనాధ ఆశ్రమంలో శ్రీనివాస్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కొలను తరుణ్ రెడ్డి, మన్నె మహేశ్‌లు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుండే నాయకుడు కొలను శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కేఎస్ఐర్ చూపిన బాటలోనే నడుస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. కొలను శ్రీనివాస్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గౌస్, సురేశ్ నాయక్, ప్రసాద్ గౌడ్, బాలకృష్ణ, వరలక్ష్మి పాల్గొన్నారు.



## అడ్వకేట్ కిషోర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

**ప్రజాపక్షం/దుండిగల్ :** సిజెఐ జస్టిస్ గవాయ్ పై చెప్పు విసిరిన సుప్రీం కోర్టు సీనియర్ అడ్వకేట్ రాకేష్ కిషోర్ డిస్మిస్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం వెంటనే అరెస్ట్ చేయాలని ఆర్‌పిఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సూరారం చౌరస్తాలో ఆర్‌పిఐ పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు గట్టు అశోక్ ఆధ్వర్యంలో వివిధ దళిత సంఘాలతో కలిసి నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుడు చీఫ్ జస్టిస్ అఫ్ ఇండియాగా ఆ సీట్లో కూర్చోవడం ఇష్టం లేని మనువాదులు ఆయన వ్యతిరేక తీర్పులకు భయపడి ఆయనపై చెప్పు విసిరారణి ఉన్నత న్యాయస్థానల్లో రిజర్వేషన్స్ ఉండి ఉంటే మనువాద దుష్ట న్యాయమూర్తులు న్యాయవా దులు వచ్చే వారు కాదని ప్రజాస్వామ్యంలో ఉన్నత న్యాయస్థానాలు విలువైనవని ప్రధాన న్యాయమూర్తి పదవి అత్యంత ఉన్నతమైనదని, దళితుడు కాభట్టే చెప్పు విసిరాడనీ అతన్ని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పరసా శ్రీనివాస్, చింటోరి అశోక్, మాస్టర్జి ఏసురత్నం, బాలస్వామి, జనార్ధన్, రామకృష్ణ, మేరాజ్, ఇబ్రహీం, గణేష్, శిల్ప కార్ లకన్, సత్యనారాయణ, రామచంద్, బిజె రత్నం, యాదయ్య, సంతోష్, మున్నా భాయ్, ఎస్తేరు రాణి, యాదమ్మ, లక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



## పార్కుల అభివృద్ధితో ఆహ్లాదకర వాతావరణం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** పార్కుల అభివృద్ధితోనే ఆహ్లాదకరమైన వాతావరణానికి అంకురార్పణ సాధ్యమని బిఆర్ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్ కాలనీలో పన్నెండు లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కుని ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రారంభించారు. అనంతరం పార్కులో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ఎస్ఎన్‌డీపీ పనులతో ముంపు తీవ్రతను తొలగించి ఆహ్లాదకర పార్కును ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. గోదావరి హోమ్స్ కాలనీ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని చెప్పారు. గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి మౌలిక వసతులను కల్పించామని తెలిపారు. రానున్న రోజుల్లో గోదావరి హోమ్స్ కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి, డిప్యూటీ కమిషనర్ నర్సింహులు, డీఇ పాపమ్మ, టీపీఓ మధు, వాటర్ వర్క్స్ మేనేజర్ శివప్రసాద్, కాలనీ అసోసియేషన్ నాయకులు తిరుమల రావు, మాధవరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## అసమర్థ పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజాపక్ష/మేడ్చల్ మల్కాజిగిరి :** ఎన్నికల సమయంలో అధికారం చేపట్టటమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు మల్లాపూర్ ప్రాంతంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతిసాయిజెన్ శేఖర్, బన్నాల గీత, ప్రభుదాస్‌లతో బాకీ కార్డు ఉద్యమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల్లో తామిచ్చే హామీలన్నిటిని అమలు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి నేతృత్వం ఏడాదిన్నర దాటినా ఏ ఒక్క దాన్ని సైతం నెరవేర్చలేని అసమర్థ పాలన కొనసాగిస్తోందన్నారు.

# ఆక్రమణకు గురైన నాలాలను పునరుద్ధరించాలి

### హైడ్రా కమిషనర్ రంగనాథ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** చెరువులు, కుంటలు ఆక్రమణకు గురికాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. బుధవారం తూంకుంట మున్సిపాలిటి దేవరయాంజాల్‌లో ఆయన పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దేవరయాంజాల్‌లో నీట మునిగిన మహాలక్ష్మి వెంచర్‌తో పాటు కబ్జాకు గురైన నాలాను సందర్శించారు. తూంకుంట మున్సిపాలిటి పరిదిలోని సుచిరిండియా వెంచర్ ప్రధాన గేటు వద్ద కబ్జాకు గురైన నాలాను సందర్శించారు. అనంతరం ఆయన నాలాల కబ్జాల విషయమై పూర్తి స్థాయి నివేదికను అందజేయాలని ఇర్రిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. దేవరయాంజాల్, మందాయిపల్లి, తూంకుంటలోని చెరువులను పరిశీలించి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తూంకుంట కమిషనర్ జ్యోతి, డిఇఇ సునిత తహాశీల్దార్ యాదగిరిరెడ్డి, ఇర్రిగేషన్ ఎఇ ప్రశాంత్, హైడ్రా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంతో అవినీతి తగ్గుముఖం

### కలెక్టర్ మనుచౌదరి





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రభుత్వం కల్పించిన సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ తెల్సుకొని తద్వారా ప్రయోజనం పొందాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టం 2005 వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సుకు జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికా గుప్తాలతో కల్సి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు పరుస్తూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవగాహనా సదస్సులను గ్రామ, మండల, డివిజన్, జిల్లా వారీగా విస్తృతంగా నిర్వహించాలన్నారు. సమాచార హక్కు చట్టాన్ని ఎలాంటి సందర్భాల్లో ఏ విధంగా ఉపయోగించాలన్న విషయాలను సైతం తెలియ చేయాలన్నారు.

సమాచార హక్కు ద్వారా ధరఖాస్తు చేసుకొన్న వారికి తిరస్కరణ కారణాలు సైతం తెలియ చేయటం జరుగుతుందన్నారు. సమాచార హక్కు ధరఖాస్తులను పరిశీలించే అధికార్లయిన ఏపిఐఓ,పిఐఓ, ధరఖాస్తు దారునితో సానుకూల దృక్పథంతో వ్యవహరించి నిర్ణీత సమయానికి జవాబులిచ్చే విధంగా చూడాలన్నారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తగ్గుతుందన్నారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి వెంకటరెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. డిఆర్ఓ హరిప్రియ, ఏఓ రాంమోహన్, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి: అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**





**వికారాబాద్:**వికారాబాద్ జిల్లావ్యాప్తంగా సమాచార హక్కు చట్టం 2005పై ప్రతి ఒక్కరు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సమాచార హక్కు చట్టం వారోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి అధికారులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించిన జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అక్టబర్ 5నుండి 12 వరకు గ్రామ ,మండల జిల్లా స్థాయి లో నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాలో భాగంగా బుదవారం జిల్లా స్థాయిలో అన్ని శాఖల అదికారులకు జిల్లా అదనపు కలెక్టర్ అధ్యక్షతన ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ కార్యాకలాపాలలోఏ పారదర్శకతను తీసుకురావడం ,ప్రభుత్వ అధికారులు తమ చర్యలకు జవాబుదారీగా ఉండేలా చేసిన ఈ చట్టం పట్ల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే దరఖాసు దారుడు కోరిన సమాచారాన్ని సరైన విధంగా నర్ణీత గడువులో ఇవ్వగలుగుతరన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ మంగీలాల్ , ఆర్‌డిఓ వాసు చంద్ర , ట్రైనింగ్ కలెక్టర్ చంద్రకిరణ్ , పూజ వివిధ జిల్లా స్థాయి అధికారులు పాల్గోన్నారు.

# తడి, పొడి చెత్త పునర్వినియోగ తీరు పరిశీలించిన కమిషనర్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** తడి. పొడి చెత్తల నుండి వనరుల తయారీ లక్ష్యంగా మేడ్చల్ జిల్లాలోని ఫీర్జాదిగూడలో ఏర్పాటు చేసిన సమీకృత వ్యర్థ పదార్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య పని విధానాన్ని పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, ఫీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వరరావులు ఆయనకు తడి చెత్త ద్వారా బయోగ్యాస్ ఉత్పత్తి, పొడి చెత్తను రీస్లైక్లింగ్ చేసే విధానాన్ని విశదీకరించారు. తడి చెత్తలో ఆహార వ్యర్థాలు, తోట వ్యర్థాలు ఉంటాయ ని, వీటిని కంపోస్టింగ్ ద్వారా ఎరువుగా కానీ బయోగ్యాస్‌గా కానీ ఉత్పత్తి చేయవచ్చని ఖమ్మం కమిషనర్‌కు తెలిపారు. అదే విధంగా పొడి చెత్తలో వచ్చే ప్లాస్టిక్, కాగితం, గాజులాంటి రకరకాల లోహాల వంటి పునర్వినియోగంచేయ గల పదార్థాలను రీస్లైక్లింగ్ చేస్తా మన్నా రు. ఈ ప్రక్రియ ద్వారా కాలుష్య నివారణతో పాటు ఇళ్లు, వ్యాపార సంస్థల నుండి ప్రతిరోజు సేకరిం చే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి పునర్వినియోగానికి ఉపయోగపడేలా ఈ కేంద్రాన్ని రూపొందించామన్నారు. డిఆర్ సాయినాథ గౌడ్, ఎఇ వినీల్, ఐటిసి ప్రతినిధు లు ఉమాకాంత్, సుధ, సానిటరీ ఇనస్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ బాలమురళీకృష్ణ తదితరులు వారి వెంట ఉన్నారు.

## రోడ్డు వేయకుండా మట్టితో పూడ్చడం దారుణం : ఉమా మహేష్



**ప్రజాపక్షం/దుండిగల్:**గాజులరామారం డివిజన్ రావి నారాయణ రెడ్డి నగర్‌లో నాలాకోసం గుంతలను తవ్వి గుంతలను పాడైన రోడ్డును మట్టితో పూడ్చకుండా సేకరించిన చెత్తను గుంతలలో రోడ్డుపై వెయ్యడం దారుణమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. అనంతరం మాట్లాడుతూ, ఈ ఘనత గాజులరామారం డివిజన్ మున్సిపల్ అధికారులకే దక్కుతుందని ఈ విషయాన్ని స్థానికులు ఇంజనీరింగ్ అధికారులను అడిగితే మాతో సహకరించండి అని స్థానికులతో అన్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డును చూపెట్టి అధికారులు కాంట్రాక్టర్లు డబ్బులు గుంజుతారని ప్రజలు వాపోతున్నారు. అవినీతి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా పైస్థాయి అధికారులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పాఠశాలలో పాముల కలకలం

**ప్రజాపక్షం/తాండూరు:**యాలాల మండల పరిధి అక్కంపల్లి ప్రాథమిక పాఠశాలలో పాములు ప్రత్యక్షం కావడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ఉపాధ్యాయులు గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం పాఠశాలలో ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు 92 మంది విద్యార్థులతో పాఠశాల నడుస్తుంది. బుధవారం యధావిధిగా తరగతులు జరుగుతున్న సమయంలో ఐదవ తగరతి విద్యార్థులు పాములను చూచి ఉపాధ్యాయులకు సమాచారం అందించారు.

స్థానికుల సహాయంతో మూడు నాగు పాము పిల్లలను కొట్టి చంపేశారు. మరో రెండు పాములు తరగతి గదిలోని రంధ్రంలోకి వెళ్ళాయని తెలిపారు. పాఠశాలకు కాంపౌడ్ లేకపోవడం వల్లనే ఐదవ తరగతి గది శిథిలావస్థకు చేరింది. పాఠశాల పరిసరాలలో చెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పాములు వంటి విషపు పురుగులకు ఆవాసంగా మారిందని విద్యార్థులు తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరగతి గదిలో పాములు ప్రత్యక్షం కావడంతో ఉపాధ్యాయులతో పాటు, విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన తరగతి గదికి మరమ్మత్తులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/వికారాబాద్ :**59నూతన మద్యం దుకాణాలకు దరఖాస్తులు కోనసాగుతున్నాయి అని జిల్లా అబ్కరి అదికారి తెలిపారు. ఇప్పటివకు 6దరఖాస్తులు స్వీకరించడం జరిగింది అని అన్నారు. అశక్తి ఉన్న వారు ఈనెల 18వ రకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. దరఖాస్తు రూసుము మూడుల క్షలు డిడి లేదా చాలన్





రూపాంలో సమర్పించాలని తెలిపారు. ఎస్సీ ,ఎస్టీ గౌడ్ కులస్తులకు కులదృవికరణ పత్రం సమర్పించాలని అన్నారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు , పాల్ కార్డు ,స్వియ దృవీ కరణ ప్రాతం మూడు పోటోలు జత చేసి సమార్పించాలని తెలిపారు. ఈనెల 23 న డ్ర తీయబడును అని తెలిపారు.



## నివాస ప్రాంతాల్లో టపాకుల దుకాణం ఏర్పాటు నిషేధం

### వ్యాపారులను హెచ్చరించిన మున్సిపల్ కమిషనర్

**ప్రజాపక్షం/తాండూరు:**రాబోయే దీపావళి పండుగ సందర్భంగా పట్టణంలోని జనావాసాల మధ్య బాణా సంచా(టపాకుల) దుకాణాల ఏర్పాటు నిబంధనల ప్రకారం నిషేధించామని తాండూరు మున్సిపల్ కమీషనర్ యాదగిరి సూచించారు. బుధవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో బాణాసంచ దుకాణాల వ్యాపారుల యాజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నిబంధనల మేరకు బాణా సంచ దుకాణాల ఏర్పాటు మున్సిపల్ నుండి అనుమతి పొందాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించిన పట్టణంలో జనవాసాల మధ్య టపాసుల దుకాణం ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జనావాసాల మధ్య దుకాణాలు ఏర్పాటు చేసుకునే వీలులేదని స్పష్టం చేశారు. నిబంధనలను అనుసరించిన అనుమతి పొందిన తరువాత జనాలు లేనిచోట ఎక్కడైన దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాదని జనవాసాల మధ్య టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్ పొందడానికి ముందు నిబంధన మేరకు ఎన్‌ఒసిలను పొందాలని కమీషనర్ సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఇంచార్జీ శానీటరి ఇన్‌స్పెక్టర్‌లు ఉమేష్‌కుమార్, వెంకటయ్య, వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎటిసిలలో సాంకేతిక నైపుణ్యతా శిక్షణ

### కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్:** ఎటిసిలలో సాంకేతిక నైపుణ్యతతో కూడిన శిక్షణను అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ వికారాబాద్ పట్టణ కేంద్రంలోని అధునాతన సాంకేతిక కేంద్రాన్ని బుధవారం సందర్శించి ఎటిసిలో గల సౌకర్యాలపై కలెక్టర్‌ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎటిసిలో శిక్షణ పొందుతున్న విద్యార్థినీ విద్యార్థులతో కావలసిన మౌలిక సదుపాయాలు, వివిధ సౌకర్యాలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శిక్షణ నిమి త్తం వచ్చిన విద్యార్థులకు ఆధునాతన సాంకేతిక లో పట్టు సాధించే విధంగా విద్యార్థినీ విద్యార్థులను తీర్చిదిద్దాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఏటిసీలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. ఎటిసిలో ఫర్నిచర్ లేని పరిస్థితిని గ్రహించిన కలెక్టర్ విద్యార్థులకు సరిపోను కుర్చీలను సమకురుస్తామని కలెక్టర్ తెలిపారు. ఏటిసిలోఉన్న సమస్యలపై తన దృష్టికి తీసుకువస్తే సమస్యలను తీర్చడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఎస్ఎం స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

# అవును...అందరి వాడు నారాయణరావు..?

* మహారాజుల కుటుంబం చుట్టూ రాజకీయాలు
* బషీరాబాద్‌లో పట్టుకోసం యత్నాలు

**ప్రజాపక్షం/తాండూరు:** ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే మహారాజుల కుంటుంబానికి మంచి పేరు ఉండేది. నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాలలో ఎదురులేని శక్తిగా ఆ కుటుంబం కొనసాగిన విషయం తెలిసిందే. స్వర్గీయ మాజీ మంత్రి మాణిక్‌రావుతో ప్రారంభమైన రాజకీయం ఆ కుటుంబాన్ని నాలుగు దశాబ్దాల పాటు ఎదురులేని శక్తిగా నడుపించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ అంటేనే మహరాజుల కుటుంబంగా గుర్తింపు తెచ్చుకున్నారు.అప్పటి నుండి తాండూరు అసెంబ్లి సెగ్మెంట్‌లో మహారాజుల కుటుంబానికి మంచి పట్టున్న సాధించారు. కాని 1994లో జరిగిన సాధరణ ఎన్నికలు ఆ కుటుంబంలో చిచ్చు పెట్టిన విషయం తెలిసిందే. అప్పటి నుండి ఆ కుటుంబంలో నెలకొన్న వర్గ పోరుతో మహారాజుల కుటుంబానికి పతనం ప్రారంభమైనట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. నాలుగు దశాబ్దాల పాటు తాండూరు సెగ్మెంట్‌లో ఎదురులేని శక్తిగా ఎదిగిన మహారాజుల కుటంబంలో నేటి రాజకీయాలు చిచ్చు లేపుతున్నాయి. అంతకు ముందు జరిగిన ఎన్నికలలో మహారాజుల కుంటుంబం ఓటమిని చవి చూసింది. అనంతరం 2018, 2023లో జరిగిన సాధారణ ఎన్నికలలో మహారాజుల కుటుంబానికి వచ్చిన అవకాశాన్ని చేజేతులా చేజార్చుకున్నారు. నారాయణరావు రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించినప్పటికి మరోమారు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో స్వర్గీయ మాజీ మంత్రి మాణిక్‌రావు తనయుడు ఎం రమేష్ మహారాజ్‌ను రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ మెంబర్‌గా నియమించిన విషయం తెలిసిందే. గత కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు మరోమారు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించారు. మహారాజుల కుటుంబానికి పదవులు దక్కించుకోవడానికి మండల కేంద్రమైన బషీరాబాద్‌లోనే మకాం వేసి చక్రం తిప్పుతున్నాడు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన వెంటనే మాజీ ఎమ్మెల్యే ఎం నారాయణరావుతో ముందుగానే బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాండూరు మాజీ ఎంఎల్ఏ పైలెట్ రోహిత్‌రెడ్డి భేటీ కావడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమతో జట్టుకడితే తాండూరు మంచి ఫలితాలను సాధించవచ్చనని చర్చించుకున్నారు. అయితే ఇందుకు స్పందించిన నారాయణరావు తమ కుటుంబానికి ఎంపిపి, జడ్పీటిసి పదవితో పాటు తమ వర్గీయులకు ఆయా స్థానాలలో అవకాశాలు ఇవ్వాలని చర్చించినట్లు తెలుస్తోంది. తాజాగా మంగళవారం సాయంత్రం స్థానిక ఎంఎల్ఏ బుయ్యని మనోహర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌తో కలసి మాజీ ఎమ్మెల్యే ఎం నారాయణరావు ఇంటికి వెళ్ళి స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించడం గమనార్హం. ఇంతకు నారాయణరావు ఏ పార్టీలో ఉన్నట్లూ అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో ఆయన కీరోల్ పోషించనున్నాడన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అవును అందుకే నారాయణరావు అందరి వాడు...?



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఎమ్మెల్యే సహకారంతోనే సిసి రోడ్లకు మహర్దశ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే ఎం తో కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు బచ్చలి నరేష్, ఖదీర్ వివరించారు. బుధవారం పట్టణంలోని ఆఫీసర్స్ కాలనీల్లో రెండు సిసి రోడ్ల నిర్మాణం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలి టిలో ఉన్న కాలనీలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుం టున్నామని, ఇందుకు స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ ఎంతో కృషి చేస్తున్నారని, వారి సహకారంతోనే పనులు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కాలనీల్లో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులు చే పట్టడంతోపాటు నూతన పనులకు శంకుస్థాపనలు చేసినట్లు వివరించారు. దాంతో కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## బాల్యం నుండే భవిష్యత్‌కు బాటలు



**ప్రజాపక్షం/హయత్‌నగర్:** భవిష్యత్‌కు బాల్యం నుండే బాటలు వెయ్యాలని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి అన్నారు. బుధవారం మన్సూరాబాద్ డివిజన్ సహారా రోడ్డు మార్గంలోని విఠల్ ఎన్‌క్లేవ్ కాలనీలో ఎల్లేయ్ టోటస్ ప్రీ స్కూల్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముందుగా రిబ్బన్ కట్ చేసి యాజమాన్యంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నర్సింహా రెడ్డి మాట్లాడుతూ. చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసం ఆధునిక విధానాలతో రూపొందించిన ఈ ప్రీస్కూల్ ఒక నూతన దిశలో ముందడుగు వేయాలని అని పేర్కొన్నారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా విద్యార్థుల్లో మానసిక, శారీరక సామాజిక. అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. పిల్లలలో ప్రతిభను వెలికితీయడమే విద్య యొక్క నిజమైన లక్ష్యమని అదే ఎల్లేయ్ టాట్స్ ప్రీ స్కూల్ దిశఅని కొనియాడారు.ఈకార్యక్రమంలో ఫౌండర్ డైరెక్టర్ శ్రీమతి నికిత రెడ్డి,కార్తీక్ రాజారెడ్డి,రణధీర్ రెడ్డి,వాణి, సులోచన,యంజాల్ జగన్ ,పాతూరి శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వరద ముంపుకు గురైన కాలనీల్లో సహాయక చర్యలు : లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** కురిసిన వర్షాలతో ముంపుకు గురైన కాలనీల్లో బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పర్యటించి సహాయ చర్యలు చేపట్టారు. కురిసిన వర్షాలకు వానూత్న కాలనీ, గాంధీ నగర్ సౌత్, అఖిలాండేశ్వరి కాలనీ, స్నేహమయి నగర్ కాలనీ పరిసరాల కాలనీలో వర్షపు నీరు రోడ్లపై నిలిచిన ప్రాంతాలలో బుధవారం కార్పొరేటర్, జిహెచ్ఎంసి, హైడ్రా అధికారులతో కలిసి పర్యాటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ గుర్రంగూడ ప్రాంతం నుంచి వచ్చే వరద రావడంతో కాలనీలపై ప్రభావం పడుతుందన్నారు. వర్షాపు నీరు కాలనీ రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. త్వరలోనే వరద ముంపుకు కాలనీలకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆయన పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్‌ను కలిసి భారీ పెద్ద స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మించుకునే విధంగా ఒక ప్రణాళిక సిద్ధం చేసి నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తామని కాలనీ ప్రజలకు బరోసా కల్పించారు. సహాయక చర్యల్లో జలమండలి, హైడ్రా, జిహెచ్ఎంసి అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం డిఇ దామోదర్ రావు, జలమండలి జిడిఎం రాజగోపాల్, మేనేజర్ భవ్య, హైడ్రా మేనేజర్ రాజశేఖర్, జిహెచ్ఎంసి ఏఈ కార్తీక్, పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, సురేష్ కుమార్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం సంతోషకరం



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** ప్రభుత్వ పాఠశాలల్లో దాతలు మౌలిక సదుపాయాలు కల్పించడం సంతోషకరం అని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంద్ర రావు అన్నారు. బుధవారం శంకర్ పల్లి పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలకు సదుపాయాలు కల్పిస్తున్నదని, కాగా దాతలు కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అవసరమగు మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని కోరారు. ఉర్దూ పాఠశాలలో కేఎన్ఏ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 126 మంది విద్యార్థులకు ఆరు లక్షల రూపాయల విలువలతో కూడిన మౌలిక వనరులు సమకూర్చారు. అందులో భాగంగా ఐదు మరుగుదొడ్లు, ఒక తరగతి గది నిర్మాణం చేపట్టారు. పాఠశాలలో ఉన్న ఐదు తరగతి గదులకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా కేఎన్ఏ ఫౌండేషన్ జర్నలిస్ట్ సెక్రెటరీ అస్మా నిక్కత్ మాట్లాడుతూ పాఠశాలలో ఇలాంటి మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకయ్య గౌడ్,తహసిల్దార్ సురేందర్, మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్,సిపిఎస్ జిల్లా అధ్యక్షులు తాహిర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## మనోభావాలు దెబ్బతీయడం సరికాదు

**ప్రజాపక్షం/కొందుర్గు:** సమాజంలో వ్యక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరించడం, కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదని కొందుర్గు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఆనంద్ అన్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై మరో బీసి మంత్రి మనిషి మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సమాజంలో మనుషుల మనోభావాలు దెబ్బతీసేది మంచి పద్దతి కాదని, మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మాటలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, బహిరంగంగా క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు.

## యువత రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలి

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత కీలక పాత్ర పోషించాలని శంకర్పల్లి మాజీ సర్పంచ్ బిసోళ్ళ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే యువత రాబోయో స్థానిక ఎన్నికలు ఎంపీటీసీ, జెడ్పీటీసి, సర్పంచులు, వార్డు సభ్యులుగా పోటీ చేసి గెలుపొందాలని అన్నారు. చట్ట సభలో పేదలకు రాజ్యాదికారం రావాలని ఆకాంక్షించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన నిధులు సగభాగం గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉన్నా, అది జరగడం లేదని ఆవేదన చెందారు. కొన్ని గ్రామాలలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. యుతక కు అవకాశం వస్తే కొత్త ఆలోచనలతో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు.

## ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా చర్యలు

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా పరిధిలో వరి ధాన్యం(వానాకాలం 2025–26 పంట) కొనుగోళ్లపై జిల్లా ప్రొక్యూర్మెంట్ కమిటీ మెంబర్స్‌తో అదనపు కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో వరి ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి పలు సూచనలు చేశారు. వానాకాలం 2025–26 సీజన్ కోసం, జిల్లా యంత్రాంగం 33 వరి కొనుగోలు కేంద్రాలను (3 పిపిసిఎస్,ఐకెపి,23 పిఎసిఎస్ తోపాటు 7 డిసిఎంఎస్)సెంటర్లను తెరవాలని నిర్ణయించింది. సన్నరకం 15,000 మెట్రిక్ టన్స్(ఎంటిఎస్), దొడ్డురకం 15,000 ఎంటిఎస్,కింద వరిని కొనుగోలు చేయాలని అంచనా వేయబడింది. ఇలా మొత్తం 30,000 ఎంటిఎస్,కొనుగోలు చేయడం జిల్లా లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నవంబర్ మొదటి వారంలో ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖా అధికారులు సమాచారం ఇవ్వడం జరిగినది. ఎంఎస్‌పి గ్రేడ్ ఎ రూ.2389 ప్రతి క్వింటల్‌కు కామన్ ధర నిర్ణయించగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాం మేరకు బోనస్ సన్నరకం వరి పంటకు క్వింటాల్‌కు రూ.500లు రైతులకు అదనపు ప్రయోజనం కోసం అనగా రూ.2,889లు చెల్లించబడుతుంది. జిల్లాలో సన్నరకం,దొడ్డు రకం వరి రకాలకు వేర్వేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవనున్నారు. కొనుగోలు కేంద్రాలలో నాణ్యతా ప్రమాణాలకు, కంట్రోల్ రూమ్ నెంబర్లకు సమందించిన బ్యానర్లు ఏర్పాటు చేయాలని. మార్కెటింగ్ అధికారి కొనుగోలు కేంద్రాలకు సరిపడా ప్యాడి క్లీనర్స్,మొయిసచర్ మీటర్స్,వెయింగ్ స్కేల్స్, గ్రాయిన్ కాలిపర్స్‌తో పాటు టార్పాలిన్స్ అందుబాటులో ఉంచాలనీ చంద్రారెడ్డి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారికి మంచి నీరు,ఆశ్రయం, విద్యుత్ సదుపాయాలు ఉండేటట్టు చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ జె. హరీష్,డిసిఎస్ఒ వనజాత, డిఆర్‌డిఒ శ్రీలత, డిసిఒసి సుధాకర్, డిఎఒ డి.ఉషా, డిఎండి ఎండి. రియాజ్, డిఎల్ఎంఒ పి.శ్రీనివాస్ రెడ్డి,రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అసిస్టెంట్ మేనేజర్లు, డిటిలు,ఎడిఎలు, ఎపిఎంలు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక సమాచారాన్ని రైతులకు చేరవేయడం కీలకం

రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి డి ఉష



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సమయానుసారంగా సాంకేతిక సమాచారాన్ని రైతులకు చేరవేయడం అత్యంత కీలకమని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి డి ఉష అన్నారు. బుధవారం హయత్ నగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీ కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్రకాంత్ ఆధ్వర్యంలో ఆధునిక డిజిటల్ వ్యవసాయ విధానం,చీడపీడల స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ అగ్రికల్చర్ బయోసైన్స్ ఇంటర్నేషనల్ (సిఎబిఐ) సహకారంతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇట్టి శిక్షణ తరగతుల ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి ఉష మాట్లాడుతూ సమయానుసారంగా సాంకేతిక సమాచారాన్ని రైతులకు చేరవేయడం అత్యంత కీలకమన్నారు. వ్యవసాయ,వ్యవసాయ విస్తరణ అధికారు లు ఈ డిజిటల్ యాప్ వినియోగంపై పూర్తి అవగాహన పెంచుకొని రైతులకు పురుగుమందుల వినియోగంపై మార్గనిర్దేశం చేయాలని సూచించారు..సకాలంలో పంటలకు వచ్చే ప్రమాదాలను పసిగట్టి అంచనా వేసి వాటి నివారణ చర్యలు చేపట్టడానికి తద్వారా కలిగి నష్టాలు నివారించడానికి ఈ డిజిటల్ వ్యవసాయ విధానం ఎంతో సహాయపడుతుందని తెలిపారు.ఇది చిన్న, సన్న కారు రైతులు ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేయడంలో, దాని నాణ్యతను మెరుగుపరచడంలో తోడ్పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధు,మంజరి, సిఎబి ఐ కోఆర్డినేటర్, ఎపిహెచ్ఎం నుంచి డాక్టర్ అనిఫా, వ్యవసాయ కమిషనర్ కార్యాలయం నుంచి డిడిఎ చంద్రశేఖర్,ఇత శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## కార్మికులు ఇ-శ్రామ్ కార్డులు ఉపయెగించుకోవాలి

అందోజు రవీంద్ర చారి



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ :** అంసటిత రంగంలో పని చేసున్న ప్రతి కార్మికుడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇ–శ్రామ్ కార్డులను తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర సర్వ సేవ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూ పోరాట కమిటీ అధ్యక్షులు అందోజు రవీంద్ర చారి అన్నారు. బాటసింగారం పండ్ల మార్కెట్‌లో ఎఐటియుసి బిఒసి అధ్యర్యంలో బుధవారం కార్మికులకు కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హజరై మాట్లాడుతూ... కార్మికుల పక్షాన ఎఐటియుసి పోరాటం చేస్తుందని తెలిపారు. మార్కెట్‌లో పని చేస్తున్న కార్మికులకు వైద్యం పిల్లలకు ఉచిత విద్య కోసం పాలకవర్గం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కనీస సౌకర్యాలను తక్షణమే ఏర్పాటు చేయాలని లేని పక్షంలో కార్మికులు చేసే పోరాటానికి తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపినారు. హామలీ కార్మికులకు ఇందిర్మ ఇండ్లు కేటాయించాలని పని చేసే చోట విశ్రాంతి గదులు బాత్రూంలు ఏర్పాటు చేయాలని లైసెన్స్‌లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్, సిపిఐ మండల కార్యదర్శి కేతరాజు నర్సింహ్మా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్,పండ్ల మర్కేంట్ కార్మిక సంఘం అధ్యక్షులు ఎండి షరిప్,ప్రధాన కార్యదర్శి చిన్నగౌడ్,కోశాధికారి ఎం.పచయ్య,ఉపాధ్యక్షులు శంకర్ నాయక్,బాల్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## సిజెఐపై దాడి అప్రజాస్వామిక చర్య

బాలాపూర్ చౌరస్తాలో వామపక్షాల నేతల నిరసన, రాస్తారోకో



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని వామపక్ష పార్టీ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ చౌరస్తాలో సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐయంఎల్ వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల పార్టీ కార్యదర్శి ముకుంద చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఐ(ఎం) కార్యదర్శి ఎం. యాదయ్య, సిపిఐయంఎల్ కార్యదర్శి కొల్లూరి భీమేష్, సిఐటియు నాయకులు బాబు మాట్లాడుతూ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై రాకేష్ కిషోర్ అనే వ్యక్తి దాడి చేయడం అప్రజాస్వామిక చర్య అని, అతన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో న్యాయవ్యవస్థపై మాత్రమే దాడి జరిగినట్లుగా భావించరాదని ప్రజాస్వామ్య వ్యవస్థపై యావత్ సమాజంపై జరిగిన దాడిగా భావించాలని పేర్కొన్నారు. నేటి పాలకవర్గాలు రోజురోజుకు పెరుగుతున్న దాడులను ఆపలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయక్యాధర్శి జాటోత్ రెడ్యా నాయక్, సిఐటియు నాయకులు శేఖర్‌యాదవ్, మహిళా సమాఖ్య బాలాపూర్ మండల కార్యధర్శి యాదమ్మ యాదవ్, రమావత్ చత్రునాయక్, మోహన్, మల్లి కార్జున్, నరేందర్, శంకర్, సురేష్, విజయ్, వెంకయ్య, జగన్, నిరంజన్, శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

## దాడికి వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసిన నేతలు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని ముఖ్యకూడలిలో ప్రజా సంఘాల నేతలు, జర్నలిస్టు మిద్దెల సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ప్లెకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ నాడు జర్నలిస్టు గౌరీ లంకేష్, నరేంద్ర దబోల్కర్, గోవిందు పన్సారే నుండి మొదలు కొని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వరకు దాడులు కొనసాగుతునే ఉన్నాయని వివరించారు. జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడి చేసిన మతోన్మాద దుండగులను కఠినంగా శిక్షించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని చీకట్లోకి నెట్టివేసేందుకు కొందరు మనువాదులు మతతత్వం పేరుతో ప్రవర్తిస్తున్నారని, దీన్ని ప్రజాస్వామ్య వాదులు, మేధావులు ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారత రాజ్యాంగం విలువలు కాపాడేందుకు ప్రతి ఒక్క భారతీయుడు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడేందుకు ప్రతి ఒక్క పౌరుడు తరలివచ్చేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడి రాజ్యాంగంపై జరిగినట్లే ప్రతి ఒక్కరు భావించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మరోమారు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకొకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అర్జునప్ప, రవీంద్రనాథ్, ఈశ్వర్, శ్రీనునాయక్, కృష్ణ, కరుణాకర్, టిజి శ్రీనివాస్, బిజిలి సత్యం, రాములు, చంద్రశేఖర్, తిరుమలయ్య, బాలయ్య, శివరాములు, మందారం నరసింహులు, లింగంలు పాల్గొన్నారు.

## ఇన్సూరెన్స్ బాండ్‌లు పంపిణీ



**ప్రజాపక్షం/ సరూర్‌నగర్ :** గడ్డిఅన్నారం మున్సిపాలిటీ కురుమ సంఘం సభ్యులందరి అధ్యక్షులు బైర శంకర్ తన సొంత ఖర్చుతో సంఘం యాక్సిడెండ్ ఇన్సూరెన్స్ కల్పించి ఇవ్వడం అభినందనీయం అని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాంనగర్‌లోని కురుమ సంఘం కార్యాలయంలో బైర శంకర్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులకు రూ.10లక్షల పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ బాండ్‌ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై స్థానిక కార్పోరేట ర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి కలిసి సంఘ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇన్సూరెన్స్ ప్రతి కుటుంబానికి రక్షణ కవచం కల్పించడం ఒక విశిష్టమైన సేవా కార్యక్రమంగా నిలిచిందన్నారు. అనంతరం సంఘం సభ్యులు ఎమ్మెల్యే, కార్పోరేటర్ లను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం : మంచిరెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటిలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం మాజీ శాసన సభ్యులు మంచిరెడ్డి రె డ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం యాచా రం మండల కేంద్రంలో ఇంటింటికి తిరిగి ఆరు గ్యారంటీల బాకి కార్డులను పంపంణీ చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మోస పూరిత వాగ్ధానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో నిమ్మ కు నిరేత్తినట్లుగా వ్యహరిస్తుందని ఆగ్రహం వ్య క్తం చేశారు. ట్రిబల్ అర్‌ను 7కిలో మీటర్ల దూ రం పెంచారని అన్నారు.2500 పట్టా భూములు రైతులకే వాపస్ ఇవ్వలని డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటి అంటు ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారువచ్చే ఎంపిటిసి, జెడ్పిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదియాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి,మాజీ గ్రం థాలయ సంస్థ చైర్మేన్ సత్తు వెంకట రమణారెడ్డి,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షకార్యదర్శులు కర్నాటి రమేశ్ గౌడ్ తదితరులు పాల్గోన్నారు.

## పనుల్లో నాణ్యత ప్రమాణాలు



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న ప్రతి కాలనీలకు అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని వనస్థలిపురం డివిజన కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ కాలనీలో శ్రీశ్రీ కనక దుర్గ అమ్మవారి ముందు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే జిహెచ్ఎంసి నిధులు పూర్తి స్థాయిలో కాలనీల అభివృద్ధి ఉపయోగిస్తుందన్నారు. అభివృద్ధి పనులను కాలనీ సంక్షేమ సంఘాల సహకారం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బాలాజీనాథ్, కరుణాకర్‌రెడ్డి, అమ్మవారి దేవాలయం కార్యదర్శి పద్మారెడ్డి, కన్వీనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రాఘవేంద్ర హోటల్ ప్రారంభం

వనస్థలిపురం డివిజన్‌లోని హస్తినాపురం డివిజన్ సిగ్నల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రాఘవేంద్ర హోటల్ నిర్వహకులు విద్యాధర్ గుప్తా వారి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యతమైన అహారం అందించి వారి మనన్నలు పొందాలని అకాక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు హరేందర్‌రెడ్డి, భూపతిరెడ్డి, కంచర్ల అనంత్‌రెడ్డి, కొలను బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫోటో రైటప్ నెం:08ఎల్‌బి నగర్02: ప్రశాంత్ నగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి



## చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను విధిగా వేయించండి

హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను వేయించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని నెహ్రూనగర్ కాలనీలో ఉన్న అంగన్‌వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పోషక ఆహారం, వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ పోషక ఆహారం మానవ శరీరానికి ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్క తల్లిదండ్రులు చిన్నారులకు పోషక ఆహారం అందించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంతోపాటు పోషకాహారం, రోగ నిరోధక వ్యవస్థలను బలోపేతం చేస్తుందని వివరించారు. జీర్ణక్రియను మెరుగు పరుస్తుందని, మానసిన ఆరోగ్యాన్ని సైతం అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా అంగన్‌వాడి కేంద్రాలకు అంధించేందుకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రతి గర్భిణీ, బాలింతలు విధిగా తీసుకోవాలని సూచించారు. పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, ప్రోటీన్లు, కాల్షియం, మంచినీరు వంటిని ప్రధానం గా ఎక్కువ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్వైజర్ వెంకటమ్మ, టీచర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.



## బిసి రిజర్వేషన్లు అమలు చేయాలంటూ హైకోర్టులో ఎమ్మెల్యే పిటిషన్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కృషి చేయాలంటూ పటిషన్ వేసినట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. బుధవారం హైద్రాబాద్‌లో న్యాయవాదులతో చర్చించి బీసి రిజర్వేషన్లపై పిటిషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి మద్దతులగా బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జిఒ9 తీసుకువచ్చారని, ఈ జిఒను అమలు చేయాలని కోరారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రాజకీయ రిజర్వేషన్లు తీసుకువస్తే కొంతమంది అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. 42శాతం బిసి రిజర్వేషన్ బిల్లు హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు చెప్పిందని వివరించారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటే కొంతమంది స్వార్థ పరులు న్యాయస్థానాల్లో పిటిషన్లు వేసి సమయాన్ని వృధా చేసేందుకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# రీల్

## 'మటన్ సూప్'కు సెన్సార్ సమస్య



డిఫరెంట్ కథా, కథనాలతో రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు బ్యానర్లపై రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో హీరోయిన్లుగా రామచంద్ర వట్టికూటి తెరకెక్కించిన చిత్రం 'మటన్ సూప్'. 'విట్‌నెస్ ది రియల్ క్రైమ్' ట్యాగ్ లైన్. మల్లిఖార్జున ఎలికా (గోపాల్), రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 10న థియేటర్లోకి రాబోతోంది. ఈక్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెన్సేషనల్ డైరెక్టర్ వశిష్ట ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను లాంఛ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మల్లిఖార్జున ఎలికా మాట్లాడుతూ మటన్ సూప్' సినిమాకు టీం ఎంతో సహకరించింది. జెమినీ సురేష్ మాకు ఇచ్చిన సపోర్ట్ ఎప్పటికీ మర్చిపోలేం. ఇందులో జెమినీ సురేష్ నటన చూస్తే అందరూ ఆశ్చర్యపోతారు. వెంకీ వీణా ఇచ్చిన మ్యూజిక్ అద్భుతం. 'మటన్ సూప్' టైటిల్ వద్దని మొదట్లో చెప్పాను. కానీ కథ విన్న తరువాత ఆ టైటిల్ అయితేనే పర్ఫెక్ట్ అని తెలిసింది. సెన్సార్ నుంచి కూడా మాకు సమస్యలు వచ్చాయి. అన్ని అడ్డంకులు దాటుకుని అక్టోబర్ 10న మా చిత్రం ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. రామచంద్ర ఈ సినిమాను ఎంతో గొప్పగా చిత్రీకరించారు. మా అమ్మ కలను ఆడియెన్స్ ముందుకు అక్టోబర్ 10న తీసుకు వస్తున్నాం. మా మూవీని ఆడియెన్స్ చూసి సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను. అని అన్నారు. డైరెక్టర్ వశిష్ట మాట్లాడుతూ ''మటన్ సూప్' టైటిల్ చాలా బాగుంది. ట్రైలర్ బాగుంది. ట్రైలర్ ఎంత బాగుందో.. సినిమా కూడా అంత పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను. చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్' అని అన్నారు. హీరో రమణ్ మాట్లాడుతూ మటన్ సూప్'ని రామచంద్ర అద్భుతంగా తీశారు. ప్రతీ ఒక్కరూ ప్రాణం పెట్టి సినిమా కోసం పని చేశారు. నిర్మాతలు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. సినిమా చాలా బాగా వచ్చింది. అక్టోబర్ 10న మా సినిమాను చూడండి. చూసిన ప్రతీ ఒక్కరికీ నచ్చుతుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర వట్టికూటి, హీరో రమణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు, నిర్మాత రామకృష్ణ సనపల, నటుడు జెమినీ సురేష్ , నటుడు శ్రీ చరణ్, సంగీత దర్శకుడు వెంకీ వీణా, నటుడు కిరణ్ మేడసాని, నటుడు గోవింద్ పాల్గొన్నారు.

## 'హుడియో హుడియో' పాట ఆవిష్కరణ



'మాస్ జాతర' చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'తు మేరా లవర్', 'ఓలే ఓలే' పాటలు శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమా నుంచి 'హుడియో హుడియో' మూడవ పాటను ఆవిష్కరించారు.మాస్ , మెలోడీని అందంగా మిళితం చేసిన ఈ మనోహరమైన ట్యూన్, అందరినీ కట్టిపడేస్తోంది.'హుడియో హుడియో' గీతాన్ని సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో శ్రావ్యంగా, హుషారుగా ఉండేలా తనదైన శైలిలో అద్భుతంగా స్వరపరిచారు. మాస్ చిత్రానికి తగ్గట్టుగా ఓ సరికొత్త మెలోడీని అందించారు.


## కాస్ట్యూమ్ డిజైనర్ నుంచి డైరెక్షన్ వరకు..

### వంద సినిమాలకు కాస్ట్యూమ్ డిజైన్ చేశా.. మీడియా చిట్ చాట్‌లో నీరజ కోన



సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా, శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'తెలుసు కదా'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా అక్టోబర్ 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా పరిచయమవుతున్న నీరజా కోన మీడియాతో చిట్ చాట్ చేశారు. నాకు స్కూల్ డేస్ నుంచి రైటింగ్ ఇష్టం. కవితల పుస్తకం కూడా పబ్లిష్ చేయడం జరిగింది. కథలు చెప్పమంటే చాలా ఇష్టం. నాని ఇలాంటి స్నేహితులు చాలా సపోర్ట్ చేశారు. ఒక దశలో సినిమాకి కథ రాయగలనే నమ్మకం కుదిరింది. అలా రాసుకున్న కథల్లో ఒకటి.. 'తెలుసు కదా'. నేను సినిమాలకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేయలేదు. దాదాపుగా వంద సినిమాలకి కాస్ట్యూమ్ డిజైనర్ చేశాను. కాస్ట్యూమ్ డిజైనర్‌గా బాద్షా నా ఫస్ట్ ఫిల్మ్. అత్తారింటికి దారేది, ఎవడు, రామయ్య వస్తావయ్యా ఎన్నో పెద్ద సినిమాలకి వర్క్ చేశాను. తమిళ్‌లో విజయ్ కార్తీక్ సూర్య విక్రమ్ శివ కార్తికేయన్ ఇలా అందరి పెద్ద హీరోలతో పనిచేసే అవకాశం దొరికింది. 12 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. అదే నా అనుభవం. లెర్నింగ్ స్కూల్. పులి వేట [?] ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నితిన్ ని కలిసాను. అప్పుడు ఈ ఐడియా చెప్పాను. ఈ కథకు సిద్ధు అయితే బాగుంటుందని ఆయనే చెప్పారు. సిద్దుని కలిసి ఈ కథ చెప్పాను. సింగిల్ సిట్టింగ్లో మొత్తం కథ విన్నారు. ఆయన మేనేజర్ ఫోన్ చేసి ఈ కథ చేస్తున్నామని చెప్పారు అది నా జీవితంలో మర్చిపోలేని మూమెంట్. రైటర్‌గా డైరెక్టర్‌గా తెలుసు కదా ప్రాజెక్ట్‌తో పరిచయం కావడం ఆనందంగా వుంది. తెలుసు కదా సినిమా ఒక లవ్ స్టోరీ. ఇద్దరి మధ్య ఉండే ప్రేమ కథ. ఒక ప్రేమ కథతో పాటు ఒక కాంప్లెక్స్ సిటీ [?] కూడా వుంది. ఇందులో మూడు క్యారెక్టర్స్ కూడా చాలా స్ట్రాంగ్‌గా ఉంటాయి. ప్రతి క్యారెక్టర్ పాజిటివ్‌గా ఉంటుంది. ప్రతి క్యారెక్టర్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది. కథని టీజర్ లో రివీల్ చేయలేదు. ట్రైలర్ తో ఇది ఫలానా టైప్ స్టోరీని అని చెప్పబోతున్నాం. ఒక కథ అమ్మాయి రాసిందా అబ్బాయి రాసిందా అనేదానికంటే బాగా రాశారు అన్నదే ఇంపార్టెంట్. నా దృష్టి కూడా కథని హానెస్ట్‌గా చెప్పడం పైనే ఉంది. ఈ కథ ఎలాంటి బయాస్ లేకుండా రాసింది. ఈ సినిమాని అబ్బాయి తీసినా అమ్మాయి తీసినా అన్నదాని కంటే ఒక గుడ్ ఫిల్మ్ మేకర్ తీసిన సినిమా అని పేరు తెచ్చుకోవడం నాకు ఇష్టం.కెరీర్‌లో ఐకానిక్ క్యారెక్టర్ దొరకడం అనేది ఒక అదృష్టం. ఎన్ని సినిమాలు చేసినా కొందరికి ఐకానిక్ రోల్ దొరకదు. కానీ సిద్దుకి టిల్లు లాంటి అద్భుతమైన క్యారెక్టర్ కెరీర్ బిగినింగ్‌లోనే పడింది. నిజానికి అలాంటి ఇమేజ్ ఉన్నప్పుడు ఒక కొత్త క్యారెక్టర్ చేయడం ఒకింత కూడుకున్న వ్యవహారం. కానీ ఇందులో వరుణ్ క్యారెక్టర్ ఆయన చాలా యూనిక్ ప్రజెంట్ చేశారు. ఒక ఫిల్మ్ మేకర్‌గా నేను ఏమి అనుకుంటున్నానో ఆ క్యారెక్టర్‌ని వరుణ్‌గా సిద్దులో చూశాను. నాకు నేర్చుకోవడం ఇష్టం. ఈ జర్నీలో ఎంతో మంది గొప్ప టెక్నీషియన్స్‌తో వర్క్ చేశాను. వాళ్ళని నాకు నేర్చుకోవడానికి, ఫిల్మ్ మేకర్ కావడానికి ఎంతగానో సహాయపడ్డాయి.శ్రీనిధి చేసిన రాగ చాలా కాంప్లెక్స్ క్యారెక్టర్. హిట్ 3 కి ముందే ఈ క్యారెక్టర్ చెప్పాను. తను కేజీఎఫ్, హిట్ 3 లాంటి సినిమాలు చేయడం మాకు చాలా హెల్ప్ అయ్యింది. అంజలి క్యారెక్టర్‌లో రాశి చాలా అద్భుతంగా నటిచింది. తనది చాలా యూనిక్ క్యారెక్టర్. కొత్త ప్రాజెక్ట్స్ గురించి అంటారా త్వరలోనే ప్రకటిస్తా.

## డిసెంబర్ 5న 'వా వాతియార్' విడుదల




స్టార్ హీరో కార్తి నటిస్తున్న తాజా చిత్రం 'వా వాతియార్' విడుదల తేదీ ఖరారయింది. ఈ సినిమాను డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్టు నిర్మతలు ప్రకటించారు. 'వా వాతియార్' చిత్రాన్ని స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో కె.ఇ. జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా హీరో కార్తి నటిస్తున్న 'వా వాతియార్' సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు.

## 'టిక్కల్ టిక్కల్' పాట రిలీజ్



హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కే ర్యాంప్'. ఈ సినిమాను హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్ల మీద ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'కే ర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18న థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ సినిమా నుంచి థర్డ్ సింగిల్ 'టిక్కల్ టిక్కల్' పాటను విడుదల చేశారు. చేతన్ భరద్వాజ్ కంపోజ్ చేసిన 'టిక్కల్ టిక్కల్..' పాటకు సురేంద్ర కృష్ణ సాహిత్యం అందించారు.

## కబడ్డీ ఆట నేపథ్యంలో 'బల్టీ'




షేన్ నిగమ్, ప్రీతి అస్రానీ, శాంతను భాగ్యరాజ్, సెల్వరాఘవన్ తో పాటు ప్రేమమ్ డైరెక్టర్ అల్ఫాన్స్ పుదిరన్ ప్రధాన తారాగణంగా ఉన్ని శివలింగం దర్శకత్వంలో తమిళ, మలయాళ భాషల్లో ఘన విజయం సాధించిన బల్టీ చిత్రం ఈ నెల 10న తెలుగులో విడుదలవుతోంది. కబడ్డీ ఆట నేపథ్యంలో సాగే ఈ సినిమాలో రాజకీయాలు, గ్యాంగ్ స్టర్ కథలతో కలిపి వైవిధ్యంగా రూపొందించారు. ఈ చిత్రాన్ని తెలుగులో ఎల్మా పిక్చర్స్ సంస్థ విడుదల చేస్తోంది.ఈ సందర్భంగా సంస్థ అధినేత ఎన్. ఎథిల్ రాజ్ మాట్లాడుతూ ' తమిళ, మలయాళ భాషల్లో రూపొందిన ఈ సినిమా అక్కడ ఘనవిజయం సాధించింది. క్రిటిక్స్ కూడా చక్కటి రివ్యూలు ఇవ్వడంతో ఈ సినిమాను తెలుగులోకి డబ్ చేసి విడుదల చేయడం జరుగుతోంది. ప్రస్తుతం మంచి ఫామ్ లో వున్న యువ సంగీత దర్శకుడు సాయి అభయంకర్ సంగీతాన్ని అందించారు. మలయాళంలో ఆర్.డి.ఎక్స్ సినిమాతో గత సంవత్సరం ఘన విజయాన్ని సొంతం చేసుకొని మలయాళంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న యువ నటుడు షేన్ నిగమ్ ఇందులో హీరోగా అద్భుతమైన నటన కనబరిచారు. ప్రీతి అస్రానీ, శాంతను భాగ్యరాజ్ నటన ఆకట్టుకుంటుంది. ప్రముఖ దర్శకుడు సెల్వరాఘవన్ విలన్ పాత్రలో అద్భుతంగా నటించారు అని అన్నారు. దర్శకుడు ఉన్ని శివలింగం మాట్లాడుతూ.. తమిళనాడు, కేరళ సరిహద్దులో ఉన్న వెలంపాళయంలో జరిగే ఔట్ అ౯డ ఔట్ రా రస్టిక్ విలేజ్ డ్రామాగా సినిమా వుంటుంది. ఆ ఊరిని శాసించే ముగ్గురు పెద్దలు వారి మధ్య జరిగే వ్యాపార రాజకీయాల్లో నలుగురు కబడ్డీ ప్లేయర్స్ చిక్కుకోవడం, ఆపై వచ్చే ఘర్షణలు, భావోద్వేగాల సమాహారంగా బల్టీ సినిమా వుంటుంది అని అన్నారు.

## గత వైభవ పాట విడుదల



ఎస్ఎస్ దుశ్యంత్, అశికా రంగనాథ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఎపిక్ ఫాంటసీ డ్రామా గత వైభవ. సింపుల్ సుని దర్శకత్వంలో సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బ్యానర్స్ పై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. నవంబర్ 14న ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి వర్ణమాల సాంగ్‌ని లాంచ్ చేశారు.సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో దుశ్యంత్ మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకులు అంటే నాకు చాలా ఇష్టం. ఈ సినిమాతో మీ అందరికి ముందుకు రావడం చాలా సంతోషంగా ఉంది.నేను కూడా హైదరాబాద్ వచ్చినప్పుడు తెలుగులో మాట్లాడడానికి ప్రయత్నించాను. నవంబర్ 14న కన్నడ తెలుగులో గత వైభవ సినిమా రిలీజ్ అవుతుంది. తెలుగు ప్రేక్షకుల ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటున్నాను.

## 'అరసన్' టైటిల్ పోస్టర్ విడుదల




సిలంబరసన్ హీరోగా వెట్రిమారన్ దర్శకత్వంలో కలైపులి ఎస్.ధాను నిర్మిస్తున్న చిత్రాన్ని 'అరసన్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ మేరకు టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ భారీ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన పోస్టర్‌లో సిలంబరసన్ పవర్ ఫుల్ గా కనిపించారు. దర్శకుడు వెట్రిమారన్, నిర్మాత కలైపులి ఎస్. ధాను లాంటి క్రేజీ కాంబినేషన్‌లో రావడంతో సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది.పాన్ ఇండియా ప్రేక్షకులను ఆకట్టుకున్న సిలంబరసన్, ఇప్పుడు 'అరసన్'గా వెండితెరపై అలరించడావ్నికి సిద్ధమవుతున్నారు. ఈ సినిమా ఆయన కెరీర్‌లో మరో మైల్ స్టోన్ సినిమా నిలుస్తుందని హీరో సిలంబరసన్ ఆశ భావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆర్‌టిసి నూతన ఎండిని కలిసిన.. ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు

## కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేత



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆర్‌టిసి నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వై. నాగిరెడ్డిని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించింది. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందచేశారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న మాట్లాడుతూ ఆర్‌టిసిలో ప్రస్తుతం నెలకొన్న సిబ్బంది కొరత, వేతన సవరణలు, ట్రేడ్ యూనియన్‌ల అనుమతిపై విస్తృతంగా చర్చించామని తెలిపారు. ఇప్పటికే 1,753 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నియామక ప్రక్రియ ప్రారంభించినందుకు ఎండికి ధన్యవాదాలు తెలిపారు. అయితే సంస్థలో ఇంకా 17,000 పోస్టులు ఖాళీగా ఉన్నందున వీటి భర్తీకి త్వరలో చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2021, 2025 సంవత్సరాల వేతన సవరణలు ఇంకా అమలుకాకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని త్వరగా అమలు చేయాలని కోరారు. ట్రేడ్ యూనియన్లను అనుమతించకపోవడం వల్ల కార్మికుల హక్కులకు అవకాసం లేకపోతుందని, సంస్థలో యూనియన్లను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇది మర్యాదపూర్వక భేటీ అయినందున, త్వరలో యూనియన్‌ను మరోసారి ఆహ్వానించి, సంస్థ సమస్యలపై సమగ్రంగా చర్చించాలని కోరినట్లు తెలిపారు. ఎండిగా బాధ్యతలు స్వీకరించిన వై.నాగిరెడ్డి గారికి శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి. అహ్మద్ అలీ, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.వెంకటి గౌడ్, ఉపాధ్యక్షులు ఎన్.బాలరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు పి.అప్పారావు, జె.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శులు ఎం.ఎ.మజీద్, వి.కె.స్వామి, కె.రామిరెడ్డి, బి.జ్యోతి, బాలామణి, మంగ, త్రిలోచన, ఎండి. ఖదీర్, పాండురంగయ్య, బి.ఆంధ్రవేణి తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేటలో కేంద్రబృందం పర్యటన

## భారీవర్షాలకు కుంగిన బ్రిడ్జీలు, తెగిన రోడ్ల పరిశీలన



ప్రజాపక్షం/నిజాంపేట్: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ నందిగామ గ్రామాలలో వరదల కారణంగా జరిగిన నష్టాన్ని కేంద్రబృందం బుధవారం సందర్శించి పరిశీలించారు. మొదటగా నందిగామ గ్రామ శివారులో నేషనల్ రోడ్డు 765 డీజీ కుంగిన బ్రిడ్జి పరిశీలించారు. అనంతరం నిజాంపేట మల్కా చెరువు మత్తడి కింది భాగంలో నస్కల్ రోడ్డులో తెగిన బ్రిడ్జిలను కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించారు. భారీవర్షాల కారణంగా కలిగిన నష్టాల అంచనా వేయడం జరుగుతుందని ఈ సందర్భంగా కేంద్రం సభ్యులు తెలిపారు. వారితోపాటు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్డీవో రమాదేవి, మండల తహసిల్దార్ శ్రీనివాస్, సిఐ వెంకటరాజా గౌడ్, ఎస్సై రాజేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఇమాద్‌తో పాటు కేంద్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

# బొటానికల్ గార్డెన్‌లో పాల పిట్ట పండుగ




ప్రజాపక్షం/హైదరాబాద్: బొటానికల్ గార్డెన్‌లో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'ప్రపంచ వన్యప్రాణి వారోత్సవాలని పురస్కరించుకొని ఈ నెల 2 నుండి 8 వరకు పాల పిట్ట పండుగ', అనేక కార్యక్రమాలు నిర్వహించింది. ఈ కార్యక్రమాలలో ఆన్లైన్ పోస్టర్, డ్రాయింగ్ పోటీలు, చిత్రలేఖనం, పోస్టర్ తయారీ, వన్యప్రాణి ఫోటోగ్రఫీ పోటీలు, వన్యప్రాణుల ఫోటోల ప్రదర్శనలు, పాములపై అవగాహన సదస్సు వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో ప్రోగ్రెస్ గ్రూప్ అఫ్ స్కూల్స్, గీతాంజలి వేదిక స్కూల్, జమైతుల్ ముఫ్లిహాట్ హై స్కూల్, పల్లవి అవేర్ ఇంటర్నేషనల్ స్కూల్ సరూర్ నగర్, డెక్కన్ కాలేజ్ అఫ్ మెడికల్ సైన్సస్, గోకరాజు రంగరాజు వంటి పాఠశాల, కళాషాలల నుండి ఆన్లైన్ ద్వారా 58 డ్రాయింగ్స్ పోస్టర్స్ రాగా వాటిల్లో ఉత్తమ డ్రాయింగ్స్ మరియు పోస్టర్ లను ఎంపిక చేసి వారికీ సర్టిఫేట్, జియోమెట్రీ బాక్స్‌లు అందజేయడం జరిగింది. 5వ తేదీన ఫోటోగ్రఫీ పోటీ నిర్వహించారు. ఇందులో 18 మంది పాల్గొనగా ముగ్గురు విజేతలుగా నిలిచారు. వారికి కూడా బుధవారం సర్టిఫికెట్, మెమెంటోలు బహుకరించడం జరిగింది. ఫోటో ఎగ్జిబిషన్‌కి కూడా 23మంది నుండి 82 ఫోటోలు రాగా ఉత్తమ 40 ఫోటోలు ప్రదర్శనలో ఉంచడం జరిగింది. ఈ యొక్క ప్రదర్శన మరో రెండు రోజులు కొనసాగనుంది. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ ఎకో టూరిజం శిరీష, రంగారెడ్డి డివిజన్ డిఎం వి.తనూజ, ఎఫ్ఆర్ఒ శ్రీనివాస్, ప్లాంటేషన్ మానేజర్ వి.లక్ష్మారెడ్డి, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాసు రెడ్డి, ప్రాజెక్ట్స్ మానేజర్ సుమన్, డా. ఐ.వీర కిషోర్, నేచురలిస్ట్ అపరంజని, సూపెర్వైసర్ రాజు, ఎకో టూరిజం మరియు టి.జి.ఎఫ్.డి.సి. సిబ్బంది పాల్గొన్నారు.

# భారత అభివృద్ధి వేగవంతం

(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలు ఎదురుచూస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఒప్పందం వల్ల యూరోపియన్ యూనియన్‌పై బ్రిటన్ ఆధారపడడం తగ్గుతుందని తెలిపారు. దీంతో పాటు భారత్ లాంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థతో వాణిజ్య భాగస్వామ్యం బలోపేతం అవుతుందని వివరించారు.

### శివాజీ విమానాశ్రయంలో ఘనస్వాగతం

బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌కు ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవ్ రత్, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్ ఆయనకు ఎదురేగి స్వాగతం పలికారు. స్టార్మర్‌తో పాటు పారిశ్రామికవేత్తలు, వర్సిటీల ఉప కులపతులు సహా 125మంది ప్రతినిధులు వచ్చారు. గురువారం జరిగే గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో వారు పాల్గొంటారు. దీనికోసం 75 దేశాలకు చెందిన లక్షమంది ప్రతినిధులు, 7,500 కంపెనీల నుంచి 800 మంది వక్తలు హాజరు కానున్నారు. అంతకుముందు బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు చెందిన 9100 విమానంలో స్టార్మర్ ముంబైకి వచ్చే క్రమంలో విమానంలోని కాక్‌పిట్ వద్దకు వెళ్లి ఇంటర్‌కామ్ ద్వారా ప్రయాణికులతో మాట్లాడారు. ''ఇది ఎయిర్ సేఫ్టీ ప్రకటన కాదు. కాక్‌పిట్‌లో ఉన్నది మీ ప్రధానమంత్రి స్టార్మర్. ప్రయాణికులందరికీ హృదయపూర్వక స్వాగతం. మీరంతా విమానంలో ఉండటం అద్భుతంగా ఉంది. ఇప్పటివరకు జరగనివిధంగా భారత్ యూకే మధ్య వాణిజ్య ఒప్పందం కుదరనుంది. మా కొత్త స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలోని అన్ని అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకునేందుకు మీతో కలిసి పనిచేసేందుకు చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. అందరూ విమాన ప్రయాణాన్ని ఆస్వాదించండి. తర్వాత మరిన్ని విషయాలను మీకు అందిస్తా. థాంక్యూ'' అని స్టార్మర్ చెప్పారు.

### నేడు ఇద్దరు ప్రధానుల చర్చలు

బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌కు స్వాగతం పలికారు ప్రధాని నరేంద్ర మోదీ. భారీ వాణిజ్య ప్రతినిధి బందంతో ప్రధానిగా తొలిసారిగా భారత్ పర్యటనకు వస్తున్న ప్రధాని స్టార్మర్‌కు స్వాగతమంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కాగా, భారత్‌బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీయే)లో పదేళ్ల మార్గసూచీకి అనుగుణంగా వ్యూహాత్మక భాగస్వామ్య పురోగతిపై ఇద్దరు ప్రధానులు ఆర్థిక రాజధాని ముంబైలో చర్చించనున్నారు. ఈ ఏడాది జులైలో భారత్‌బ్రిటన్ మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. సంబంధించిన ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమక్షంలో ఇరుదేశాల వాణిజ్యశాఖ మంత్రులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. దీని ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం కావడంతోపాటు ఏటా 34 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతుందని భావిస్తున్నారు.

# ...ఇచ్చిపుచ్చుకున్న హమాస్, ఇజ్రాయెల్

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. చర్చల నేపథ్యలో ఖలీల్ హయ్యా ఈజిప్టు టీవీ ఛానల్ 'అల్‌-క్వహెరా'తో మాట్లాడుతూ, యుద్ధం ముగింపు, గాజాలో ఇజ్రాయెల్ దురాక్రమణ ఉపసంహరణ లక్ష్యంతో తాము ఇక్కడికి వచ్చామన్నారు. ఇజ్రాయెలీ బందీలను విడుదల చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మరణించిన బందీల మృతదేహాలు కూడా స్వాధీనం చేస్తామన్నారు. అదేసమయంలో పాలస్తినా జైళ్ళలో ఉన్న వందలమంది ఖైదీలను విడుదల చేయాలని, ఆ జాబితా తమకు ఇవ్వాలని హయ్యా కోరారు. అరబ్, ఇస్లామిక్ దేశాల నాయకులు, ఇతర తమ సోదరులు చర్చల పునరుద్ధరణకు చేస్తున్న కృషికి అంతర్జాతీయ ప్రపంచంతోపాటు ముఖ్యంగా యుద్ధం ముగించేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్న డోనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. దోహాలో ఇజ్రాయెల్ చేసిన దాడి నుండి తప్పించుకున్న హమాస్ నేత హయ్యా ఆ తర్వాత మొదటిసారి ఈ ఇంటర్వ్యూ ద్వారా బాహ్య ప్రపంచానికి కనిపించారు. గాజాలో యుద్ధం ముగించేందుకు ట్రంప్ ప్రతిపాదించిన 20 అంశాల ప్రణాళికకు గడచిన శుక్రవారం (అక్టోబరు 3వతేదీ) హమాస్ కొన్ని మినహాయింపులతో అంగీకారం తెలియజేసింది. ఇజ్రాయెల్ బందీలను, పాలస్తినా ఖైదీలను పరస్పరం విడుదల చేసేందుకు వీలైన కార్యాచరణపై ఈజిప్టు-ఖతార్ మధ్యవర్తుల సమక్షంలో ఇజ్రాయెల్-హమాస్ ప్రతినిధులమధ్య పరోక్ష చర్చలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎర్రసముద్ర తీరప్రాంత ఈజిప్టుదేశ నగరం షర్మ్-ఎల్-షేక్‌లో జరుగుతున్న ఈ చర్చల్లో అమెరికా ప్రభుత్వం తరపున కూడా ఇద్దరు ప్రతినిధులు పాల్గొంటున్నారు. హమాస్ తరపు బృందానికి ఆ సంస్థ అగ్రనాయకుడు ఖలిల్ హయ్యా నాయకత్వం వహిస్తున్నారు. దోహాలో ఖలిల్ హయ్యా, ఇతర హమాస్ అగ్రనాయకులను లక్ష్యంగా చేసుకుని గతనెలారంభంలో ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసింది. కానీ ఈ దాడుల నుండి హమాస్ నాయకులు బయటపడ్డారు. వారు ఎక్కడున్నాగానీ వెతికి పట్టుకుని మరీ హతమారుస్తామని ఇజ్రాయెల్ శపథం చేసింది. కానీ ఇప్పుడు అదే నాయకుడు ఖలీల్ హయ్యా నాయకత్వంలో ఉన్న ప్రతినిధిబృందంతోనే ఇజ్రాయెల్ ప్రతినిధిబృందం ఇప్పుడు ఈజిప్టులో పరోక్ష చర్చల్లో పాల్గొంటున్నది. గాజాలో యుద్ధం ప్రారంభమై బుధవారంనాటికి 733 రోజులు గడిచాయి. హమాస్ వద్ద ఇంకా 48 మంది బందీలు ఉన్నారు. వీరిలో 20 మంది మాత్రమే సజీవులుగా ఉన్నారు. గాజాలో ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధంలో రెండేళ్ళుగా 67,183 మంది పాలస్తీనియన్లు మరణించారు. వేలమంది శిథిలాల్లో కూరుకుపోయారు. 15నెలలపాటు గాజాపై ఎడతెగని దాడులు చేశాక ఒక ఒప్పందం జరిగింది. దీంతో 45రోజులు బలవంతంగా యుద్ధవిరామం పాటించారు. ఈ సమయంలో 25 మంది బందీలను, మృతదేహాలను హమాస్ స్వాధీనం చేయగా, ఇజ్రాయెల్ జైళ్ళనుండి 1700మంది పాలస్తినా ఖైదీలను విడుదల చేసింది. తర్వాత ఈ ఏడాది మార్చి 18న ఇజ్రాయెల్ తిరిగి యుద్ధం ప్రారంభించి మొదటిరోజే 400 మంది పాలస్తీనియన్లను పొట్టనపెట్టుకుంది. ఈ యుద్ధంలో ఇప్పటివరకూ అనేకమంది అగ్రశ్రేణి హమాస్ నాయకులను ఇజ్రాయెల్ మట్టుపెట్టింది. 400మంది ఇజ్రాయెల్ సైనికులు ఈ యుద్ధంలో మరణించారు. గాజాలో మొత్తం 36 ఆసుపత్రులు ఉండగా 22 ఆసుపత్రులను ఇజ్రాయెల్ సైన్యం నేలమట్టం చేసింది. పాలస్తినా ప్రిజనర్స్ సొసైటీ (పిపిఎస్) సమాచారం ప్రకారం యుద్ధం మొదలయ్యేనాటికి ఇజ్రాయెల్ జైళ్ళలో 11,100మంది పాలస్తీనియన్లు ఖైదీలుగా ఉన్నారు. వీరిలో 53 మంది మహిళలు, మరో 400మంది పిల్లలు కూడా ఉన్నారు. తాజాగా బుధవారంనాడు గాజాలో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఎనిమిదిమంది పాలస్తీనియన్లు మరణించారు.

### ఒప్పందం ఖరారైతే ఈజిప్టు రండి : ట్రంప్‌కు ఆహ్వానం

ఇజ్రాయెల్-హమాస్ ప్రతినిధులమధ్య పరోక్ష చర్చల్లో మధ్యవర్తుల ద్వారా గాజాలో యుద్ధ విరమణకు ఒప్పందం కుదరితే తమ దేశానికి రావాల్సిందిగా ఈజిప్టు దేశాధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్‌సిసి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఆహ్వానం పలికారు. షర్మ్-ఎల్-షేక్‌లో బుధవారం జరిగిన పోలీస్ అకాడమీ గ్రాడ్యుయేషన్ ఉత్సవ సభలో మాట్లాడుతూ, చర్చలు విజయవంతమైతే ఈ ఒప్పందంపై సంతకాలు చేయాడానికి తమ దేశానికి రావాలని ట్రంప్‌ను ఎల్‌సిసి ఆహ్వానించారు. చర్చల పురోగతి ఎంతో ప్రోత్సాహకరంగా ఉందన్నారు. ఈ చర్చల ద్వారా ఒక పెద్ద ముందంజ వేసేందుకు ట్రంప్ చూపిస్తున్న శ్రద్ధ, ఆయనకున్న పట్టుదలను ఆయన ప్రశంసించారు. ఈ ఒప్పందం కుదిరితే యుద్ధ విరమణ జరుగుతుంది. ఇజ్రాయెల్ బందీలు విడుదలవుతారు. పాలస్తినా ఖైదీలు విడుదలవుతారు.గాజాలో ప్రజలకు మానవతా సహాయం పుష్కలంగా లభిస్తుందన్నారు. అదేవిధంగా గాజాను పూర్తిగా పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com